తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

# జనంసాక్షి

www.janamsakshi.org

గురువారం 18.06.2026 | సంపుటి : 12 సంచిక : 329 | పేజీలు : 12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698




# పవనాలూ.. ప్రత్యేకహోదా ఏమైందీ?



## తెలంగాణ నేతల్ని తర్వాత ప్రశ్నిద్దువు.. ప్రధాని మోదీని కనీసం అడిగావా..?

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన జరిగి దశాబ్దానికిపైగా గడిచిపోయింది. విభజన సమయంలో పార్లమెంట్ సాక్షిగా ఇచ్చిన అనేక హామీలు ఇప్పటికీ పూర్తిగా అమలు కాలేదు. వాటిలో అత్యంత ముఖ్యమైనది ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా. రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, పరిశ్రమల స్థాపనకు, ఉపాధి అవకాశాల పెరుగుదలకు ప్రత్యేక హోదా కీలకమని అప్పట్లో అన్ని రాజకీయ పార్టీలు వాదించాయి. కానీ నేడు ఆ అంశం రాజకీయ చర్చల్లో క్రమంగా వెనక్కి నెట్టబడుతోంది. ఈ నేపథ్యంలో జనసేన అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వైఖరి చర్చనీయాంశంగా మారింది. తెలంగాణకు సంబంధించిన అంశాలపై, రాజకీయ పరిణామాలపై, ప్రాంతీయ స్వాభిమానంపై తరచూ స్పందిస్తున్న ఆయన.. ఏపీ ప్రజల చిరకాల డిమాండ్‌ను విస్మరిస్తున్నారు. ప్రత్యేక హోదా విషయంలో అదేస్థాయిలో గళం వినిపించడం లేదనే విమర్శలు ఎదుర్కొంటున్నారు.

- పార్లమెంట్‌లో ప్రకటన, నెల్లూరులో ప్రధాని వ్యాఖ్యల్ని మరిచిపోయావా?
- ఉప ముఖ్యమంత్రి హోదాలో ఢిల్లీకి వెళ్లి ఎన్నిసార్లు డిమాండ్ పెట్టారు
- అధికార కూటమిలో ఉండి కేంద్రాన్ని నిలదీయడం లేదెందుకు..?
- తెలంగాణపై వ్యాఖ్యలతో ఆంధ్రాలో విమర్శల ఎదురుదెబ్బలు



హైదరాబాద్, జూన్ 17 (జనంసాక్షి) : గతంలో ప్రత్యేక హోదా కోసం కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన పవన్ కల్యాణ్, ప్రస్తుతం భారతీయ జనతా పార్టీకి మిత్రపక్షంగా ఉన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో సన్నిహిత రాజకీయ సంబంధాలు కొనసాగిస్తున్న ఆయన, ప్రత్యేక హోదా హామీ అమలుపై బహిరంగంగా ఒత్తిడి తీసుకురా వడం లేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని నిలదీయాల్సిన నాయకులు మౌనం వహిస్తే ప్రజల ఆకాంక్షలకు న్యాయం ఎలా జరుగుతుందనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. తెలంగాణ గురించి మాట్లాడటంలో తప్పేమీ లేకపోయినా.. ముందు తన రాష్ట్రానికి సంబంధించిన కీలక సమస్యల పరిష్కారంపై చొరవ చూపడం ప్రజాప్రతినిధుల బాధ్యత. తెలంగాణ రాజకీయాలపై స్పందిస్తున్న ఆయన ఏపీ ప్రత్యేక హోదా అంశాన్ని కూడా అంతే చొరవతో కేంద్రం దృష్టికి తీసుకెళ్లాల్సిన బాధ్యత ఉంది.

**ఏదీ మీ కార్యాచరణ..?**

ప్రత్యేక హోదా కోసం గతంలో పవన్ కల్యాణ్ బహిరంగ సభల్లో గట్టిగా మిగతా 2లో..

# ప్రభుత్వపాఠశాలల్లో చదవడం గర్వంగా భావించాలి



## ఇక్కడే మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తాం



- సర్కార్ బడుల నుంచే ఐఏఎస్,ఐపీఎస్‌లు వచ్చారు
- అందరికీ విద్య లక్ష్యంగా తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు
- కులమతాలకు అతీతంగా విద్య అందించాలన్న లక్ష్యం
- ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో
- తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డి

రంగారెడ్డిప్రతినిధి(జనంసాక్షి): ప్రభుత్వ పాఠశాలల ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరమని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ బడుల్లో చదివి ఐఏఎస్, ఐపీఎస్, సీఎంలు అయినవాళ్లు ఉన్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదవటం నామోషీ అనే ఆలోచన పోవాలని అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లాలోని ఆరుట్లలో తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. ఆరుట్లలో రూ.15 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో ఏర్పాటు చేసిన తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను సీఎం ప్రారంభించారు. స్కూల్‌లో డిజిటల్ క్లాస్‌రూమ్స్, లైబ్రరీ, ల్యాబ్స్, అత్యాధునిక కిచెన్, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి అల్పాహారం తిన్నారు. ఆహ్లాదకరంగా ఏర్పాటు చేసిన మైదానంలో సరదాగా విద్యార్థులతో ఫుట్‌బాల్ ఆడారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ స్కూల్‌ను సర్కార్ నిర్మించింది. స్కూల్ ప్రారంభోత్సవం సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో సీఎం మాట్లాడుతూ.. ఆరుట్ల పాఠశాలను పైలట్ ప్రాజెక్టుగా నిర్మించామని తెలిపారు. విద్యాశాఖపై ప్రభుత్వం రూ.27 వేల కోట్లు ఖర్చు చేస్తోందని వెల్లడించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యపై తల్లిదండ్రులకు అపోహలు ఉన్నాయని.. అందరి అపోహలు తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. మిగతా 2లో..

# రెండోవిడత ఇందిరమ్మ ఇళ్లలో గుడిసెవాసులకు ప్రాధాన్యం

## 75 వేల గుడిసెవాసుల దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన : మంత్రి పొంగులేటి



హైదరాబాద్(జనంసాక్షి):ఇందిరమ్మ ఇళ్లు రెండో విడతలో గుడిసె వాసులకే తొలి ప్రాధాన్యం ఇస్తామని తెలంగాణ గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. బుధవారం హైదరాబాద్‌లో ఇందిరమ్మ ఇళ్లపై గృహ నిర్మాణ శాఖ ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా గుడిసెల గుర్తింపునకు ప్రత్యేక సర్వే నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. 75 వేల గుడిసెవాసుల దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన చేస్తామన్నారు. అర్హుల ఎంపిక పూర్తి పారదర్శకతతో చేపడతామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేయని గుడిసె వాసులకు మరో అవకాశం ఇస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు. మిగతా 2లో..

# దండుపాళ్యం బ్యాచ్ రాష్ట్రాన్ని దోచుకుంటోంది



## రాష్ట్రంలో సంక్షేమం లేదు..అంతా సంక్షోభమే: కేటీఆర్

ఖమ్మం(జనంసాక్షి):రాష్ట్రంలో సంక్షేమం లేదని.. ఎక్కడ చూసినా కూల్చివేతలే అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణలో రాక్షస పాలన సాగుతోందని ఆయన విమర్శించారు. దండుపాళ్యం ముఠాకు అధ్యక్షుడు రేవంత్ రెడ్డి అయితే ఇక్కడ మంత్రులు ఆయనను మించిపోయారంటూ దుయ్యబట్టారు. రెవెన్యూ మంత్రి అవినీతికి హద్దు లేకుండా పోయిందని ఆరోపించారు. ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటించారు. పాలేరు నియోజకవర్గం వెంకటగిరిలో బూత్‌లెవల్ కార్యకర్తల శిక్షణా కార్యక్రమంలో మిగతా 2లో..

# దొంగను పట్టే బదులు బాధితుడి ఇంటికి తాళం వేస్తారా?

## టెలిగ్రామ్ తాత్కాలిక బ్యాన్‌పై రాహుల్ ఆగ్రహం

## రేపు వాట్సాప్ కూడా రద్దు చేస్తారా అని ప్రశ్న



న్యూఢిల్లీ,జూన్17(జనంసాక్షి): నీట్‌-యూజీ రీ-ఎగ్జామ్ నేపథ్యంలో టెలిగ్రామ్ యాప్‌ను తాత్కాలికంగా నిషేధించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం వివాదాన్ని రేకెత్తించింది. కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ, ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజీవ్రాల్ సహా ప్రతిపక్ష నాయకులు ఈ చర్యను తీవ్రంగా విమర్శించారు. 'ఈ చర్య నిజంగా పేపర్ లీక్‌లను నిరోధిస్తుందా' అని వారు సందేహాలు వ్యక్తం చేశారు. పరీక్షా పేపర్ లీక్‌లను అరికట్టడంలో విఫలమైన ప్రభుత్వం విద్యార్థులను లక్ష్యంగా చేసుకుంటోందని ఆరోపించారు 'పేపర్ లీక్ మాఫియాపై చర్యలు తీసుకోవాల్సింది పోయి, టెలిగ్రామ్‌ను నిషేధించారు. ఇది సమస్యకు పరిష్కారం కాదు. దొంగలను పట్టుకోలేక, బాధితుల తలుపులకు తాళం వేస్తున్నారు. లక్షలాది మంది విద్యార్థులు ఏళ్లుగా టెలిగ్రామ్‌ను ఉపయోగించుకుని మిగతా 2లో..



# లాభదాయక వ్యవసాయం వైపు తెలంగాణ అడుగులు

- రైతు సంక్షేమమే ప్రభుత్వ సంకల్పం
- పేదలు సన్న బియ్యం తినాలి
- రైతులు ఆర్థికంగా ఎదగాలి
- కేబినెట్ సబ్ కమిటీ సమావేశంలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

హైదరాబాద్(జనంసాక్షి):రైతాంగాన్ని అదుకునేందుకు ప్రజాప్రభుత్వం ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. బాబాసాహెబ్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన కేబినెట్ సబ్ కమిటీలో చెప్పారు. జాతీయంగా, అంతర్జాతీయంగా డిమాండ్ ఉన్న మేలు రకాల సాగుకు రైతులను ప్రోత్సహించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. పేదలు కూడా సన్న బియ్యం తినాలి.. రైతులను ఆర్థికంగా ఆదుకోవాలి అనే సంకల్పంతో ప్రజా ప్రభుత్వం నిర్ణయాలను తీసుకుని ముందుకు వెళుతోందని ఆయన అన్నారు. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధ్యక్షతన సచివాలయంలో జరిగిన కేబినెట్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర్ రావు హాజరయ్యారు. రాష్ట్రంలో వ్యవసాయ ఉత్పత్తి, ధాన్యం కొనుగోలు కార్యకలాపాలు, నిల్వ సదుపాయాలు, వానకాలం సాగు పై కేబినెట్ సబ్ కమిటి చర్చించింది. ఈ సందర్భంగా రైతులకు లాభదాయకమైన ఃఖు 5204, తెలంగాణ సోనా ఐఔఓ-1638, జై శ్రీరామ్, హెచ్ఎంటీ రకాల వంగడాలను రైతులు పెద్ద ఎత్తున సాగు చేసుకునేలా మిగతా 9లో..



# పేదదేశాలకు ఆర్థిక తోడ్పాటును అందించాలి

- అందుకోసం అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు ముందుకు రావాలి
- 'అందరికీ సమాన, స్థిర ఆర్థిక వృద్ధి అంశం'పై చర్చ జరపడం మంచి విషయం
- యుద్ధంతో ఇంధన సంక్షోభంలో ప్రపంచం
- మానవాళి పురోగతి, శ్రేయస్సు కోసం అంతర్జాతీయ భాగస్వామ్యాలు అత్యవసరం
- జీ-7లో మోదీ కీలక వ్యాఖ్యలు

ఫ్రాన్స్(జనంసాక్షి):ఫ్రాన్స్‌లోని ఎవియాన్-లే-బేలో బుధవారం జరిగిన జీ-7 కూటమి దేశాల సమావేశంలో ప్రధాని మోదీ కీలక వ్యాఖ్యలు చేశారు. జీడీపీ, వాణిజ్య గణాంకాలను దాటి, ఆర్థిక వృద్ధిపై చర్చలు ఉండాలన్నారు. 'అందరికీ సమాన, స్థిర ఆర్థిక వృద్ధి అంశం'పై చర్చ జరపడం మంచి విషయమన్నారు. "వృద్ధి గురించి ప్రస్తావన వస్తే.. జీడీపీ, వాణిజ్య గణాంకాలు ప్రధానంగా ఉండకూడదు. ఎవరిది వృద్ధి? ఎవరికి వృద్ధి? అది ఏ దిశలో ఉంది? అనే అంశాలను చర్చించాలి" అని మోదీ పేర్కొన్నారు. మిగతా 9లో..


# హర్మూజ్‌లో ఆంక్షలుండొద్దు

- జలసంధిలో అక్కడ స్వేచ్ఛా వాణిజ్యం జరగాలి
- భారత నావికుల భద్రతే మాకు ముఖ్యం: ట్రంప్‌తో మోదీ
- భారత్‌కు అండగా ఉంటామన్న అమెరికా అధ్యక్షుడు

ఫ్రాన్స్(జనంసాక్షి):హర్మూజ్ జలసంధి వద్ద ఎలాంటి ఆంక్షలు ఉండొద్దని, అక్కడ స్వేచ్ఛా వాణిజ్యం జరగాలని ప్రధాని మోదీ అన్నారు. అక్కడ వేలాది మంది భారత నావికుల భద్రతే తమకు ముఖ్యమని, వారికి రక్షణ కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఫ్రాన్స్‌లో జరుగుతున్న జీ7 సదస్సులో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో ప్రధాని మోదీ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ద్వైపాక్షిక అంశాలపై చర్చలు జరిపారు. ప్రధాని మోదీ మాట్లాడుతూ.. పశ్చిమాసియాలో మిగతా 2లో..



# అది కేవలం అవగాహన ఒప్పందమే



## ఇదే ఫైనల్ కాదు.. నచ్చకపోతే మళ్లీ దాడులే: ట్రంప్

వాషింగ్టన్(జనంసాక్షి):ఇరాన్ లక్ష్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి హెచ్చరికలు జారీ చేశారు. ఇరాన్‌తో తాము చేసుకోబోయేది కేవలం అవగాహన ఒప్పందమేనని.. అది ఫైనల్ కాదని పేర్కొన్నారు. ఒకవేళ అందులోని అంశాలు తనకు నచ్చకపోతే, ఇరాన్ తీరు సరిగ్గా లేకపోతే.. ఆ దేశంపై మళ్లీ బాంబులు వేస్తామన్నారు. జీ7 సదస్సు నేపథ్యంలో ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న ట్రంప్ ఈ తరహా వ్యాఖ్యలు చేశారు. మరో రెండు రోజుల్లో అవగాహన ఒప్పందంపై ఇరుదేశాలూ సంతకాలు చేయనున్న వేళ ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.అమెరికా- ఇరాన్ ఒప్పందంలో భాగంగా పునర్నిర్మాణ నిధుల కింద టెహ్రాన్‌కు 300 బిలియన్ డాలర్లు సమకూర్చే అంశం ఉందని వస్తున్న వార్తలు అవాస్తవమని ట్రంప్ తెలిపారు. తాము ఒక్క పైసా కూడా వెచ్చించడం లేదన్నారు. "మేం పెట్టుబడి పెట్టడం లేదు. మా దగ్గర అటువంటి ఫండ్ ఏదీ లేదు. ఇరాన్ లో పెట్టుబడులు పెట్టాలని గల్ఫ్ దేశాలనూ కోరడం లేదు. మిగతా 2లో..

### 'యూఎస్ ఇండో-పసిఫిక్ కమాండ్.. ఇక.. 'యూఎస్ పసిఫిక్ కమాండ్'

- 'ఇండో' తీసేసి.. భారత చిత్రపటాన్ని మార్చి..
- వివాదాస్పదంగా అమెరికా నిర్ణయం
- క్వాడ్ అంతానికి మరో మేకు.. మండిపడ్డ కాంగ్రెస్

2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
18.06.2026

## దొంగను పట్టే బదులు బాధితుడి ఇంటికి తాళం వేస్తారా?

నోట్స్, టెస్ట్ సిరీస్‌లు, డిస్కషన్‌లతో చదువుకుంటున్నారు. ఆ సౌకర్యాన్ని లాక్కోవడం పేపర్ లీక్‌లకు పరిష్కారం ఎలా అవుతుంది' అని సోషల్ మీడియా ద్వారా రాహుల్ విమర్శించారు. అరవింద్ కేజ్రీవాల్ కూడా ఈ అంశంపై స్పందించారు. 'ఈ రోజు టెలిగ్రామ్‌ను నిషేధించారు. రేపు వాట్సాప్‌ను కూడా నిషేధిస్తారా?' అంటూ కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రశ్నించారు. మరోవైపు ఈ నిషేధాన్ని సవాలు చేస్తూ టెలిగ్రామ్, ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. టెలిగ్రామ్ వ్యవస్థాపకుడు పావెల్ దురోవ్ కూడా ఈ చర్యపై అభ్యంతరం వ్యక్తం చేశారు. 'ఇది 15 కోట్లకు పైగా భారతీయ వినియోగదారులను శిక్షించడమే. ఈ చర్య అసలు లీక్‌లను ఆపదు' అని వ్యాఖ్యానించారు.

## 'యూఎస్ ఇండో-పసిఫిక్ కమాండ్.. ఇక 'యూఎస్ పసిఫిక్ కమాండ్'



**వాషింగ్టన్(జనంసాక్షి):**ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ తమకు కీలకమైన వ్యూహాత్మక భాగస్వామి అని ఒకప్పుడు చాటిచెప్పిన అమెరికా.. ఇప్పుడు గట్టి షాకిచ్చింది. ఈ ప్రాంతంలో పనిచేసే అగ్రరాజ్య సైనిక కమాండ్ పేరు నుంచి 'ఇండో' అనే పదాన్ని తీసేసింది. అంతేకాదు.. భారత చిత్రపటాన్ని కూడా మార్చి చూపించడం వివాదాస్పదమైంది. జీ-7 సదస్సులో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత ప్రధాని నరేంద్రమోదీ మధ్య ద్వైపాక్షిక భేటీ జరగనున్న వేళ ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం.అమెరికాకు చెందిన చారిత్రక 'యూఎస్ ఇండో-పసిఫిక్ కమాండ్' పేరును మళ్లీ 'యూఎస్ పసిఫిక్ కమాండ్'గా మార్చినట్లు అగ్రరాజ్య రక్షణశాఖ వెల్లడించింది. "చారిత్రక మూలాలను గౌరవించడం, పసిఫిక్‌లో సేవలందించే సైనికుల్లో స్ఫూర్తి పెంపొందించడం కోసం ఈ కమాండ్‌కు పాత పేరునే కొనసాగించాలని నిర్ణయించాం" అని అమెరికా రక్షణశాఖ పేర్కొంది. ఇక, ఈ కమాండ్ ఎక్కడెక్కడ పనిచేస్తుందో తెలుపుతూ తమ వెబ్‌సైట్‌లో ఓ ఫొటోను ఉంచింది. అందులో 'పాక్ ఆక్రమిత కశ్మీర్'ను పాకిస్థాన్ భూభాగంగా చూపించడం వివాదానికి దారితీసింది. యూఎస్ పసిఫిక్ కమాండ్‌ను 1947 జనవరి 1న నాటి అమెరికా అధ్యక్షుడు హ్యారీ ఎస్. ట్రుమ్యాన్ ఏర్పాటుచేశారు. అగ్రరాజ్య వెస్ట్ కోస్ట్ నుంచి భారత పశ్చిమతీరం వరకు గత ఏడు దశాబ్దాలకు పైగా ఈ కమాండ్ సేవలందిస్తోంది. రెండో ప్రపంచయుద్ధం తర్వాత ప్రాంతీయ స్థిరత్వంలో ఈ దళం కీలక పాత్ర పోషించింది. కొరియన్, వియత్నాం యుద్ధాల్లోనూ పనిచేసింది. ఎన్నో మానవతా ఆపరేషన్లను చేపట్టింది.అయితే, ట్రంప్ తొలి దఫా అధికారంలో ఉన్న సమయంలో 2018లో దీని పేరును 'యూఎస్ ఇండో-పసిఫిక్ కమాండ్'గా మార్చారు. హిందూ మహాసముద్రం, పసిఫిక్ మహా సముద్రాల మధ్య పెరుగుతున్న అనుసంధానతను గుర్తించి దీని పేరులో 'ఇండో' అనే పదం చేర్చినట్లు నాటి అమెరికా రక్షణ మంత్రి జేమ్స్ మ్యాటిస్ వెల్లడించారు. అయితే, ఎనిమిదేళ్ల తర్వాత అమెరికా ఇప్పుడు యూటర్న్ తీసుకోవడం చర్చనీయాంశంగా మారింది. వ్యూహాత్మక రక్షణ వ్యవహారాల్లో భారత్‌ను అగ్రరాజ్యం దూరం పెడుతోందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఈ పరిణామాలపై కాంగ్రెస్ నేత శశిథరూర్ స్పందించారు. 'క్వాడ్ అంతానికి మరో మేకు' అని ఎక్స్ వేదికగా రాసుకొచ్చారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో సైనిక ప్రాబల్యం పెంచుకుంటున్న చైనాకు అడ్డుకట్ట వేసేందుకు భారత్, అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్ కలిసి క్వాడ్‌గా ఏర్పడిన సంగతి తెలిసిందే. అయితే, ఇటీవల కాలంలో ఈ కూటమి బలహీనపడుతోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## హర్మూజ్‌లో ఆంక్షలుండొద్దు

శాంతి కోసం ట్రంప్ కృషి చేశారని, హర్మూజ్ తెరవడంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు మేలు జరిగిందన్నారు. ఇరు దేశాల మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం జరగనుందని చెప్పారు.

భారత్‌కు అండగా ఉంటాం : ట్రంప్

ప్రధాని మోదీతో భేటీ సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మోదీ అధికారంలో ఉన్నంత కాలం ఎవరైనా దాడి చేస్తే.. భారత్‌కు అమెరికా అండగా ఉంటుందని నవ్వుతూ చెప్పారు. ప్రధాని మోదీ తనకు చిరకాల మిత్రుడని, బేరసారాల్లో ఆయన నిక్కచ్చిగా ఉంటారని అన్నారు. పెట్టుబడుల విషయంలో ఆయన సహకరిస్తున్నారని, అందుకు అభినందిస్తున్నామన్నారు. నేవీ సిబ్బంది భద్రత విషయంలో భారత్‌తో కలిసి పని చేస్తామన్నారు. భవిష్యత్తులో భారత్‌లో పర్యటిస్తానని అన్నారు.

## అది కేవలం అవగాహన ఒప్పందమే

ఒకవేళ వారు ముందుకొస్తే మాకు అభ్యంతరం లేదు. అయితే.. ఇరాన్ ధోరణి ఎలా ఉంటుందో ఒక అవగాహన వచ్చేవరకు కొంతకాలం పాటు ఆ దేశాలు అటువంటి పని చేయకపోవచ్చు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

## పుల్వామా తరహాలో మరో దాడికి ఎత్తు

### ఐఎస్ఐ ఉగ్రవాదుల ముఠా అరెస్ట్

న్యూఢిల్లీ(జనంసాక్షి):పాకిస్థాన్ గూఢచారి సంస్థ అయిన ఐఎస్ఐ మద్దతుతో భారత్‌లో కార్యకలాపాలు సాగిస్తున్న అంతర్జాతీయ ఉగ్రముఠాను ఢిల్లీ పోలీసులు ఛేదించారు. ఈ కేసులో ఏడుగురిని అరెస్ట్ చేయగా.. వారిలో ఆరుగురు ఉత్తర్‌ప్రదేశ్‌లోని గాజియాబాద్ వాసులుగా పోలీసులు గుర్తించారు.గాజియాబాద్‌లో అరెస్టయిన ఆరుగురిలో నలుగురు గతంలో పుల్వామా ప్రాంతాన్ని సందర్శించినట్లు పోలీసులు గుర్తించారు. అక్కడి నుంచి సున్నితమైన సమాచారాన్ని పాక్‌కు పంపినట్లు అనుమానిస్తున్నారు. పుల్వామా తరహాలో మరో పెద్ద దాడికి పాక్ ప్లాన్ చేస్తోందనే కోణంలో దర్యాప్తు సాగిస్తున్నారు. ఈ ముఠా ఢిల్లీ నుంచి జమ్మూ వరకు గల ప్రముఖ రైల్వే స్టేషన్ల వద్ద సోలార్ సంబంధిత సీసీటీవీ కెమెరాలు ఏర్పాటుచేసి భారత సైనికుల కదలికలను గుర్తించేందుకు యత్నించినట్టు పోలీసులు వెల్లడించారు. ఇప్పటికే వీరు ఢిల్లీలోని కాంట్, హరియాణాలోని సోనిపట్ రైల్వే స్టేషన్ల వద్ద అలాంటి కెమెరాలను అమర్చినట్టు గుర్తించారు. దర్యాప్తులో మరో కీలక అంశం వెలుగులోకి వచ్చింది. భారతీయ ఫోన్ నంబర్లకు వచ్చే ఓటీపీలను విదేశీయులకు పంపిస్తూ వాట్సాప్, సోషల్ మీడియా అకౌంట్లను నిర్వహించుకునేందుకు సహకరించినట్లు పోలీసులు గుర్తించారు. ఇందుకు రూ.500 నుంచి రూ.5 వేల వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. సిమ్ కార్డుల చోరీ, గతంలోనే యాక్టివేట్ చేసిన సిమ్‌లను కొనుగోలు చేయడం వంటివి వినియోగించినట్లు సమాచారం. ఆర్థిక లావాదేవీలనూ తమ సొంత అకౌంట్ల ద్వారా కాకుండా జనసేవా కేంద్రాలు, స్థానిక దుకాణాల ద్వారా నగదు రూపంలో స్వీకరించి పోలీసుల కళ్లుగప్పేందుకు యత్నించినట్టు అధికారులు తేల్చారు. ఈ కేసులో మరికొందరి ప్రమేయంపైనా విచారణ కొనసాగుతోందని, దేశ భద్రతకు ముప్పుగా మారే ఇలాంటి నెట్‌వర్క్‌లపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో చదవడం

# గర్వంగా భావించాలి





విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేసేందుకే విద్యా కమిషన్ వేశామని ముఖ్యమంత్రి తెలిపారు. విద్య మాత్రమే మన జీవితాలను సమూలంగా మార్చగలదన్నారు. విద్య ఖర్చు కాదని.. పెట్టుబడి అని చెప్పుకొచ్చారు. విద్యతో సమాజంలో మార్పు తీసుకురావాలని ప్రయత్నిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వం వర్గానికొక స్కూల్ పెట్టి కుల వ్యవస్థను ప్రోత్సహించిందని సీఎం విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ అంటూ కులానికొక స్కూల్ పెట్టారన్నారు. కుల వ్యవస్థను నిర్మూలించేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లు నిర్మిస్తున్నామని వివరించారు. మెస్సీని హైదరాబాద్‌కు తీసుకువస్తే విమర్శలు చేశారని.. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకే మెస్సీని తీసుకువచ్చామని తెలిపారు. మెస్సీ.. డ్రగ్స్ ముఠా లీడర్ కాదని, ఆర్థిక నేరగాడు కాదన్నారు. గత ప్రభుత్వం యూనిఫామ్‌లు ఇస్తే.. నెల రోజులకే చిరిగి పోయాయని విమర్శిస్తూ.. ఈ ప్రభుత్వం నాణ్యమైన వస్తువులతో విద్యా కిట్ ఇస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 27 లక్షల మంది విద్యార్థులకు తెలంగాణ పబ్లిక్ స్కూల్ స్ఫూర్తినిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. సమాజంలో అసమానతలు పోవాలంటే అందరికీ నాణ్యమైన విద్య అవసరం అన్నారు. త్వరలోనే యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీని ప్రారంభిస్తాం. క్రీడాకారుల్లో స్ఫూర్తి నింపేందుకు మెస్సీని హైదరాబాద్‌కు తీసుకొస్తే విమర్శలు చేశారు. విద్యాకిట్ల పంపిణీ కోసం రూ.680 కోట్లతో టెండర్లు పిలిచాం. రూ.680 కోట్ల టెండర్లలో రూ.2వేల కోట్ల స్కామ్ జరిగిందని ఒకాయన అంటున్నారు.. ఎలా సాధ్యమో చెప్పాలి. విద్యారంగంలో తెలంగాణను దేశానికే ఆదర్శంగా నిలుపుతాం' అని సీఎం అన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ఏమాత్రం తీసిపోని విధంగా పేద విద్యార్థులకు నాణ్యమైన ఉచిత విద్యను అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన తెలంగాణ పబ్లిక్ స్కూల్విద్యా రంగంలో కొత్త అధ్యాయానికి నాంది పలికిందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ విద్యా నమూనా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 25 లక్షల మంది విద్యార్థులకు స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.3 లక్షల కోట్ల బడ్జెట్‌లో విద్యాశాఖ కోసం రూ.8,500 కోట్లను కేటాయించిందని ఆయన వెల్లడించారు. విద్యారంగాన్ని మరింత బలోపేతం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే ఉద్యోగాలు రావన్న అపోహలు పేద ప్రజల్లో ఉన్నాయని, ఆ నమ్మకాన్ని తొలగించేందుకే తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను ఏర్పాటు చేశామని సీఎం వివరించారు. విద్యా కమిషన్ వివిధ జిల్లాలు, రాష్ట్రాలు, దేశాలను సందర్శించి రూపొందించిన నివేదిక ఆధారంగానే ఈ కొత్త విద్యా విధానాన్ని అమలు చేస్తున్నామని తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చెప్పిన 'దేశ భవిష్యత్ తరగతి గదుల్లోనే ఉంది' అనే భావనను స్ఫూర్తిగా తీసుకుని విద్యా రంగంలో మార్పులు తీసుకొస్తున్నామని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్య ద్వారానే సమాజంలో సమూల మార్పు సాధ్యమవుతుందని, అందుకే విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. ఆరుట్ల టీపీఎస్‌లో ఇప్పటికే 1,814 మంది విద్యార్థులు చేరారని సీఎం తెలిపారు. భారీగా దరఖాస్తులు రావడంతో అడ్మిషన్లు లేవని బోర్డు పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. ఈ విజయానికి అక్కడి ఉపాధ్యాయుల కృషే కారణమని, వారు రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. తాను కూడా గ్రామీణ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకున్నానని సీఎం గుర్తు చేసుకున్నారు. ఆరో తరగతి చదవడానికి రోజూ ఆరు కిలోమీటర్లు నడిచి వెళ్లేవాడినని చెప్పారు. తమ కుటుంబం ఆర్థికంగా బాగానే ఉన్నప్పటికీ చదువుకున్నవారు లేరని, 17 ఏళ్ల వయస్సులోనే రాజకీయాల్లోకి వచ్చానని వివరించారు. దేశ ప్రధానులు, రాష్ట్ర ముఖ్యమంత్రులు సహా ఎన్నో ప్రముఖులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదివి ఉన్నత స్థానాలకు చేరుకున్నారని ఆయన పేర్కొన్నారు. సమాజంలో కులాల మధ్య గోడలు నిర్మిస్తున్నారని, ఆ గోడలను కూల్చాలనే ఉద్దేశంతో అన్ని వర్గాల పిల్లలు కలిసి చదివేలా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను నిర్మిస్తున్నామని సీఎం తెలిపారు. విద్య ద్వారా సమానత్వాన్ని పెంపొందించడం ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని రేవంత్ రెడ్డి తెలిపారు. 140 కోట్ల జనాభా ఉన్న దేశం ఒలింపిక్స్‌లో ఆశించిన స్థాయిలో పతకాలు సాధించలేకపోతోందని అన్నారు. ఇటీవల దక్షిణ కొరియాను సందర్శించి అక్కడి క్రీడా విధానాలను అధ్యయనం చేశానని చెప్పారు. 2034 నాటికి తెలంగాణ నుంచి ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించే క్రీడాకారులను తయారుచేయాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు. రాజకీయ స్వార్థంతో కొందరు అభివృద్ధి కార్యక్రమాలను కూడా వ్యతిరేకిస్తున్నారని విమర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన స్కూల్ కిట్లు అందించేందుకు పారదర్శకంగా టెండర్లు నిర్వహించినప్పటికీ.. కొందరు అవినీతి ఆరోపణలు చేస్తున్నారని రేవంత్ రెడ్డి అన్నారు. ఉన్నత విద్యావంతులు కూడా వాస్తవాలు తెలుసుకోకుండా ఆరోపణలు చేయడం బాధాకరమని అన్నారు.

## సైబర్ నేరగాళ్లు పరాన్న జీవులు

- ప్రజలను మోసగించే వారు సమాజానికి చేటు
- అలాంటివారు జైల్లో ఉండడమే కరెక్ట్
- సుప్రీం ధర్మాసనం కీలక వ్యాఖ్యలు

న్యూఢిల్లీ(జనంసాక్షి): సైబర్ నేరస్థులు అమాయక ప్రజలను మోసంచేసి కోట్లాది రూపాయలు కాజేసే పరాన్నజీవులని సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇలాంటి నేరాలకు పాల్పడుతున్న వారిపై చట్టాలను మరింత కఠినతరం చేయాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. ఈ మేరకు ఓ సైబర్ ఫ్రాడ్ కేసులో నిందితుడికి బెయిల్ నిరాకరించి, ఆ పిటిషన్‌ను తిరస్కరిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది న్యాయస్థానం.ఈ పిటిషన్ విచారణ సందర్భంగా.. సీజేఐ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం సైబర్ నేరాలపై పెరుగుతున్న ముప్పుపై ఆందోళన వ్యక్తం చేసింది. ప్రజలను ఆకర్షించి భారీ లాభాలొస్తాయని నమ్మబలికి వారిని మోసగించే వ్యక్తులు సమాజానికి ప్రమాదకరమంది. 'మీరు పరాన్నజీవులు.. పెట్టుబడిదారుల నుంచి డబ్బు తీసుకుని మోసం చేస్తున్నారు. మీలాంటి వారు జైల్లో ఉండటమే సమాజానికి శ్రేయస్కరం. సైబర్ నేరస్థుల విషయంలో మరింత కఠినంగా వ్యవహరించాలి. ఇలాంటి నేరాలు ఎప్పుడూ పాన్ ఇండియా స్థాయిలో జరుగుతూ ఉంటాయి. గుజరాత్‌లో ఒకరు, ఆ తర్వాత ముంబై మరొకరి నుంచి.. ఇలా అందరి నుంచి డబ్బులు వసూలు చేస్తారు' అని ధర్మాసనం పేర్కొంది. సందర్భంగా కోర్టుకు అందించిన వివరాలను ప్రస్తావిస్తూ.. గతేదాది చివరి నాటికి దేశంలో డిజిటల్ మోసాల కారణంగా రూ.3 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్టు పేర్కొంది న్యాయస్థానం. సైబర్ నేరాల తీవ్రతను ఇది విస్పష్టంగా తెలియజేస్తోందని వ్యాఖ్యానించింది. కాగా.. నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో గణాంకాల ప్రకారం.. 2021 నుంచి 2023 మధ్య సుమారు 63 శాతం సైబర్ మోసాలు పెరగడంతో కేసుల సంఖ్య 86 వేల మార్కును దాటింది. వీటిలో కర్ణాటక తొలి స్థానంలో ఉండగా.. తెలంగాణ, ఉత్తర్‌ప్రదేశ్, మహారాష్ట్ర ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

## రెండోవిడతలో ఇందిరమ్మ ఇళ్లలో గుడిసెవాసులకు ప్రాధాన్యం

రెండో విడతలో 2.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపడతామని వివరించారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 2 వేల ఇళ్లు నిర్మిస్తామని వెల్లడించారు. అలాగే రూఫ్ రీప్లేస్‌మెంట్ పథకానికి కూడా ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రతి నియోజకవర్గానికి 500 ఇళ్లు నిర్మిస్తామని.. తద్వారా రాష్ట్రవ్యాప్తంగా 50 వేల కుటుంబాలకు లబ్ది చేకూరుతుందని పేర్కొన్నారు.ప్రమాదకర ఇంటి పైకప్పుల మార్పునకు రూ. 2 లక్షల వరకు సాయం అందిస్తామని పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. అసంపూర్తిగా వదిలిన ఇళ్లను కూడా ఈ పథకంలో ప్రభుత్వం చేర్చనుందన్నారు. లబ్దిదారుడే ఇంటి నిర్మాణదారడని తెలిపారు.

నైతురు ప్రవేశించినా జాడలేని వాన..

– ఎల్‌నినో ప్రభావంతో మళ్లీ పెరిగిన ఉష్ణోగ్రతలు

– మరో వారంపాటు ఇదే పరిస్థితి ఉంటుందన్న ఐఎండి

న్యూఢిల్లీ(జనంసాక్షి):ఎల్‌నినో ప్రభావంతో దేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు పెరుగు తున్నాయి. తెలంగాణలో వచ్చే నాలుగు రోజుల పాటు తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. నైరుతి రుతుపవనాలు దేశంలోని మరిన్ని ప్రాంతాలకు విస్తరిస్తున్నప్పటికీ కనీసం మరో వారం రోజులపాటు విస్తృతమైన వర్షపాతం తక్కువగానే ఉండే అవకాశం ఉంది. జూన్ 23 ప్రాంతంలో పరిస్థితులు మెరుగుపడటం ప్రారంభమయ్యే వరకు వర్షాలు అంతంత మాత్రంగానే ఉంటాయని వాతావరణ పరిస్థితులు సూచిస్తున్నాయి. భారత్‌లోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో రుతుపవనాల కదలిక సాంకేతికంగా కొనసాగుతున్నప్పటికీ వర్షాలను కురిపించే ఆ వ్యవస్థ అసాధారణంగా బలహీనంగా ఉందని వాతావరణ శాఖ అధికారులు పేర్కొన్నారు. జూన్ 15 నుంచి జూన్ 21 మధ్య రుతు పవనాల కార్యకలాపాలు పెద్దగా చురుకుగా ఉండకపోవచ్చని అంచనా. దీనివల్ల దేశంలోని అనేక ప్రాంతాల్లో ఇప్పటికే ఏర్పడిన వర్షపాత లోటు మరింత కొనసాగే అవకాశం ఉంది. రానున్న వారంలో విస్తృతమైన రుతుపవన వర్షాలకు బదులుగా ప్రధానంగా దక్షిణ భారతదేశంలో స్థానిక ఉరుములతో కూడిన వర్షాల ద్వారానే అధిక వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సరిహద్దు ప్రాంతాలు, అలాగే తూర్పు కనుమల్లో తరచుగా ఉరుములతో కూడిన వాతావరణం ఏర్పడే అవకాశం ఉంది. దీనివల్ల అక్కడక్కడ మోస్తరు నుండి భారీ వర్షాలు, మెరుపులు, బలమైన గాలులు సంభవించే అవకాశం ఉంది. ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 9-10 రాష్ట్రాలపై ఎల్‌నినో తీవ్ర ప్రభావం చూపే అవకాశముందని.. ఆ రాష్ట్రాల్లోని జిల్లా అధికారులు, వ్యవసాయ సంస్థలతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలని కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆదేశించారు. వర్షపాతం తక్కువగా ఉన్న జిల్లాల కోసం ముందస్తు అత్యవసర ప్రణాళికలు సిద్ధం చేయటం, పత్తి, పప్పుధాన్యాల సాగు విస్తీర్ణాన్ని పెంచటం, రైతులకు శాస్త్రీయ సలహాలు అందేలా చూడటంపై దృష్టి సారించాలని ఆయన అన్నారు. ఖరీఫ్ 2026 సన్నాహకాలపై మంగళవారం సమీక్ష సమావేశానికి కేంద్ర మంత్రి చౌహాన్ అధ్యక్షత వహించారు. వర్షపాతం తక్కువగా ఉన్న జిల్లాల్లో ముందస్తు అత్యవసర ప్రణాళికల ఆవశ్యకతను ఆయన నొక్కి చెప్పారు.

## పవనాలూ.. ప్రత్యేక హోదా ఏమైందీ..!?

మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. కేంద్ర ప్రభుత్వం హోదా ఇవ్వాల్సిందేనని డిమాండ్ చేసిన సందర్భాలూ ఉన్నాయి. కానీ ప్రస్తుతం ఆయన భారతీయ జనతా పార్టీతో పొత్తులో కొనసాగుతున్న సమయంలో ఈ అంశాన్ని బలంగా ప్రస్తావించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోడీతో పలుమార్లు వేదికలు పంచుకున్న పవన్ కల్యాణ్, ప్రత్యేక హోదా అంశాన్ని బహిరంగంగా ఎందుకు లేవనెత్తడం లేదని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రంపై ఒత్తిడి తేవాల్సిన సమయంలో మౌనం పాటిస్తున్నట్టు ఆరోపణలొస్తున్నాయి. ఈ అంశంపై జనసేన పార్టీ స్పష్టమైన కార్యాచరణ కూడా ప్రకటించలేకపోతోంది. అయితే.. రాష్ట్రాభివృద్ధి కోసం కేంద్రంతో సమన్వయంతో ముందుకు వెళ్తున్నామని చెబుతున్నప్పటికీ.. ప్రజల బలమైన డిమాండ్‌ను కాదని ఎన్నిచేసినా దిగదిడుపేనని పవన్‌కు బోధపడటం లేదనే వాదన సాగుతోంది.

**ప్రాధాన్యత కోల్పోతున్నారా..?**

ప్రత్యేక హోదా అమలు కాకపోవడం వల్ల రాష్ట్రం కోల్పోయిన అవకాశాలపై ఎన్నోసార్లు చర్చ జరిగింది. కొత్త పరిశ్రమలు, భారీ పెట్టుబడులు, ఉద్యోగ అవకాశాలు మరింతగా పెరిగే అవకాశం ఉండేదని ఆర్థిక నిపుణులు పేర్కొంటున్నారు. అయినప్పటికీ ఈ అంశం ఇప్పుడు అధికార రాజకీయాల్లో ప్రాధాన్యత కోల్పోయినట్లు కనిపిస్తోంది. రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు ఒకే వేదికపై నిలబడాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా అధికార కూటమిలో భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీ, ప్రత్యేక హోదా హామీ అమలుకు కేంద్రంపై ఎంత మేర ఒత్తిడి తెస్తుందో ప్రజలు గమనిస్తున్నారు. మిత్రపక్ష ధర్మం కంటే రాష్ట్ర హక్కులు ముఖ్యమనే సందేశాన్ని నాయకులు ఇవ్వాల్సిన అవసరం ఉంది. తెలంగాణపై వ్యాఖ్యలు రాజకీయ చర్చలకు దారితీయవచ్చు. కానీ ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన అసలు ప్రశ్నలకు సమాధానం ఇవ్వలేవు. ప్రత్యేక హోదా కోసం కేంద్రాన్ని నిలదీయడం, విభజన హామీల అమలు కోసం పోరాడటం, రాష్ట్ర ప్రయోజనాలను సాధించడం ఇవే ప్రజలు తమ నాయకుల నుంచి ఆశిస్తున్న అంశాలు. పవన్ కల్యాణ్ ఆ దిశగా అడుగులు వేస్తారా? లేక ప్రత్యేక హోదా మరోసారి రాజకీయ హామీగానే మిగిలిపోతుందా? అనే ప్రశ్నకు సమాధానం కోసం ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎదురుచూస్తున్నారు.

## దండుపాళ్యం బ్యాచ్ రాష్ట్రాన్ని దోచుకుంటోంది

ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. కేసీఆర్ ప్రాణాలకు తెగించి తెలంగాణ సాధించారని అన్నారు. కేసీఆర్ మళ్లీ రావాలని తెలంగాణ ప్రజలు కోరుతున్నారన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వ మేనని, తిరిగి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. వ్యవసాయం సంక్షోభంలోకి పోతే పట్టించుకున్న దిక్కు లేదని కేటీఆర్ విమర్శించారు. ఆర్థిక మంత్రి కమిషన్లకు అక్రమాలకు అంతం లేదన్నారు. రాష్ట్రంలో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని.. వారికి కనీసం యూరియా ఇచ్చే పరిస్థితి లేదని మాజీ మంత్రి అన్నారు. కేసీఆర్ చేసిన అప్పు..కాళేశ్వరం, భక్తరామదాసు, తెలంగాణ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసమని స్పష్టం చేశారు. పేద విద్యార్థుల కోసం మెడికల్ కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు చేశామని చెప్పుకొచ్చారు. బూత్‌ల వారీగా బలమైన కార్యకర్తల నిర్మాణం జరగాలని కేటీఆర్ అన్నారు. సర్ అంటే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అని.. దేశంలో ఇప్పటికి 13 సార్లు జరిగిందని.. ఇప్పుడు 14వ సారి అని తెలిపారు. సర్‌ను పట్టించుకోక పోతే నష్టం తప్పదన్నారు. ఈనెల 25 నుంచి వచ్చే నెల25 వరకూ ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రతి బూత్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలు ప్రతి ఒక్క అంశాన్ని ప్రస్తావించాలని సూచించారు. ఇది చాలా కీలకమైన సమయమని, ఒక్క ఓటు కూడా పోకుండా చూసుకోవాలన్నారు. 'నిజాయతీగా ఎన్నికలు జరిగితే కేసీఆర్ ఈరోజు 100 సీట్లతో గెలుస్తారు.. నిజాయతీగా గెలవాలంటే మనం జాగ్రత్తగా ఉండాలి' అంటూ కార్యకర్తలకు కేటీఆర్ సూచించారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా జిల్లా ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. దాచుకోవడం దోచుకోవడం తప్ప జిల్లా అభివృద్ధికి వారు పాటుపడిందేమి లేదని స్వార్థ ప్రయోజనాల కోసమే పాలన కొనసాగిస్తున్నారన్నారు. ఒక మంత్రి భూముల కబ్జాలకు పాల్పడుతుంటే, మరో మంత్రి వ్యవసాయ రంగాన్ని తీవ్ర సంక్షోభంలోకి నెట్టారన్నారు. ఇక ఆర్థిక మంత్రి రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అస్తవ్యస్తం చేశారని విమర్శించారు. ప్రతిరోజు కేసీఆర్ అప్పులు చేశాడని మొరుగుతున్న నాయకులు ఎందుకు చేశారో బదులిచ్చారు. కేసీఆర్ చేసిన అప్పులకు రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి సజీవ సాక్షాలుగా ఉన్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నర ఏళ్లలో లక్షల కోట్లు అప్పుచేసి ఏమి అభివృద్ధి చేసిందో రాష్ట్ర ప్రజలందరూ చూస్తున్నారన్నారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి ఆలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి భూ దందాలకు పాల్పడుతూ అనేక అక్రమాలకు ఊతమిస్తున్నారన్నారు. ఇందుకు సంబంధించిన వీడియో దృశ్యాలను సభా వేదికపై ప్రదర్శించారు. మరికొద్ది రోజుల్లో ఎస్ ఐ ఆర్ పక్రియ ప్రారంభం కాబోతున్న నేపథ్యంలో ప్రతి బిఎల్ఎ అప్రమత్తంగా ఉండాలన్నారు. అర్హత గల వ్యక్తుల ఓటర్లు తొలగించకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాలో దిశా నిర్దేశర చేశారు.

## ట్రాక్టర్‌ను ఢీకొన్న ఈ రిక్షా

- ఆరుగురు మహిళలు దుర్మరణం
- యూపిలో ఘోర రోడ్డు ప్రమాదం

లక్నో(జనంసాక్షి):ఉత్తర ప్రదేశ్‌లోని బదౌన్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఒక ఈ రిక్షా.. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో ఆరుగురు మహిళలు మరణించగా, మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన ఉత్తర ప్రదేశ్, బదౌన్ జిల్లాలో, బరేలీ-మధుర హైవేపై బుధవారం మధ్యాహ్నం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గర్వానా గ్రామానికి చెందిన ఎనిమిది మంది మహిళలు ఒక ఈరిక్షాలో బంధువుల ఇండ్లకు బయల్దేరారు. తమ ఇంట్లో పెళ్లికి ఆహ్వానించడానికి వెళ్లారు. ఈ క్రమంలో హైవేపై వెళ్తుండగా, ముందు ఉన్న ట్రాక్టర్‌ను దాటుకొని ముందుకు వెళ్లేందుకు ఈరిక్షా డ్రైవర్ ప్రయత్నించాడు. ఒక ట్రాక్టర్‌ను దాటుకుని వెళ్తుండగా, ఎదురుగా వేగంగా వస్తున్న మరో ట్రాక్టర్‌ను ఈరిక్షా ఢీకొంది. ఈ ఘటనలో ఆటోలోని మహిళల్లో ఆరుగురు అక్కడికక్కడే మరణించారు. ఆటో డ్రైవర్ షాని సహా మరో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ఆటో నుజ్జును÷-జజ్జైంది. ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక బృందాలు అక్కడికి చేరుకుని వారిని రక్షించే ప్రయత్నంచేశాయి. కానీ, అప్పటికే ఆరుగురు మరణించారు. గాయపడిన ముగ్గురిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మృతదేహాల్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఈ రిక్షా డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ఈ ప్రమాదం జరిగి ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. మరోవైపు ఘటనకు కారకులైన రెండు ట్రాక్టర్లకు చెందిన డ్రైవర్లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. మృతుల కుటుంబాలకు సంబంధించిన వారి ఇంట్లో ఈ నెల 29న వివాహం జరగాల్సి ఉంది. మరోవైపు ఈ ఘటనపై యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి ప్రకటించారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

## మైనర్ బాలికపై అత్యాచారం..హత్య

**పోక్సో కేసులో 20ఏళ్లు...హత్య కేసులో యావజ్జీవం**

**నిందితుడికి శిక్ష విధించిన సిరిసిల్ల పోక్సో కోర్టు**

రాజన్నసిరిసిల్ల(జనంసాక్షి): మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన పోక్సో కేసుతోపాటు, అదే బాలికను హత్య చేసిన కేసులో నిందితుడు బండపల్లి నవీన్ కుమార్ (27)కు పోక్సో కేసులో 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ సిరిసిల్ల పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి రాధికా జైస్వాల్ బుధవారం సంచలన తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. జగిత్యాల జిల్లా కోడిమ్యాల మండలం శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన బండపల్లి నవీన్ కుమార్‌కు చందుర్తి మండలం మూడపల్లి గ్రామానికి చెందిన మైనర్ బాలికతో పరిచయం ఏర్పడింది. 2019 మార్చి 13న బాలికను అపహరించి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేయడంతో చందుర్తి పోలీస్ స్టేషన్‌లో పోక్సో కేసు నమోదు చేశారు. ఈ కేసులో దర్యాప్తు చేపట్టిన పోలీసులు సాక్ష్యాధారాలు సేకరించి నిందితుడిపై చార్జిషీట్ దాఖలు చేశారు. అనంతరం 2020 డిసెంబర్ 4న నిందితుడు బాలికను ఆమె ఇంటి నుంచి అపహరించి గ్రామ శివారుకు తీసుకెళ్లాడు. అక్కడ అత్యాచారం చేసిన అనంతరం జరిగిన విషయాన్ని బయటపెడుతుందనే భయంతో బాలికకు విషం తాగించి హత్య చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. తీవ్ర అస్వస్థతకు గురైన బాలికను నిందితుడు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినప్పటికీ చికిత్స పొందుతూ మృతి చెందింది. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు వేములవాడ టౌన్ పోలీసులు హత్య, అత్యాచారం తదితర సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాక్షుల వాంగ్మూలాలు, వైద్య నివేదికలు, ఇతర శాస్త్రీయ ఆధారాలను సేకరించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. ఈ రెండు కేసులు సిరిసిల్ల పోక్సో ప్రత్యేక కోర్టులో విచారణకు వచ్చాయి. విచారణ సందర్భంగా ప్రాసిక్యూషన్ తరఫున సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించి పోక్సో కేసులో 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.7,000 జరిమానా, హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్షతోపాటు రూ.5,000 జరిమానా విధించింది

# అభిమానిని చూసి కన్నీరు కార్చిన కళ్యాణ్

- నిరంజన్ తో 45 నిమిషాల పాటు ముచ్చటించిన పవన్ కళ్యాణ్
- వైద్య ఖర్చులకు రూ. లక్ష సాయం
- కుటుంబానికి అండగా ఉంటాం



**హనుమకొండ ప్రతినిధి, జూన్ 17 (జనంసాక్షి) :** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. అరుదైన జన్యుపరమైన వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమైన తన వీరాభిమాని నిరంజన్ కోరికను తెలుసుకున్న ఆయన బుధవారం హనుమకొండకు చేరుకుని స్వయంగా పరామర్శించారు. హనుమకొండ నగరంలోని హనుమాన్‌నగర్‌కు చెందిన 17 ఏళ్ల నిరంజన్ 'డుచెన్ మస్కులర్ డిస్ట్రోఫీ' అనే ప్రాణాంతక నరాల వ్యాధితో బాధపడుతున్నాడు. శారీరక ఎదుగుదల దెబ్బతినడంతో చాలాకాలంగా ఇంటికే పరిమితమయ్యాడు. ఈ పరిస్థితుల్లో తన అభిమాన నాయకుడు పవన్ కళ్యాణ్‌ను ఒక్కసారైనా కలవాలన్న కోరికను కుటుంబ సభ్యుల వద్ద వ్యక్తం చేశాడు. ఈ విషయం జనసేన నాయకుల ద్వారా పవన్ కళ్యాణ్ దృష్టికి చేరడంతో ఆయన వెంటనే స్పందించారు. బుధవారం నిరంజన్ నివాసానికి చేరుకున్న పవన్ కళ్యాణ్ దాదాపు 45 నిమిషాల పాటు బాలుడితో పాటు కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడారు. నిరంజన్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. అభిమాన నాయకుడిని ప్రత్యక్షంగా కలుసుకోవడంతో నిరంజన్ ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఈ సందర్భంగా వైద్య చికిత్సలకు ఉపయోగపడేలా రూ.1 లక్ష ఆర్థిక సాయం అందజేసిన పవన్ కళ్యాణ్, భగవంతుని తీర్థప్రసాదాలను అందించారు. నిరంజన్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, అతని ఆరోగ్యం కోసం వరంగల్ భద్రకాళీ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తానని తెలిపారు. నిరంజన్ కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న పవన్ కళ్యాణ్, వారికి స్థిరమైన జీవనోపాధి కల్పించే దిశగా చర్యలు తీసుకోవాలని జనసేన తెలంగాణ నాయకత్వానికి సూచించారు. కుటుంబానికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు క్యాంటీన్ ఏర్పాటు వంటి అంశాలను పరిశీలించాలని పేర్కొన్నారు. పవన్ కళ్యాణ్ రాకతో నిరంజన్ కుటుంబ సభ్యులు భావోద్వేగానికి గురికాగా, స్థానిక జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు. ఆయనను చూసేందుకు పెద్ద సంఖ్యలో అభిమానులు తరలివచ్చారు. దీంతో హనుమాన్‌నగర్ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. అభిమాని కోరికను గౌరవించి స్వయంగా ఇంటికెళ్లి పరామర్శించిన పవన్ కళ్యాణ్ చర్యపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు. మానవతా దృక్పథంతో ఆయన వ్యవహరించిన తీరు పలువురి మనసులను హత్తుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ హనుమకొండకు రాకతో పవన్ అభిమానులు పెద్ద ఎత్తున చేరుకొని సంబరాలు జరుపుకున్నారు భారీ పోలీస్ బందోబస్తు మధ్యలో పవన్ పర్యటన కొనసాగింది.

# టీజీఎంఎస్ఐడీసీ సంస్థ పారదర్శకంగా సేవలు అందించాలి

- సీఎంఎస్ కేంద్రాలకు శాశ్వత భవనాలు
- టెండర్లలో పారదర్శకత కోసం 5 కమిటీలు
- హిమోఫిలియా బాధితులకు ఉచితంగా మందులు అందించాలి
- అన్ని స్థాయిల ఆసుపత్రులకు ప్రామాణిక ఎక్విప్మెంట్ జాబితా
- అదనంగా సీయూఆర్‌యూ ఏరియాలో మరో 4 కొత్త సీఎంఎస్ కేంద్రాలు
- సమీక్షలో వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశం



**హైదరాబాద్ (జనంసాక్షి) :** టీజీఎంఎస్ఐడీసీ సంస్థ పారదర్శకంగా సేవలు అందించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హైదరాబాదులోని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు మౌలిక సదుపాయాలభివృద్ధి సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ (సీఎంఎస్)ల పనితీరుపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమీక్ష సమావేశంలో సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ (సీఎంఎస్) కేంద్రాలకు 15 శాశ్వత భవనాల నిర్మాణం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ టీజీఎంసిడీసీ అధికారులను ఆదేశించారు. సంస్థ ద్వారా కొనుగోలు చేస్తున్న మందులు, సర్జికల్స్, రీజెంట్స్, ఎక్విప్మెంట్స్ కొనుగోలు చేస్తున్న టెండర్లను పారదర్శకంగా ఉండేలా విధివిధానాలను రూపొందించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. టెండర్లలో పారదర్శకతను మరింత పెంచేందుకు ప్రస్తుతం ఉన్న 2 కమిటీలకు అదనంగా మరో 3 కమిటీలను కొత్తగా ఏర్పాటు చేసి, మొత్తం 5 కమిటీలను నియమించాలని మంత్రి ఆదేశించారు. సంస్థలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న అధికారులను తక్షణమే బదిలీ చేయాలని మంత్రి సంస్థ వీణ గౌరవ్ ఉప్పల్ గారిని ఆదేశించారు. డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ), తెలంగాణ వైద్య విధాన పరిషత్(టీవీవీపీ) ఆస్పత్రులలో టీజీఎంఎస్ఐడీసీ ద్వారా కొనుగోలు చేస్తున్న మందులు, ఎక్విప్మెంట్స్, సివిల్ వర్క్స్ లను రెగ్యులర్ గా పర్యవేక్షించడానికి తక్షణమే నోడల్ ఆఫీసర్స్ ను నియమించాలని మంత్రి ఆదేశించారు. టీజీఎంఎస్ఐడీసీలో టెండర్ల ద్వారా కొనుగోలు చేస్తున్న మందులు, ఎక్విప్మెంట్, సర్జికల్, రీజెంట్స్ లను నెలవారీగా, విధిగా సమీక్షించుకోవాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు.

అన్ని స్థాయిల ఆసుపత్రులకు (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ఏరియా ఆసుపత్రులు, జిల్లా ఆసుపత్రులు) అవసరమైన ఎక్విప్మెంట్ కు సంబంధించి ఒక ప్రామాణిక జాబితా (స్టాండర్డ్ ఎక్విప్‌మెంట్ లిస్టు) ను తయారు చేసి, నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. దీని వలన అన్ని స్థాయిల ఆసుపత్రులలో ఏకరూపత ఉంటుందన్నారు. మందుల సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు, సీయూఆర్‌యూ ప్రాంతంలో ప్రస్తుతం ఉన్న 2 సీఎంఎస్ కేంద్రాలకు అదనంగా మరో 4 కొత్త సీఎంఎస్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశించారు. ఈ సమీక్షలో హిమోఫిలియా బాధితులకు ప్రభుత్వం అండగా ఉందన్నారు. హిమోఫిలియా బాధితులకు నెల వారిగా అవసరమైన మందులను ఉచితంగా అందించాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. ఈ మందులను జనరల్ ఆసుపత్రుల(జీజీహెచ్) ద్వారా బాధితులకు అందుబాటులో ఉంచాలని మంత్రి స్పష్టం చేశారు. హిమోఫిలియా-ఏ రోగులకు ఉపయోగించే ఎమిసిజూమాబ్ మందులను ప్రస్తుతం ఉస్మానియా, గాంధీ, నీలోఫర్ హాస్పిటల్ లో అందుబాటులో ఉందని మంత్రి కి కార్పొరేషన్ అధికారులు వివరించారు. అదనంగా ఖమ్మం, వరంగల్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులు ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో టీజీఎంఎస్ఐడీసీ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ గౌరవ్ ఉప్పల్, కార్పొరేషన్ అధికారులు ఈడీ ఇంచార్జి వెంకటేశ్వర్లు, సంస్థ అధికారులు పాల్గొన్నారు.

# హైదరాబాద్‌లో కాన్సులేట్ రోడ్డుకు ట్రంప్ పేరు పెట్టొద్దు



- నిరసన కార్యక్రమాలకు లెఫ్ట్ పార్టీల పిలుపు

**హైదరాబాద్ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాదులోని అమెరికన్ కాన్సులేట్ వద్ద ఒక ప్రధాన రహదారికి అమెరికా అధ్యక్షులు డోనాల్డ్ ట్రంప్ పేరుతో డొనాల్డ్ ట్రంప్ అవెన్యూగా పెట్టాలని రేవంత్ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపట్ల లెఫ్ట్ పార్టీలు తీవ్రంగా వ్యతిరేకిస్తూ, తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని, లెఫ్ట్ పార్టీల సమావేశం డిమాండ్ చేసింది. ఈ రోజు సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యాలయం, ఎంబి భవన్‌లో వామపక్ష పార్టీల సమావేశం సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అధ్యక్షతన నిర్వహించి కార్యాచరణ ప్రకటించాయి. ఈ సమావేశం లో నాయకులు మాట్లాడుతూ నేడు అమెరికా సామ్రాజ్యవాదం ప్రపంచ దేశాల సంపదను కొల్లగొట్టడానికి ప్రజల మీద యుద్ధాలను రుద్దుతున్నదని, ప్రపంచ ప్రజల రక్త మాంసాలను పీల్చి పిప్పి చేస్తున్నని, మనదేశం మీద ట్రంప్ ఆంక్షలు దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశాయని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం నరేంద్రమోడీ సహకారం తోడవటంతో దేశం నష్టపోతున్నని, తెలంగాణలో వున్నది కాంగ్రెస్ ప్రభుత్వం అయినప్పటికీ బిజెపి, ఆరఎసఎస్ బాటలో నిర్ణయాలుండటం అత్యంత ఆక్షేపణీయమని, దీనిపట్ల కాంగ్రెస్ జాతీయ నాయకత్వం స్పందించి, జోక్యం చేసుకోవాలని అన్నారు. ఈ చర్యలను వ్యతిరేకిస్తూ 20వ తేదీ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం ఉదయం 10.30 గం॥ లకు నిర్వహించాలని, 21వ తేదీన బాబూ జగ్జీవన్‌రాం విగ్రహం నుండి అంబేద్కర్ విగ్రహం వరకు నిరసన ప్రదర్శన జరపాలని నిర్ణయించింది. ఈ సమావేశంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర నాయకులు బండారు రవికుమార్, డిజి నర్సింహారావు, సిపిఐ రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు ఇటి.నర్సింహ, నాయకులు స్టాలిన్, సిపిఐ(ఎంఎల్-మాస్‌లైన్) రాష్ట్ర నాయకులు కె రమ, సూర్యం, ఎంసిపిఐ(యు) రాష్ట్రకార్యదర్శి గాదగోని రవి, న్యూ డెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శివరవ్గ సభ్యులు సాదినేని వెంకటేశ్వరరావు, ఎస్‌యుసిఐ (సి) నాయకులు పి.తేజ, ఆర్ఎస్పీ రాష్ట్రకార్యదర్శి జానకి రాములు పాల్గొన్నారు.

# ములుగులో తొలి ప్రైవేట్ ఐటీ కంపెనీ ప్రారంభం

- గ్రామీణ యువతకు స్థానికంగానే ఐటీ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించాలి
- అభివృద్ధి, ఉపాధి అవకాశాలు వికేంద్రీకరణ ద్వారానే ప్రతి ప్రాంతానికి చేరాలి
- ములుగులో ఐటీ రంగ అభివృద్ధికి ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుంది
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి (జనంసాక్షి) :** ములుగు ఏజెన్సీ జిల్లాలో తొలిసారిగా ప్రైవేట్ రంగంలో ఐటీ సంస్థ ఏర్పాటు కావడం సంతోషకరమని, గ్రామీణ ప్రాంత యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పిస్తూ సాంకేతిక రంగంలో కొత్త భవిష్యత్తుకు దారులు వేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన శ్రియా ఇన్ఫోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థను మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఇప్పటివరకు ఐటీ రంగం ప్రధానంగా నగరాలకు మాత్రమే పరిమితమైందని, ఐటీ అవకాశాలు గ్రామీణ, ఏజెన్సీ ప్రాంతాలకు కూడా చేరుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు, అభివృద్ధి అన్నీ ఒకే ప్రాంతంలో కేంద్రీకృతం కాకుండా వికేంద్రీకరణ జరిగితేనే మారుమూల ప్రాంతాల యువతకు సమాన అవకాశాలు లభిస్తాయని తెలిపారు. శ్రియా ఇన్ఫోటెక్ సంస్థ గత ఒక సంవత్సరం కాలంగా ములుగు ప్రాంత యువతకు వివిధ రంగాల్లో సాంకేతిక శిక్షణ అందిస్తూ, యాప్ డెవలప్‌మెంట్ వంటి ఆధునిక నైపుణ్యాలను నేర్పిస్తూ ముందుకు సాగుతోందన్నారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా యాప్‌లను అభివృద్ధి చేసి వివిధ పాఠశాలలు, సంస్థలు, ఐటీ రంగానికి సేవలు అందిస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం సంస్థలో సుమారు 15 మంది యువత ఐటీ రంగంలో ఉద్యోగాలు పొందడం అభినందనీయమన్నారు. హైదరాబాద్ వంటి నగరాలకు మాత్రమే ఐటీ పరిశ్రమలు పరిమితం కాకూడదని, ములుగు, మంచిర్యాల, ఆసిఫాబాద్, ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం వంటి ప్రాంతాల్లో కూడా ఐటీ రంగం విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. నేటి సాంకేతిక యుగంలో ఎక్కడి నుంచైనా పని చేసే అవకాశాలు ఉన్నాయని, అభివృద్ధి, ఉద్యోగాల వికేంద్రీకరణ ద్వారానే సమాజంలో సమాన అభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ములుగు జిల్లాలో ఇతర ఐటీ సంస్థలు, కంపెనీలు స్థాపించడానికి ముందుకు రావాలని, పెట్టుబడులు పెట్టే వారికి ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం అన్ని విధాల సహకారం అందిస్తుందని తెలిపారు. శ్రియా ఇన్ఫోటెక్ వ్యవస్థాపకులు రవికుమార్ రంగారి తీసుకున్న ఈ ముందడుగు అభినందనీయమన్నారు.


# టీమ్ వర్క్‌గా జిల్లాను ప్రగతి పథంలో నడిపిస్తున్నాం

**జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఒక టీమ్ వర్క్‌గా పనిచేస్తూ జిల్లాను ప్రగతి పథంలో నడిపిస్తున్నామని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. జూన్ 16 తో జిల్లా కలెక్టర్ గా పదవీ బాధ్యతలు చేపట్టి విజయవంతంగా రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం ఐడిఓసి కార్యాలయంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, డిఆర్వో వసంత కుమారి, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, డిపిఆర్ఓ శ్రీనివాస్, ఏవో శ్రీనివాసులు, డిటి షఫీ సర్కార్, జిల్లా అధికారులు తదితరులు పుష్పగుచ్చాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ జిల్లా అభివృద్ధికి సహకరిస్తున్న ప్రజాప్రతినిధులకు, అధికారులకు, ప్రజలకు, పాత్రికేయులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# నిషేధిత మత్తు పదార్థాల విక్రయాలపై ఉక్కుపాదం



**శంషాబాద్, జూన్17(జనం సాక్షి) :** నిషేధిత డ్రగ్స్, గుట్కా, టొబాకో వంటి మత్తు పదార్థాలకు ప్రజలు దూరంగా ఉండి, వాటి విక్రయాలు లేదా వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేసి సహకరించాలని శంషాబాద్ ఫ్యూచర్ సిటీ ఇన్స్పెక్టర్ కె. నరేందర్ రెడ్డి అన్నారు. బుధవారం శంషాబాద్ పోలీసులు, ఈగల్ నార్కోటిక్ డ్రగ్ బృందం సంయుక్తంగా సంఘీగూడ ఎక్స్‌రోడ్ పరిధిలోని కిరాణా దుకాణాల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో షేక్ రెహన్ పాషా, షేక్ సోహెల్‌కు చెందిన కిరాణా దుకాణాల్లో నిషేధిత టొబాకో, గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత మత్తు పదార్థాలను విక్రయిస్తున్న వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# ఆటో కార్మికుల సమస్యలపై కవితకు వినతి



**తాండూర్, జూన్ 17(జనం సాక్షి) :** ఆటో కార్మికుల సమస్యల పైన ప్రజాక్షేత్రంలో మీడియా మిత్రుల ముందు మేం ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్రీ బస్సు వల్ల ఆర్థిక ఇబ్బందులతో తెలంగాణ రాష్ట్రంలో ఇప్పటికే 200 మంది ఆటో కార్మికులు చనిపోయారని అన్నారు, ఈ సందర్భంగా భారత టీవీ రాష్ట్ర ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ హబీబ్ పాషా మాట్లాడుతూ మమ్మల్ని ప్రభుత్వం పట్టించుకోవట్లేదని ప్రతిపక్ష నాయకురాలు అయినా మీరు మీ గలం ద్వారా ఏడు లక్షల 50 వేల మంది ఆటో కార్మికుల ఆత్మఘోషను అర్ధనాథాలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఆయన కోరుతూ పది ప్రధానమైన డిమాండ్లతో కూడిన వినోద్ పత్రాన్ని ఇచ్చాము కవిత స్పందించి తప్పకుండా నూటికి నూరు శాతం ప్రతిపక్ష హోదాలో పోరాడుతామని మాట ఇచ్చారు,ఈ కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నం శ్రీనివాస్ మరియు ప్రతినిధి వేల్పుల శంకర్ తదితర ఆటో కార్మికులు పాల్గొన్నారు.

# రేకుర్తి పట్టా భూముల సమస్యపై మంత్రి శ్రీధర్ బాబుకు వినతి



**హైదరాబాద్, జూన్ 17 (జనంసాక్షి) :** రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు మరియు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబును హైదరాబాద్‌లోని ఆయన క్యాంపు కార్యాలయంలో కరీంనగర్ 20వ డివిజన్ కార్పొరేటర్ మీసాల పర్వతం మల్లేశం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబును శాలువాతో సత్కరించిన మల్లేశం, రేకుర్తి ప్రాంతంలోని పట్టా భూములపై విధించిన 22-ఏ నిషేధిత జాబితా కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పట్టా భూములను 22-ఏ నిషేధిత జాబితా నుంచి తొలగించి, సంబంధిత సమస్యను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి గారికి వినతిపత్రం అందజేశారు. ఈ అంశాన్ని సానుకూలంగా పరిశీలించి, ప్రజలకు న్యాయం జరిగేలా చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చినట్లు మల్లేశం తెలిపారు.

# అమెజాన్ సహకారంతో ప్రభుత్వ బడుల అభివృద్ధి

- చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య
- గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి



**షాబాద్, జూన్ 17( జనం సాక్షి) :** విద్యార్థుల విద్య ప్రమాణాల పెంపుకు, ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి లక్ష్యంగా అమెజాన్ సంస్థ సహకారం ఎంతో అభినందనీయమని చేవెళ్ల శాసన సభ్యులు కాలే యాదయ్య, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాల మరియు కళాశాలలో పునరుద్ధరణ, నూతన తరగతి గదులను అమెజాన్ సంస్థ వారి సహకారంతో నిర్మించిన గదులను బుధవారం గ్రంధాలయ సంస్థ జిల్లా చైర్మన్, అమెజాన్ సంస్థ ప్రతినిధులతో కలిసి ప్రారంభించిన చేవెళ్ల శాసనసభ్యులు కాలే యాదయ్య. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ... అమెజాన్ సంస్థ అందిస్తున్న సహకారం ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు, విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగు పడతాయని అన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అమెజాన్ డైరెక్టర్ కామెరోస్, అనురాగ్ కొల్లాని, గుడిమల్కాపూర్ మార్కెట్ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్, సర్దార్ నగర్ మార్కెట్ చైర్మన్ పీసరి సురేందర్ రెడ్డి, ఎంపీడీవో, ఎంఈఓ, సర్పంచులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# పానీపూరీ తిని అస్వస్థతకు గురైన చిన్నారులు

- మెరుగైన వైద్యం అందించాలని సిపిఐ డిమాండ్

**సిరిసిల్ల, జూన్17 (జనంసాక్షి) :** పానీపూరి తిని అస్వస్థతకు గురైన బాధిత చిన్నారులకు ప్రభుత్వం మెరుగైన వైద్య సేవలు అందించాలని సీపీఐ సిరిసిల్ల పట్టణ కార్యదర్శి పంతం రవి డిమాండ్ చేశారు. స్థానిక సుభాష్‌నగర్‌లోని సీపీఐ కార్మిక భవన్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ఫుడ్ ఇన్‌స్పెక్షన్ అధికారుల నిర్లక్ష్య వైఖరి వల్లే ఇటువంటి ఘటనలు జరుగు తున్నాయని ఆరోపించారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కొందరు వ్యాపారులు ఎలాంటి నాణ్యతా ప్రమాణాలు, పరిశుభ్రత పాటించకుండా వీధుల్లో పానీపూరి, ఐస్‌క్రీమ్, చెరుకురసం విక్రయిస్తున్నప్పటికీ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇలాంటి ఆహార పదార్థాల విక్రయాలపై తనిఖీలు నిర్వహించి, నాణ్యతా ప్రమాణాలు పాటించని వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండలం కేసీఆర్ నగర్ ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కమిటీ సభ్యులు గుంటి వేణు, మీసం లక్ష్మణ్, సోమ నాగరాజు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌లో చేరిన సర్పంచ్

**ఆసిఫాబాద్, జూన్17 (జనంసాక్షి) :** కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనురు మండలంలోని పాట్నాపూర్ సర్పంచ్ ఖందరే లక్ష్మిబాయి బాలాజీ బుధవారం ఆసిఫాబాద్‌లోని ఎమ్మెల్యే కోవలక్ష్మి సమక్షంలో బీఆర్ఎస్ లో చేరారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటూ తెలంగాణ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీఆర్ఎస్ పార్టీ వైపు ప్రజాప్రతినిధులు తిరిగి రావడం పార్టీపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని అన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
18 జూన్ 2026

# హర్మూజ్ జలసంధిలో చిక్కుకున్న అగ్రరాజ్యం

సంపాదకీయం

ప్రపంచాన్ని శాసించిన అగ్రరాజ్యం ఒక జలసంధి దగ్గర నిస్సహాయంగా నిలబడింది. బాంబులు వేస్తామని బెదిరించింది, ఒప్పందమే కుదుర్చుకుంది. కానీ ఆ ఒప్పందమే తాత్కాలికమైందని తేలింది. ఇరాన్ వెనక్కి తగ్గలేదు. హోర్ముజ్ జలసంధి ఇరాన్ పట్టులోనే ఉంది. ప్రపంచ పోలీసు పాత్ర పోషిస్తానని చెప్పుకున్న అమెరికా ఆ పాత్రలో ఘోరంగా విఫలమైంది.

హోర్ముజ్ జలసంధి అంటే కేవలం ఒక భౌగోళిక స్థానం కాదు. అది ప్రపంచ చమురు సరఫరాకు గుండె వంటిది. ప్రపంచవ్యాప్తంగా వినియోగమయ్యే చమురులో దాదాపు ఐదింట ఒక వంతు ఈ జలసంధి గుండా వెళుతుంది. సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్, ఇరాక్.. ఈ దేశాల చమురు ప్రపంచానికి చేరాలంటే హోర్ముజ్ దాటక తప్పదు. అదే జలసంధిపై ఇరాన్ పట్టు సాధించింది అంటే చమురు కొనే ప్రతి దేశం గుండెపై కత్తి పెట్టినట్టే. ఆ కత్తి పట్టుకున్న చెయ్యి తెహ్రాన్‌లో ఉంది. వాషింగ్టన్‌లో కాదు.

ఇరాన్ టోల్ వసూలు మొదలుపెట్టిన క్షణం నుండి మార్కెట్లు వణికాయి. చమురు ధరలు ఒక్కసారిగా పైకి దూసుకుపోయాయి. అమెరికాలో పెట్రోల్ ధరలు పెరిగాయి. యూరప్ అల్లాడింది. ఆసియా దేశాలు తలలు పట్టుకున్నాయి. ఒక్క జలసంధి నిర్ణయం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసింది. ఇది ఇరాన్ శక్తి కాదు, అమెరికా వైఫల్యానికి అద్దం పట్టిన క్షణం. అదే సమయంలో మాస్కో నిశ్శబ్దంగా నవ్వుకుంది. హోర్ముజ్ మీద అనిశ్చితి పెరిగిన కొద్దీ ప్రపంచం ప్రత్యామ్నాయ చమురు కోసం వెతికింది. రష్యా అదే అవకాశం అందిపుచ్చుకుంది. ఉక్రెయిన్ యుద్ధం తర్వాత రష్యాను ఆర్థికంగా మోకాళ్ళపై వంచాలని అమెరికా విధించిన ఆంక్షలు తిరస్కరించబడ్డాయి. చమురు ధరలు పెరిగిన కొద్దీ రష్యా ఖజానా నిండుతూ పోయింది. అమెరికా వేసిన వల రష్యాకు ఉచ్చుగా మారింది. ఇది యాదృచ్ఛికం కాదు, వ్యూహాత్మక వైఫల్యం. మరీ బాధాకరంగా అనిపించేది ఏమిటంటే. అమెరికా సొంత మిత్రదేశమే ఈ ఒప్పందాన్ని తిరస్కరించింది. దశాబ్దాలుగా అమెరికా భుజాన నిలబడిన ఇజ్రాయిల్ ఇరాన్‌తో కుదిరిన ఒప్పందంపై బహిరంగంగా విభేదించింది. మిత్రులే మాట వినకపోతే శత్రువులను ఎలా నియంత్రిస్తారు? ఇజ్రాయిల్ విభేదించడం అంటే అమెరికా దౌత్య బలహీనత ప్రపంచం ముందు నగ్నంగా నిలబెట్టబడింది.

అమెరికా చేసిన తప్పు ఏమిటంటే.. సైనిక బెదిరింపులే చివరి పరిష్కారం అనుకుంది. బాంబులు వేస్తామని చెప్పింది. కానీ ఇరాన్ వెరవలేదు. ఎందుకంటే ఇరాన్‌కు తెలుసు.. హోర్ముజ్ పై దాడి చేస్తే చమురు సరఫరా మొత్తం ఆగిపోతుంది. అది అమెరికా మిత్రదేశాలకే నష్టం. ఇరాన్ ఆ బలహీనతను గుర్తించింది. అమెరికా తన బెదిరింపులను అమలు చేయలేని స్థితిలో ఉందని ఇరాన్ కచ్చితంగా లెక్కగట్టింది. అందుకే వెనక్కి తగ్గలేదు. అమెరికా దగ్గర సైనిక బలం ఉంది, కానీ దాన్ని వాడే నైతిక స్థానం లేదు. ఆర్థిక ఆంక్షల అస్త్రం ఉంది, కానీ అవి పని చేసే వ్యూహం లేదు. మిత్రదేశాలు ఉన్నాయి, కానీ అవి మాట వినట్లేదు. ఒప్పందం కుదిర్చే శక్తి ఉంది, కానీ అది నిలబెట్టుకునే స్థిరత్వం లేదు. ఒకప్పుడు అమెరికా మాటే చట్టం అనిపించింది. ఇప్పుడు ఆ మాటను ఎవరూ లెక్కచేయట్లేదు. ఇది పరాజయం మాత్రమే కాదు.. అమెరికా ఆధిపత్య యుగం అస్తమిస్తున్న సంకేతం.

యుద్ధంలో విలవిలలాడింది అమెరికా అంటే అతిశయోక్తి కాదు. హార్మూజ్ జలసంధి దగ్గర జరిగిన ఈ పరిణామాలు ప్రపంచ రాజకీయ సమీకరణాలను శాశ్వతంగా మార్చాయి. బెదిరింపులు బూటకమైనాయి. ఒప్పందాలు తాత్కాలికమైనాయి. మిత్రులు దూరమైనారు. శత్రువులు లాభపడ్డారు. ఇది అమెరికా చరిత్రలో చేదైన అధ్యాయం. దాన్ని దాచుకోవడం కాదు.. అర్థం చేసుకోవడం ముఖ్యం.

### విత్తనం - రైతు ఆశల పునాది

నేల తల్లి ఒడిలో పుట్టిన గింజ,
రైతు కళ్లలో ఆశల మెరుపు.
ఒక్క చిన్న విత్తనం సగం పంట,
నకిలీ అయితే మొత్తం శూన్యం!
పచ్చని చిగురులు పుట్టాలంటే,
నిజమైన గింజే కావాలి రైతా!
నీ చేతుల్లో పడిన విత్తనం,
దేశ ఆహార భద్రతకు పునాది.
మేలు రకాలు వెతికి విత్తు,
నేల ఆరోగ్యం కాపాడు రైతా!
నకిలీ గింజలు మోసం చేస్తే,
కుటుంబం కన్నీళ్లు, గ్రామం
ఆక్రోశం.
వ్యవసాయం కాదు వ్యాపారం,
విత్తనం కాదు వ్యాపార సాధనం.
నిజాయితీతో
నింపు నీ చేతులు,
రైతు నవ్వులు దేశానికి బంగారం!
నేల తల్లి ఆరోగ్యం కాపాడు,
మేలు రకాల దిగుబడులు
సాధించు.
విత్తనం నమ్మకం - రైతు బలం,
భారత వ్యవసాయ భవిష్యత్తు
బంగారు!

# పుస్తకాల అట్టలు - స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలు

భారత స్వాతంత్ర్య పోరాటంలో వీరోచితంగా పాల్గొని అపూర్వ త్యాగాలు, అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శించి ఆంగ్లేయులతో పోరాడిన భారత స్వాతంత్ర్య సమరయోధుల పోరాటాలను భావి తరానికి ముఖ్యంగా విద్యార్థులకు తెలియజేసేందుకు ప్రముఖ చరిత్రకారుడు సయ్యద్ నశీర్ అహమ్మద్ తెలుగు రాష్ట్రాలలో పాఠశాలల ప్రారంభం వేళ అక్షరాల లక్ష 'నేమ్ స్టిక్కర్ల' కార్యక్రమాన్ని ఈ ఏడాది కూడా కొనసాగించడం హర్షణీయం. ఈ రకంగా ఆయన చేస్తున్న ఈ కృషి మూలంగా 'భారత స్వాతంత్ర్య సమరయోధుల పోరాట చరిత్రలను విద్యార్థులు సులువుగా అవగాహన చేసుకునేందుకు ఎంతగానో దోహదపడుతున్నాయి. పాఠ్య పుస్తకాల అట్టల మీద అంటించుకునే లక్ష 'నేమ్ స్టిక్కర్ల' పంపిణీ కార్యక్రమాన్ని సయ్యద్ నశీర్ అహమ్మద్ మొదటగా 2018 లో ప్రారంభించినప్పటి నుండి ఇప్పటి వరకు నాలుగేళ్ల పాటు ఆయన ఆరు లక్షల నేమ్ స్టిక్కర్లు ముద్రించి దేశంలోని వందలాది పాఠశాలలోని వేలాది విద్యార్థులకు అందజేసి భారతదేశంలోనే సరికొత్త చరిత్రను సృష్టించి ఎందరికో ఆదర్శంగా నిలిచారు. ఈ రకంగా ఆయన స్వాతంత్ర్య సమరయోధుల స్టిక్కర్లు అందజేయడం చాలా అరుదైన విషయం.

పుస్తకాల మీద వేసుకునే అట్టలు దాదాపు నాలుగు నెలల పాటు సురక్షితంగా ఉంటాయి. సహజంగా పాఠశాలల విద్యార్థులు తమకు ఇష్టమైన చలనచిత్ర నటులు, క్రికెట్ క్రీడాకారులతో కూడిన నేమ్ స్టికర్లను పుస్తకాల అట్టలకు ఉపయోగిస్తుంటారు. కాని దీనికి భిన్నంగా స్వాతంత్ర్య సమరయోధుల చిత్రాలు, క్లుప్తంగా ఆ యోధుల పోరాటాల వివరాలను నేమ్ స్టిక్కర్ల మీద అంటించడం మూలంగా ఇటు విద్యార్థులు, విద్యార్థుల ఉపాధ్యాయులు, అటు




తల్లిదండ్రులు కూడా ఆ స్టిక్కర్లు మీద ఉన్న స్వాతంత్ర్య సమర యోధుల వివరాలు తెలుసుకునే విధంగా సయ్యద్ నశీర్ అహమ్మద్ ముందుచూపుతో శ్రమించారు.

ఈ నేమ్ స్టిక్కర్ల మీద విద్యార్థుల పేర్లు, పుస్తకాల వివరాలు, పాఠశాల వివరాలు రాసుకోవడానికి మాత్రమే పరిమితం కాకుండా స్వాతంత్ర్య సమరయోధుల రంగుల చిత్రాలు, వారి జనన-మరణాల వివరాలు, స్వాతంత్ర్య సంగ్రామంలో వారు చేసిన కృషిని తెలియజేసే విధంగా సయ్యద్ నశీర్ అహమ్మద్ ఏక వాక్య సమాచారంతో 'సూక్ష్మంలో మోక్షం'లా రూపొందించిన తీరు అత్యద్భుతం. 'పుస్తకాల వైపు చూసినప్పుడు అసంకల్పితంగా విద్యార్థులకు స్వాతంత్ర్య సమర యోధుల పోరాటాలు ప్రతిబింబించడం మూలంగా వారి పోరాటాల ఘట్టాలు విద్యార్థుల మస్తిష్కాలలో కలకాలం నిలిచిపోయే విధంగా ఆయన ఈ 'నేమ్ స్టిక్కర్ల'ను రూపొందించడం గమనార్హం. ఆ రకంగా భావి విద్యార్థులను అత్యద్భుతంగా ఆకట్టుకునే విధంగా 'నేమ్ స్టిక్కర్ల'ను రూపొందించడంలో ఆయన విశేషంగా కృషి చేశారు.

మాతృభూమి విముక్తి పోరాటంలో పాల్గొని అపూర్వ త్యాగాలు, అసమాన ధైర్య సాహసాలు ప్రదర్శిస్తూ ఆంగ్లేయులతో పోరాడిన భారత స్వాతంత్ర్య సమరయోధులను పోరాట చరిత్రలను నేటి తరానికి సంక్షిప్తంగా తెలియజేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న సయ్యద్ నశీర్ అహమ్మద్ ఈ కార్యక్రమాన్ని క్రమానుగతంగా కొనసాగిస్తూ ముందుకు సాగిపోతుండడం గొప్ప విషయం. అనేక అవాంతరాలు, అవరోధాలు సంభవించినా ఆయన వాటన్నింటిని దాతల ఆర్థిక చేయూతతో, సేవాసంస్థల మరియు సామాజిక కార్యకర్తల క్రియాశీలక సహకారంతో అధిగమిస్తూనే ఈ నేమ్ స్టిక్కర్ల కార్యక్రమాన్ని విజయవంతంగా కొనసాగిస్తూ ఎందరికో ఆదర్శంగా నిలవడం ప్రశంసనీయం. ఆయన నిర్వహిస్తున్న సేవాస్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుని మరెందరో సేవా దృక్పథాన్ని అలవరచుకుని ఆ దిశగా ముందుకు సాగాల్సిన అవసరం తప్పకుండా ఉంది. అలాగే సయ్యద్ నశీర్ అహమ్మద్ ప్రారంభించిన ఈ సరికొత్త 'నేమ్ స్టికర్ల' కార్యక్రమాన్ని ముఖ్యంగా జర్నలిస్టులు ప్రజల దృష్టికి తీసుకురావాల్సిన అవసరం తప్పకుండా ఉంది.

జె.జె.సి.పి.బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690




# ఇంధన భద్రతా? ఆహార భద్రతా? ఇథనాల్ విధానంపై : ఒక చర్చ

భారతదేశం ప్రస్తుతం ఇంధన భద్రత, దిగుమతి వ్యయం, పర్యావరణ పరిరక్షణ అనే మూడు ప్రధాన సవాళ్లను ఎదుర్కొంటోంది. దేశం వినియోగించే ముడి చమురులో దాదాపు 85 శాతం దిగుమతులపై ఆధారపడుతోంది. అంతర్జాతీయ రాజకీయ ఉద్రిక్తతలు, యుద్ధాలు, చమురు ధరల హెచ్చుతగ్గులు భారత ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ నేపథ్యంలో పెట్రోల్‌లో ఇథనాల్ కలపడం కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ముఖ్య విధానాల్లో ఒకటిగా మారింది. ప్రస్తుతం 20 శాతం వరకు ఇథనాల్ మిశ్రమాన్ని లక్ష్యంగా పెట్టుకోగా, భవిష్యత్తులో మరింత పెంచే అవకాశాల గురించి చర్చ జరుగుతోంది. అయితే ఈ విధానం నిజంగా దేశ ప్రయోజనాల కోసమేనా? లేక దీని వెనుక పర్యావరణ, ఆహార భద్రత, సామాజిక ప్రభావాలను విస్మరిస్తున్నామా అనే ప్రశ్నలు కూడా బలంగా వినిపిస్తున్నాయి.

ఇథనాల్ అనేది ప్రధానంగా చెరకు, మొక్కజొన్న, బియ్యం వంటి వ్యవసాయ పంటల నుంచి తయారయ్యే ఆల్కహాల్. దీనిని పెట్రోల్ లో కలపడం ద్వారా దిగుమతి చమురుపై ఆధారపడటాన్ని తగ్గించవచ్చని ప్రభుత్వం చెబుతోంది. కొంత మేరకు ఇది వాస్తవమే. విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి తగ్గుతుంది. చెరకు రైతులకు కొత్త మార్కెట్ లభిస్తుంది. కార్బన్ ఉద్గారాలు కూడా కొంత తగ్గవచ్చు. అందుకే అమెరికా, బ్రెజిల్ వంటి దేశాలు కూడా ఇథనాల్ మిశ్రమాలను ఉపయోగిస్తున్నాయి.

అయితే విధానాన్ని సమర్థించడం ఒక్కటే కాదు; దాని దీర్ఘకాలిక ప్రభావాలను కూడా పరిశీలించాలి. అత్యంత ముఖ్యమైన ప్రశ్న ఆహార భద్రతకు సంబంధించినది. ఇప్పటికే భారతదేశంలో పోషకాహార లోపం, ఆహార ధరల పెరుగుదల, నీటి కొరత వంటి సమస్యలు ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మనుషులు తినే పంటలను ఇంధన తయారీకి మళ్లించడం ఎంతవరకు సమంజసం? చెరకు, మొక్కజొన్న, బియ్యం వంటి పంటలు ఆహార వ్యవస్థలో కీలక భాగాలు. వాటిలో గణనీయమైన భాగాన్ని ఇంధన పరిశ్రమకు మళ్లిస్తే భవిష్యత్తులో ఆహార ధరలపై ఒత్తిడి పెరిగే ప్రమాదం ఉంది.

ఇథనాల్ తయారీలో మరో ప్రధాన సమస్య నీటి వినియోగం. ఒక కిలో చెరకు ఉత్పత్తికి వేల లీటర్ల నీరు అవసరమవుతుందని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయి. ఇప్పటికే మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు భూగర్భ జలాల క్షీణతను ఎదుర్కొంటున్నాయి. ఇలాంటి సమయంలో చెరకు సాగును మరింత ప్రోత్సహించడం నీటి సంక్షోభాన్ని మరింత తీవ్రతరం చేసే అవకాశం ఉంది. పర్యావరణ పరిరక్షణ పేరుతో చేపట్టే విధానం మరో




ప్రకృతి వనరును నాశనం చేస్తే దానిని స్థిరమైన అభివృద్ధి అని చెప్పలేం. వాహనాల సాంకేతిక అంశాల విషయానికి వస్తే, ఇథనాల్ మిశ్రమం వల్ల కొన్ని సమస్యలు ఉన్నాయని ఆటోమొబైల్ నిపుణులు అంగీకరిస్తున్నారు. ఇథనాల్ నీటిని ఆకర్షించే స్వభావం కలిగి ఉంటుంది. పాత మోడల్ వాహనాల్లో రబ్బరు గొట్టాలు, సీల్స్, ఇంధన వ్యవస్థ భాగాలపై దీర్ఘకాల ప్రభావం ఉండవచ్చు. అయితే ప్రస్తుతం విక్రయిస్తున్న అనేక వాహనాలను ఇ-20 (20 శాతం ఇథనాల్) ప్రమాణాలకు అనుగుణంగా తయారు చేస్తున్నామని తయారీ సంస్థలు చెబుతున్నాయి. కాబట్టి అన్ని వాహనాలు వెంటనే దెబ్బతింటున్నాయనే వాదనకు బలమైన ఆధారాలు లేవు. కానీ పాత వాహన యజమానులపై అదనపు నిర్వహణ భారం పడే అవకాశం మాత్రం ఉంది.

ఇన్స్యూరెన్స్ కవరేజీ విషయంలో కూడా సోషల్ మీడియాలో అనేక ప్రచారాలు జరుగుతున్నాయి. సాధారణంగా ప్రభుత్వం అనుమతించిన ఇంధనాన్ని ఉపయోగించినందుకు మాత్రమే ఇన్స్యూరెన్స్ క్లెయిమ్ తిరస్కరించబడుతుందని చెప్పే అధికారిక విధానం ప్రస్తుతం లేదు. అయితే వాహనం తయారీదారు సూచించిన ప్రమాణాలకు విరుద్ధంగా అధిక ఇథనాల్ మిశ్రమాన్ని ఉపయోగిస్తే వారంటీ లేదా సాంకేతిక సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అందువల్ల ప్రజలు వాస్తవ సమాచారం, అధికారిక మార్గదర్శకాలనే ఆధారంగా తీసుకోవాలి. కేంద్ర మంత్రి Nitin Gadkari కుటుంబ సభ్యులకు ఇథనాల్ పరిశ్రమలతో సంబంధాలున్నాయని రాజకీయ విమర్శలు తరచూ వినిపిస్తుంటాయి. అయితే ఏ ప్రజా విధానంపైనా విమర్శలు వచ్చినప్పుడు వాటిని వాస్తవాల ఆధారంగా పరిశీలించాలి. ఒక విధానం వల్ల కొందరు వ్యాపారవేత్తలు లాభపడటం, ఆ విధానం పూర్తిగా వారి ప్రయోజనాల కోసమే రూపొందించబడిందని నిరూపించదు. అదే సమయంలో విధాన నిర్ణయాల్లో పారదర్శకత, ప్రయోజనాల సంఘర్షణలపై పూర్తి వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండటం ప్రజాస్వామ్యంలో అత్యంత అవసరం.

100 శాతం ఇథనాల్‌తో నడిచే వాహనాల విషయానికి వస్తే, బ్రెజిల్‌లో ఫ్లెక్స్-ఫ్యూయల్ వాహనాలు ఇప్పటికే ఉన్నాయి. అవి ప్రత్యేకంగా రూపొందించిన ఇంజిన్లతో పనిచేస్తాయి. సాధారణ పెట్రోల్ వాహనాల్లో నేరుగా 100 శాతం ఇథనాల్ పోయడం సాధ్యం కాదు. కాబట్టి భవిష్యత్తులో అటువంటి వాహనాలు వస్తే వాటికి ప్రత్యేక సాంకేతిక ప్రమాణాలు అవసరం అవుతాయి.

అసలు ప్రశ్న ఏమిటంటే, ఇంధన భద్రత కోసం మనం కేవలం ఇథనాల్‌పైనే ఆధారపడాలా? సమాధానం కాదు. ప్రపంచవ్యాప్తంగా విద్యుత్ వాహనాలు, హైడ్రోజన్ ఇంధనం, బయోగ్యాస్, ప్రజా రవాణా వ్యవస్థల విస్తరణ వంటి అనేక ప్రత్యామ్నాయ మార్గాలు పరిశీలిస్తున్నారు. భారతదేశంలో వ్యవసాయ వ్యర్థాలు, నగర ఘన వ్యర్థాలు, ఆహార అవశేషాల నుంచి తయారయ్యే రెండో తరం బయోఫ్యూయల్స్‌కు ప్రాధాన్యం ఇవ్వాలి. ఇవి ఆహార పంటలతో పోటీ పడవు. అదే విధంగా సౌరశక్తి, గాలి శక్తి ఆధారిత విద్యుత్ ఉత్పత్తిని వేగంగా విస్తరించడం ద్వారా విద్యుత్ వాహనాలకు స్వచ్ఛమైన శక్తిని అందించవచ్చు.

ఇంధన విధానం కేవలం చమురు దిగుమతుల సమస్యకు పరిష్కారం మాత్రమే కాదు; అది వ్యవసాయం, నీటి వనరులు, ఆహార భద్రత, పర్యావరణం, వినియోగదారుల ప్రయోజనాలు అన్నింటినీ ప్రభావితం చేస్తుంది. అందువల్ల ఇథనాల్ విధానాన్ని అంధంగా సమర్థించడం ఎంత ప్రమాదకరమో, పూర్తిగా వ్యతిరేకించడం కూడా అంతే ప్రమాదకరం. అవసరమైనది శాస్త్రీయ ఆధారాలు, పారదర్శక నిర్ణయాలు, ప్రజా చర్చ. ఆహారాన్ని ఇంధనంగా మార్చే ముందు ఆకలిని నిర్మూలించే బాధ్యత ప్రభుత్వాలపై ఉందనే విషయాన్ని మర్చిపోరాదు. దేశానికి ఇంధన భద్రత అవసరమే, కానీ అది ఆహార భద్రత, నీటి భద్రత, పర్యావరణ సమతుల్యతలను తాకట్టు పెట్టి సాధించకూడదు. అదే నిజమైన స్థిరమైన అభివృద్ధి మార్గం.

డాక్టర్ కోలాహలం
రామ్ కిశోర్
9849328496.



# నకిలీ విత్తనాలు - వ్యవసాయ భవిష్యత్తుకు ముప్పు!

భారత వ్యవసాయ రంగంలో విత్తనం కేవలం ఒక ఉత్పత్తి కాదు; అది రైతు ఆశలకు, కుటుంబ జీవనోపాధికి, దేశ ఆహార భద్రతకు పునాది. "మంచి విత్తనం సగం పంట" అనే రైతు నానుడి వెనుక శాస్త్రీయ సత్యం ఉంది. ప్రపంచవ్యాప్తంగా వ్యవసాయ పరిశోధనల ప్రకారం నాణ్యమైన విత్తనాల వినియోగం వల్ల మాత్రమే పంట దిగుబడిలో 20% నుంచి 30% వరకు పెరుగుదల సాధ్యమవుతుంది. సరైన ఎరువులు, నీటి నిర్వహణ, ఆధునిక సాగు విధానాలు కలిస్తే ఈ పెరుగుదల 45% వరకు చేరుతుంది. అదే నాసిరకం లేదా నకిలీ విత్తనాలు రైతు చేతికి చేరితే, ఎంత మంచి భూమి ఉన్నా, ఎంత పెట్టుబడి పెట్టినా, ఎంత శ్రమించినా ఫలితం శూన్యంగా మారుతుంది.

భారతదేశంలో సుమారు 146 మిలియన్ వ్యవసాయ కమతాలు ఉన్నాయి. దేశ జనాభాలో దాదాపు 46% మంది ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. వ్యవసాయం దేశ స్థూల దేశీయోత్పత్తి (జిడిపి)లో సుమారు 18% వాటాను అందిస్తోంది. దేశ ఆహార భద్రతను కాపాడుతున్న ఈ రంగంలో విత్తనాల నాణ్యత క్షీణించడం జాతీయ ఆర్థిక వ్యవస్థకే ముప్పుగా మారుతోంది. రైతు నష్టపోతే గ్రామీణ మార్కెట్లు దెబ్బతింటాయి, గ్రామీణ వినియోగం తగ్గుతుంది, అప్పులు పెరుగుతాయి, చివరకు దేశ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుంది.

భారతదేశ విత్తన పరిశ్రమ విలువ 2025 నాటికి సుమారు ₹38,000 కోట్లకు పైగా చేరినట్లు పరిశ్రమ అంచనాలు సూచిస్తున్నాయి. ప్రతి సంవత్సరం లక్షల టన్నుల ధృవీకరించిన విత్తనాలు ఉత్పత్తి అవుతున్నప్పటికీ వాటితో పాటు నకిలీ విత్తనాల వ్యాపారం కూడా వేగంగా విస్తరిస్తోంది. ముఖ్యంగా పత్తి, వరి, మొక్కజొన్న, మిరప, సోయాబీన్, కంది, శనగ, టమాట, కూరగాయల విత్తనాల్లో ఈ సమస్య మరింత తీవ్రమైంది. మార్కెట్లో నకిలీ బ్రాండ్ లేబుళ్లు, నకిలీ హోలోగ్రామ్‌లు, నకిలీ ప్యాకింగ్‌లతో రైతులను మోసం చేసే ముఠాలు రాష్ట్రాల సరిహద్దులు దాటి వ్యాపారం నిర్వహిస్తున్నాయి.

ఇటీవలి కాలంలో తెలంగాణలోని ఆదిలాబాద్ జిల్లాలో ₹20 లక్షలకు పైగా విలువైన నకిలీ విత్తనాలను అధికారులు స్వాధీనం చేసుకోవడం, హైదరాబాద్ పరిసరాల్లో ₹30 లక్షల విలువైన నకిలీ పత్తి విత్తనాలు పట్టుబడడం, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో అనేక అక్రమ గోదాములు వెలుగులోకి రావడం సమస్య తీవ్రతను తెలియజేస్తున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని అనేక జిల్లాల్లో కూడా రైతులు మొలక శాతం తక్కువగా ఉండటం, వేరే రకం మొక్కలు రావడం, దిగుబడి పూర్తిగా తగ్గిపోవడం వంటి ఫిర్యాదులు చేస్తున్నారు. ఇవి ఒక్కో జిల్లా సమస్యలు కాదు; దేశవ్యాప్తంగా విస్తరిస్తున్న వ్యవస్థాగత సంక్షోభానికి సంకేతాలు.

నాణ్యతా లోపాలు -- రైతు నష్టాలు

వ్యవసాయ ఉత్పాదకతకు భూమి, నీరు, ఎరువులు ఎంత ముఖ్యమో విత్తనం అంతకంటే కీలకమైన అంశం. శాస్త్రవేత్తల అభిప్రాయం ప్రకారం పంట విజయానికి సుమారు 25% నుంచి 30% వరకు నాణ్యమైన విత్తనాలే కారణమవుతాయి. అయితే భారతదేశంలో ప్రతి పంట కాలంలో లక్షలాది మంది రైతులు నాసిరకం విత్తనాల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారు. వర్షాలు సకాలంలో పడినా, ఎరువులు సరైన మోతాదులో వాడినా, రైతు శ్రమ ఎంత ఉన్నా విత్తనం నాణ్యంగా లేకపోతే మొత్తం వ్యవసాయ చక్రం దెబ్బతింటుంది. ఒక్క రైతు మాత్రమే కాదు, గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మొత్తం దాని ప్రభావాన్ని అనుభవించాల్సి వస్తుంది.




కేంద్ర వ్యవసాయ శాఖ పార్లమెంట్‌లో వెల్లడించిన గణాంకాల ప్రకారం గత కొన్ని సంవత్సరాల్లో దేశవ్యాప్తంగా పరీక్షించిన 8.09 లక్షల విత్తన నమూనాల్లో 3.33 లక్షలకు పైగా నమూనాలు నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా లేవని తేలింది. అంటే పరీక్షించిన ప్రతి 100 నమూనాల్లో దాదాపు 41 నమూనాలు నాణ్యతా లోపాలతో ఉన్నాయన్న విషయం ఆందోళన కలిగిస్తోంది. ఇంత భారీ స్థాయిలో లోపాలు బయటపడుతున్నప్పటికీ బాధ్యులపై చట్టపరమైన చర్యలు మాత్రం అత్యంత పరిమితంగా ఉండటం పరిస్థితి తీవ్రతను మరింత పెంచుతోంది.

### నకిలీ విత్తనాలు - ఆర్థిక, సామాజిక సంక్షోభం

నకిలీ విత్తనాల సమస్య కేవలం వ్యవసాయ సమస్య మాత్రమే కాదు. ఇది ఆర్థిక, సామాజిక, న్యాయ, పరిపాలనా వ్యవస్థల వైఫల్యానికి ప్రతీకగా మారుతోంది. నాణ్యమైన విత్తనం రైతు హక్కు. ఆ హక్కును కాపాడలేకపోతే వ్యవసాయాభివృద్ధి లక్ష్యాలు, రైతు ఆదాయం రెట్టింపు వంటి విధానాలు కాగితాలకే పరిమితమయ్యే ప్రమాదం ఉంది. అందువల్ల విత్తన ఉత్పత్తి నుంచి రైతు చేతికి చేరే వరకు ప్రతి దశలో పారదర్శక పర్యవేక్షణ, కఠిన చట్ట అమలు, వేగవంతమైన న్యాయ చర్యలు, రైతులకు సాంకేతిక అవగాహన, నష్టపరిహారం చెల్లించే సమర్థ వ్యవస్థ అత్యవసరంగా మారింది. భారతదేశంలో ప్రతి సంవత్సరం ఖరీఫ్, రబీ సీజన్లలో కోట్లాది విత్తన ప్యాకెట్లు విక్రయించబడుతున్నాయి. ఈ విస్తారమైన మార్కెట్‌లో కొద్దిపాటి శాతం కూడా నకిలీ విత్తనాలు చొరబడితే వేలాది గ్రామాలు ప్రభావితమవుతాయి. ఒక గ్రామంలో 500 మంది రైతులు ఒకే రకం విత్తనం వాడితే, ఆ విత్తనం నాసిరకమైతే మొత్తం గ్రామ ఆర్థిక వ్యవస్థ దెబ్బతింటుంది. రైతుల ఆదాయం తగ్గిపోవడంతో వ్యవసాయ కూలీలకు ఉపాధి తగ్గుతుంది. ఎరువుల దుకాణాలు, యంత్రాల అద్దె కేంద్రాలు, రవాణా రంగం, స్థానిక మార్కెట్లు అన్నీ ప్రభావితమవుతాయి. అందువల్ల నకిలీ విత్తనం వల్ల కలిగే నష్టం ఒక్క రైతుకే పరిమితం కాదు; గ్రామీణ ఆర్థిక వ్యవస్థ మొత్తాన్ని కుదేలు చేస్తుంది.

### ప్రభుత్వాలు, సంస్థల బాధ్యత

వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, వ్యవసాయ శాస్త్ర కేంద్రాలు రైతులకు నాణ్యమైన విత్తనాల ప్రాధాన్యంపై నిరంతర అవగాహన కల్పించాలి. ప్రతి మండలంలో మొలక పరీక్ష శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలి. రైతులు కొనుగోలు చేసే ప్రతి విత్తన ప్యాకెట్‌కు సంబంధించిన రసీదును తప్పనిసరిగా భద్రపరచాలని తెలియజేయాలి. అనుమానాస్పద విత్తనాలను వెంటనే వ్యవసాయ అధికారులకు సమాచారం ఇవ్వడానికి ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్లు, మొబైల్ యాప్‌లు అందుబాటులో ఉండాలి. గ్రామస్థాయిలో రైతు సంఘాలు కూడా నకిలీ విత్తనాల గుర్తింపులో కీలక పాత్ర పోషించాలి.

చిన్న, సన్నకారు రైతులు దేశ వ్యవసాయానికి మూలస్తంభాలు. భారతదేశంలోని మొత్తం వ్యవసాయ కమతాల్లో 85% కంటే ఎక్కువ చిన్న, సన్నకారు రైతులవే. వీరికి ఒక్క పంట విఫలమైనా కుటుంబ జీవితం తీవ్ర సంక్షోభంలో పడుతుంది. అందువల్ల నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు వేగవంతమైన పరిహారం అందించే ప్రత్యేక చట్టబద్ధ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. పరిహారం కోసం నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి తొలగాలి. రైతు ఫిర్యాదు చేసిన నిర్దిష్ట గడువులో విచారణ పూర్తి చేసి నష్టపరిహారం చెల్లించే విధానాన్ని అమలు చేయాలి.

విత్తన కంపెనీలు కూడా తమ సామాజిక బాధ్యతను గుర్తించాలి. రైతు విశ్వాసమే తమ వ్యాపారానికి మూలమని అర్థం చేసుకోవాలి. నాణ్యత నియంత్రణలో రాజీ పడకూడదు. పంపిణీ వ్యవస్థను పారదర్శకంగా ఉంచాలి. నకిలీ ఉత్పత్తులను అరికట్టేందుకు అత్యాధునిక భద్రతా గుర్తులు, డిజిటల్ ధ్రువీకరణ విధానాలు ప్రవేశపెట్టాలి. రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను అత్యంత వేగంగా పరిష్కరించే ప్రత్యేక విభాగాలను ఏర్పాటు చేయాలి. రైతు నమ్మకం కోల్పోతే ఏ కంపెనీ కూడా దీర్ఘకాలం నిలబడలేదన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి.

రైతు కేవలం ఆహారాన్ని పండించే వ్యక్తి మాత్రమే కాదు. దేశ ఆర్థిక వ్యవస్థకు బలమైన పునాది వేసే నిర్మాత. గ్రామీణ సంస్కృతిని నిలబెట్టే శక్తి. కోట్లాది ప్రజల జీవనాధారాన్ని కాపాడే అన్నదాత. అలాంటి రైతును నకిలీ విత్తనాలతో మోసం చేసే ప్రతి వ్యక్తి దేశ ప్రయోజనాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నట్టే. అందువల్ల నకిలీ విత్తనాలపై రాజీలేని పోరాటం సాగించడం ప్రభుత్వాలకే కాకుండా సమాజంలోని ప్రతి వర్గం బాధ్యతగా మారాలి.

చివరగా ఒక విషయం స్పష్టంగా గుర్తుంచుకోవాలి. రైతు చేతిలో పడే ప్రతి విత్తనం ఒక గింజ మాత్రమే కాదు; అది ఒక కుటుంబ ఆశ, ఒక గ్రామ భవిష్యత్తు, ఒక రాష్ట్ర ఆర్థిక బలం, ఒక దేశ ఆహార భద్రతకు ప్రతీక. ఆ గింజను కల్తీ చేసే ప్రతి చర్య దేశ భవిష్యత్తును కలుషితం చేసే నేరం. కాబట్టి రైతు నమ్మకాన్ని కాపాడే విత్తన విధానం, పారదర్శక మార్కెట్ వ్యవస్థ, కఠిన చట్ట అమలు, శాస్త్రీయ పర్యవేక్షణ, వేగవంతమైన న్యాయ రక్షణ, రైతు కేంద్రిత పరిపాలన అమలులోకి వచ్చినప్పుడే "జై జవాన్ - జై కిసాన్" అనే నినాదం నిజమైన అర్థంలో సాకారం అవుతుంది. రైతు బలపడితేనే వ్యవసాయం బలపడుతుంది. వ్యవసాయం బలపడితేనే భారతదేశం ఆర్థికంగా, సామాజికంగా, ఆహార భద్రత పరంగా మరింత శక్తివంతమైన దేశంగా ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుంది.

డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం



### జనం ఘోష!

పెల్లుబికే 'జనంఘోష'!
దానినిపట్టించుకోకుండా
నెహ్రూ కంటే గొప్ప అంటూ
భజనచేయించు కోవటం!
ఇదేనా సంస్కారం?
ఖరీదైన సూట్లు వేసి
ప్రత్యేక విమానాల్లో
ప్రపంచ దేశాలన్నీ
తిరిగితే ఏంజరిగింది?
రూపాయి పతనం తప్ప!
కొనుగోలు శక్తిలేక
నిత్యదారిద్ర్యంతోజనం!
అదానీ అంబానీలకు
లాభలుమాత్రం ఘనం!
ఇదేనా నీగొప్పతనం ?
అమెరికా ఇజ్రాయెల్
భూతాల సరసన
వాళ్ల భుజంతట్టి
కౌగిలించుకుంటే
ఒరిగిందేమిటి?
విశ్వగురువుకి
అందరూ శిష్యులే!
గురుదక్షిణ మాత్రం
సంకెళ్ళ 'గౌరవం'!
నావికుల హననం!
(నిన్నమననావికులు
ముగ్గురిని అమెరికన్
సైన్యం చంపేసారు )
నువ్వూ భూతానివే!
దేశంలోనే తప్ప
దేశంబైట నువ్వు
మింగాలేవు!
ఉన్నది కక్కాలేవు!
అద్భుత దీపానికి
నువ్వుబానిసభూతం!
ఇంటా బైటా జనం
కంటనీరు కారుస్తూ
ఎందుకుమాకీ శిక్ష?
కొనొద్దు తినొద్దని
ఇంట్లో ఈగలమోత!
శవాలదుర్గంధతో
బైటవిమానాలమోత!
ఏంటీ 'జనంఘోష'!

-తమ్మినేని అక్కిరాజు, హైదరాబాద్



## పేద ప్రజల సొంతింటి కల సాకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి



**పెద్దశంకరంపేట, జూన్ 17 (జనం సాక్షి) :** పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. బుధవారం పెద్ద శంకరంపేట మండల పరిధిలోని జూకల్ గ్రామంలో నూతనంగా నిర్మించుకున్న ఇందిరమ్మ గృహాల గృహప్రవేశ వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఒక జోకర్ గ్రామంలోని 14 మంది ఇందిరమ్మ వీళ్ళ గృహప్రవేశాలు జరుపుకోవడం సంతోషకరమైన విషయం అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ నారాయణ. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేందర్ రెడ్డి,నారా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు కనీస వేతనం 26 వేలు ఇవ్వాలి




**శామీర్‌పేట్, జూన్ 17 (జనం సాక్షి) :** మూడుచింతలపల్లి మున్సి పల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఆఫీస్ వద్ద బుధవారం రోజు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కె.ఉన్ని కృష్ణన్ అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ.. మూడు చింతలపల్లి మున్సిపల్ లో పనిచేస్తున్న కార్మికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గు చేటన్నారు. మున్సిపల్ కార్మికుల సమస్యలైన ఒక పూట డ్యూటీ, వారాంతపు సెలవులు, పండగ సెలవులు ఇవ్వాలన్నారు. సబ్బులు , నూనె మరియు యూనిఫాం ఇవ్వాలి. ఈఎస్ఐ కార్డ్, పిఎఫ్ స్లిప్ లు ఇవ్వాల్సిందే నన్నారు.కనీస వేతనం 26 వేల రూపాయలు అమలు చేసి పర్మినెంట్ చేయ్యాలని పేర్కొన్నారు.అందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సుగుణ, బాలయ్య ,కృష్ణ,నవనీత,శ్రీను , జ్యోతి, రాజు, రవి, బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## కోట్‌పల్లిలో ఓటరు జాబితా సవరణపై 2కే రన్‌కు విశేష స్పందన

- అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి.
- తాసిల్దార్ ఆనందరావు



**కోట్‌పల్లి, జూన్ 17 (జనంసాక్షి) :** ప్రజాస్వామ్యానికి పునాది ఓటు హక్కు అని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోట్ పల్లి తాహాసిల్దార్ ఆనందరావు పిలుపునిచ్చారు. ఓటరు జాబితా ప్రత్యేక సవరణ ఎస్ఐఆర్ –2026) కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో నిర్వహించిన '2కే రన్' కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. తాహసిల్దార్ కార్యాలయం నుంచి బస్టాండ్ వరకు ఉత్సాహంగా ఉదయం 9 గంటలకు తాహ సిల్దార్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ 2కే రన్ ప్రధాన రహదారి మీదుగా అంబేద్కర్ చౌరస్తా, బస్టాండ్ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా తాసిల్దార్ ఆనందరావు మాట్లాడుతూ.... ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరునికి రాజ్యాంగం కల్పించిన విలువైన హక్కు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడం వారి ప్రథమ కర్తవ్యం. నకిలీ ఓట్లు, డూప్లికేట్ ఓట్లు తొలగించి, అర్హులైన వారందరికీ ఓటు హక్కు కల్పించడమే ఎస్ఐఆర్–2026 ముఖ్య ఉద్దేశం అని అన్నారు. ఎస్ఐ శైలజ మాట్లాడుతూ.... ఓటు అనేది మన గొంతుక. సరైన నాయకులను ఎన్నుకోవడానికి ఓటు హక్కును వినియోగించుకోవాలి. యువత ముందుండి ఓటరు నమోదు కార్యక్రమంలో భాగస్వాములు కావాలి అని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, జిపిఓలు, యువకులు పాల్గొన్నారు.

## స్కూల్ బస్సులు భద్రత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలి




**తూప్రాన్, జూన్ 17 (జనం సాక్షి) :** ప్రైవేటు పాఠశాలల విద్యార్థులను రవాణా చేసే బస్సులు భద్రత తప్పకుండా పాటించాలని తెలిపారు. తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో సిబ్బందితో కలిసి స్కూల్ బస్సులను తనిఖీ చేసిన సందర్భంగా మాట్లాడారు. బస్సులో యజమాన్యాలు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని వారిని డ్రైవర్ గా పెట్టుకోవద్దని లైసెన్స్ కలిగిన వారిని మాత్రమే నడపాలని సూచించారు. ఈ సందర్భంగా స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, పొల్యూషన్ అండర్ కంట్రోల్ (గ్రాఖజ) సర్టిఫికెట్లు, డ్రైవర్ల డ్రైవింగ్ లైసెన్సులు, వాహనాల ఇన్సూరెన్స్ పత్రాలను పరిశీలించి ధృవీకరించడం జరిగింది. అదేవిధంగా విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, బస్సులను సురక్షితంగా నడపాలని డ్రైవర్లకు సూచనలు ఇవ్వడం జరిగింది.

# కల్వకుర్తిని స్కిల్ హబ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం

- టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**వెల్దండ, జూన్ 17 (జనంసాక్షి) :** కల్వకుర్తి యువతకోసం ఉచిత ఏఐ మరియు ఐఐటీ శిక్షణ తరగతులు నిర్వహిస్తామన్నారు. వచ్చే 5 సంవత్సరాల్లో 5,000 మంది యువతకు ఏఐ మరియు ఐఐటి రంగాలలో భవిష్యత్ నైపుణ్యాల శిక్షణ లక్ష్యం కోసం పనిచేస్తామన్నారు.ల్వకుర్తి నియోజకవర్గ యువతకు ప్రపంచ స్థాయి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్,టాస్క్ సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మరో కీలక ముందడుగు వేశారు.విద్య,ఉద్యోగాలు, నైపుణ్యాభివృద్ధి రంగాల్లో యువతకు నిరంతరం అండగా నిలుస్తూ కల్వకుర్తిని స్కిల్ హబ్ మార్చేందుకు ఐక్యత ఫౌండేషన్ స్కిల్ ఫ్యాక్టరీ" కార్యక్రమం ద్వారా ఇప్పుడు భవిష్యత్తు ఉద్యోగ ప్రపంచాన్ని శాసిస్తున్న ఆర్టిఫిషియల్ ఇంటలీజెన్స్,మరియు ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగాల్లో కల్వకుర్తి యువతకు అవకాశాలు అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను రూపొందిస్తున్నారు. కల్వకుర్తి నియోజకవర్గ యువత కోసం ప్రత్యేక నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు .ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ..ఈ కార్యక్రమం ద్వారా రాబోయే ఐదు సంవత్సరాల్లో 5,000 మంది యువతకు భవిష్యత్ ఉద్యోగ అవకాశాలకు అవసరమైన ఆధునిక నైపుణ్యాలపై శిక్షణ అందించడమే లక్ష్యమని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగ రంగం వేగంగా మారుతోంది, ఒకప్పుడు డిగ్రీ ఉంటే ఉద్యోగం దొరికే పరిస్థితి ఉండేది,కానీ నేడు నైపుణ్యాలే ఉద్యోగాలకు ప్రధాన అర్హతగా మారాయి.అయితే గ్రామీణ ప్రాంతాలకు చెందిన అనేక మంది యువతలో ప్రతిభ ఉన్నప్పటికీ, సరైన శిక్షణ, మార్గదర్శకత్వం మరియు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన అవకాశాలు లేక వెనుకబడుతున్నారు,ఈ పరిస్థితిని మార్చాలనే సంకల్పంతోనే ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా యువత కేవలం శిక్షణ పొందడమే కాదు,భవిష్యత్తు ఉద్యోగ మార్కెట్‌కు సిద్ధమయ్యే అవకాశం కూడా పొందుతున్నారన్నారు.ఇప్పుడు భవిష్యత్తు తరాలకు అత్యంత అవసరమైన టెక్నాలజీ ఆధారిత నైపుణ్యాలను అందించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.ఈ భాగస్వామ్య కార్యక్రమంలో ఇన్ఫో దట్ ఐ.ఎన్.సీ ఫౌండర్ మరియు సీఈఓ ఎం. మల్లారెడ్డి మాట్లాడుతూ..కల్వకుర్తి నియోజకవర్గ యువతకు ప్రపంచ స్థాయి సాంకేతిక నైపుణ్యాలు అందించి, అంతర్జాతీయ ఉపాధి అవకాశాలకు వారిని సిద్ధం చేయాలనే సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆలోచనకు మేము కూడా తోడ్పాటును అందించేందుకు ఐక్యత ఫౌండేషన్‌తో కలిసి పనిచేయడానికి ముందుకు వస్తున్నామని, గ్రామీణ యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసి, వారికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం ద్వారా భవిష్యత్ తరాలకు మెరుగైన అవకాశాలు కల్పించవచ్చని అభిప్రాయపడ్డారు.కార్యక్రమంలోఐక్యత ఫౌండేషన్ చైర్మన్,టాస్క్ సి.ఓ.ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డితో పాటు ఇన్ఫో దట్ గ్లోబల్ ఐ.ఎన్.సి ఫౌండర్ సీఈఓ ఎం. మల్లారెడ్డి మరియు వారి సంస్థ ప్రతినిధుల బృందం,తదితరులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు పరిరక్షణే ప్రజాస్వామ్యానికి బలమైన పునాది

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి




**తాండూరు, జూన్ 17 (జనంసాక్షి) :** ఓటు హక్కు పరిరక్షణే ప్రజాస్వామ్యానికి బలమైన పునాది అని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. ఎస్ఐఆర్ అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం తాండూర్ ఆర్డీఓ అనిత ఆధ్వర్యంలో ఇందిరా చౌక్ నుండి సెయింట్ మార్క్స్ స్కూల్ వరకు నిర్వహించిన 2కే రన్‌లో ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎస్ఐఆర్ అవగాహన కోసం వేస్తున్న ప్రతి అడుగు ప్రజా చైతన్యానికి నాంద అన్నారు.ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ప్రతి పౌరుడికి అత్యంత విలువైన రాజ్యాంగబద్ధమైన హక్కు. ఈ హక్కును పరిరక్షించడం, ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో నమోదు కావడం మనందరి బాధ్యత అన్నారు.ఈ 2కే రన్ కేవలం ఒక పరుగు కార్యక్రమం కాదు; ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసే ప్రజా చైతన్య యాత్ర అన్నారు. నకిలీ ఓట్లకు తావులేకుండా, ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించేలా ప్రతి బిఎల్ ఓ, ప్రతి బిఎల్ఎ అత్యంత బాధ్యతాయుతంగా పనిచేయాలన్నారు.ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత కలిసి ఓటు హక్కు ప్రాముఖ్యతను ప్రతి ఇంటికి చేర్చాలని సూచించారు.మన ఓటు – మన భవిష్యత్తు 'ప్రతి అర్హుడి పేరు ఓటరు జాబితాలో ఉండాలి' అనే సంకల్పంతో ముందుకు సాగుదామని పిలుపు నిచ్చారు.ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని నేను కోరుతున్నాను అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పట్లోళ్ల నీరజ బాల్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్దుల్ రజాక్,తాండూర్ ఆర్డీఓ అనిత , మున్సిపల్ కమిషనర్ రాకేష్ రెడ్డి, ఎమ్మార్వోలు, అధికారులు, వార్డు కౌన్సిలర్లు, మరియు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు, జూన్ 17 (జనంసాక్షి) :** రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి పేర్కొన్నారు. తాండూరు పట్టణంలోని డీసీఎంఎస్ కార్యాలయంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఉచిత రెడ్‌గ్రామ్ కంది, మినుములు, పెసర్లు విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం రైతు సంక్షేమాన్ని అత్యంత ప్రాధాన్యంగా తీసుకుని, రైతుల ఆదాయాన్ని పెంచే దిశగా అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందన్నారు. రైతులకు నాణ్యమైన విత్తనాలను అందించడం ద్వారా పప్పుధాన్యాల ఉత్పత్తి పెరుగుతుందని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, నాణ్యమైన విత్తనాల వినియోగం వల్ల దిగుబడులు పెరిగి రైతులకు అధిక లాభాలు చేకూరుతాయని తెలిపారు. ప్రభుత్వం రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలను అందించేందుకు కట్టుబడి ఉందన్నారు. తాండూరు నియోజకవర్గంలోని రైతుల అభివృద్ధి కోసం ఎల్లప్పుడూ కృషి చేస్తానని, రైతులు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. రైతు బాగుంటేనే గ్రామం బాగుంటుందని, గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం ప్రగతి పథంలో ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అన్నదాత సంతోషమే ప్రభుత్వ లక్ష్యం.. రైతు అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి బలమైన పునాది అని ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ బాల్ రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పట్లోళ్ల నర్సింలు, ఆత్మ కమిటీ చైర్మన్ శంకర్ రెడ్డి, ఏడీఏ అరుణ ,మున్సిపల్ కమిషనర్ రాకేష్ రెడ్డి, వ్యవసాయ శాఖ అధికారులు, రైతులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఓటరు జాబితా సవరణకు ప్రతీ ఒక్కరూ సహకరించాలి

- జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి




**కొడంగల్, జూన్ 17 (జనం సాక్షి) :** సమగ్ర ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ వెంకటాచారి ఆధ్వర్యంలో బుధవారం కొడంగల్ పట్టణ కేంద్రంలో 2కే రన్ పట్టణ కేంద్రంలో లైబ్రరీ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ వెంకటాచారి మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.ప్రత్యేక సవరణ కార్యక్రమంలో అధికారులతో పాటు అన్ని రాజకీయ పార్టీల బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొని తప్పులు లేని ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించాలని సూచించారు.అర్హులైన ప్రతి పౌరుడు తమ పేర్లను ఓటర్ల జాబితాలో నమోదు చేసుకోవడంతో పాటు, పేర్లు, చిరునామా తదితర వివరాల్లో ఏవైనా మార్పులు లేదా సవరణలు ఉంటే వెంటనే దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా ఓటర్ల జాబితాలో పేరు ఉండేలా చూసుకోవాలని అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో కొడంగల్ తహసీల్దార్ రాంబాబు, దుద్యాల తహసీల్దార్ కిసాన్ నాయక్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ అనిత, రెవెన్యూ సిబ్బంది, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య



**ఫరూఖ్ నగర్, జూన్ 17 (జనంసాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లోని నాణ్యమైన విద్య విద్యార్థులకు అందుతుందని ఫరూక్‌నగర్ మండల విద్యాధికారి టి.మనోహర్ అన్నారు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు అందజేశారు అనంతరం గురుకుల పాఠశాలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఒత్తిడి లేని, నాణ్యమైన విద్య అందుతుందని స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగే విద్యను విద్యార్థులు ఉపయోగించుకోవాలని సూచించరు ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలకు విద్యార్థులను పంపించి ఆర్థికంగా ఇబ్బందులు పడవద్దని అదేవిధంగా విద్యార్థులు మానసికంగా ఒత్తిడికి గురికాకుండా చూసుకోవలసిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు మనందరిపైన ఉంటుందని అన్నారు ఈకార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సింలు గౌడ్ గ్రామ సర్పంచ్ శివరాములు ఉపసర్పంచ్ మహేందర్ ఉపాధ్యాయురాలు కవిత, ఏఏపిసి చైర్ పర్సన్ షబానా , వార్డు సభ్యులు శ్రీను భరత్, దొడ్డి శ్రీను, పల్లపు రాజు ధనుగుల శ్రీశైలం, సంపంగి గణేష్, ప్రభాకర్, శివనీల, అనసూయ, రాధిక, వీరేశ్వరి, కొమరమ్మ, సుశీల, మల్లిక పాఠశాల విద్యార్థులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## లోక్ అదాలత్ ద్వారా బాధితులకు సత్వర న్యాయం

- ఎస్పీ వినీత్



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 17 (జనం సాక్షి) :** లోక్ అదాలత్ ద్వారా సత్వ ర న్యాయం జరుగుతుందని ఈ నెల 20వ తేదీ శనివారం రోజు నారాయణపేట, కోస్గి ,మక్తల్ కోర్టులలో నిర్వహించ నున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను బాధిత ప్రజలు సద్వినియోగం చేసుకోవా లని నారాయణపేటజిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ కోరారు. లోక్ అదాలత్ ద్వారా రాజీ పడదగిన కేసులను పరస్పర అంగీకారంతో త్వరితగతిన పరిష్కరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన వివాదాలు, కుటుంబ,వైవాహిక జీవితా నికి సంబంధించిన కేసులు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం కేసులు, చెక్ బౌన్స్ కేసులు తదితర అంశా ల్లో ఇరువర్గాలు రాజీ ద్వారా సమస్యలను పరిష్కరించుకో వచ్చన్నారు.చిన్న చిన్న వివా దాలను పెద్ద కక్షలుగా మార్చుకుని కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, ధనం వృథా చేసుకోవద్దని సూచిం చారు. రాజీయే రాజమార్గం అని పేర్కొంటూ, న్యాయశాఖ కల్పించిన ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించు కుని తమ వివాదాలకు శాశ్వత పరిష్కారం పొందాలని కోరారు.జిల్లాలోని పోలీస్ అధికారులు, కోర్టు విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి ఇరువర్గాల వారిని పిలిపించి కౌన్సిలింగ్ నిర్వ హించి అవగాహన కల్పిస్తా రని తెలిపారు. తమ కేసుల్లో రాజీ కావాలనుకునే వారు సంబంధిత పోలీస్ అధికారు లను సంప్రదించాలని సూచించారు.లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరి తగతిన న్యాయం అందు తుందని, ప్రజలు ఈ అవ కాశాన్ని సద్వినియోగం చేసుకుని స్నేహపూర్వక వాతావ రణంలో వివాదాలను ముగించుకోవాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# మహిళల హక్కుల పరిరక్షణకు నిరంతర కృషి అవసరం

**హయత్‌నగర్, జూన్ 17 (జనం సాక్షి) :** అఖిల భారత మహిళా సమాఖ్య (ఎన్ఎఫ్ఐడబ్ల్యూ) హయత్‌నగర్ మండల నిర్మాణ మహాసభ బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించబడింది. మండల అధ్యక్షురాలు కర్నే సుజాత అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా కార్యదర్శి ఎం.డి. ఫైమిద హాజరై, సంఘం జెండాను ఆవిష్కరించి, సభను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ హయత్‌నగర్ మండల నిర్మాణ బాధ్యులు, ఎల్‌బీనగర్ నియోజకవర్గ కార్యదర్శి కామ్రేడ్ సామిడి శేఖర్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలోని అన్ని రంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. మహిళల హక్కుల పరిరక్షణ, సంక్షేమం, వారి సమస్యల పరిష్కారం కోసం అఖిల భారత మహిళా సమాఖ్య నిరంతరం ఉద్యమాలు, అవగాహన కార్యక్రమాలు, పోరాటాలు నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో మండల స్థాయిలో మహిళల భాగస్వామ్యం, నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసే దిశగా సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. మహిళల ఆర్థిక, సామాజిక, రాజకీయ సాధికారత సాధనలో సంఘం మరింత చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. అనంతరం ఎన్ఎఫ్ఐడబ్ల్యూ హయత్‌నగర్ మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షురాలిగా చెంది సుమతి, కార్యదర్శిగా కుంచాల సౌజన్య ఎన్నికయ్యారు. తమపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి వారు కృతజ్ఞతలు తెలియజేస్తూ, మహిళల సమస్యల పరిష్కారం, హక్కుల సాధన కోసం అంకితభావంతో పనిచేస్తామని పేర్కొన్నారు. ఈ నిర్మాణ మహాసభలో సీపీఐ మండల కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి, కొప్పుల సరిత, సౌజన్య, ఆదిలక్ష్మి, శివజ్యోతి, అనిత, పద్మ, సుజాత, యమున, రజిత, గంగాబాయి, కాంచనతో పాటు మండల కౌన్సిల్ కార్యవర్గ సభ్యులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



జనంసాక్షి
www.janamsakshi.org
గురువారం
18 జూన్ 2026

# అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలి

- కోస్గిలో విస్తృతంగా పర్యటించిన జిల్లా కలెక్టర్

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 17 (జనం సాక్షి) :** నారాయణ పేట జిల్లాలోని కోస్గి మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను వేగ వంతం చేసి పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. టీయూఎఫ్ ఐ డీ సీ, కడ, ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ. 352.50 కోట్ల వ్యయంతో కోస్గి పట్టణంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ, వర్షపు నీటి కాలువలు, ప్రధాన అనుసంధాన రహదారులు , అంతర్గత సి.సి రోడ్లు మరియు నీటి సరఫరా వ్యవస్థ తదితర అభివృద్ధి పనులు కొనసాగుతుండగా,బుధవారం జిల్లా కలెక్టర్ నిర్మాణ పనులను కొడంగల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ ఏ తిరుపతి రెడ్డితో కలిసి పరిశీలించారు. అందులో భాగంగా కలెక్టర్ కోస్గి పట్టణంలోని సైన్స్ మ్యూజియం,డంపింగ్ యార్డ్, ప్రధాన అనుసంధాన రహదారులు, శంభుని గుడి ఆలయ ప్రాంతాలను సందర్శించారు. డంపింగ్ యార్డు ప్రహరీ చుట్టూ పొడవైన చెట్లు నాటాలని సూచించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు ఇప్పటి నుంచి తడి పొడి చెత్తతో పాటు శానిటరీ, మెడికల్ వేస్ట్ చెత్త నాలుగు రకాలుగా సేకరించాల్సి ఉంటుందని తెలిపారు. డశీపింగ్ యార్డులో రెండు షెడ్డుల నిర్మాణం మూడు నెలల్లో పూర్తి అవుతుందని ప్రజారోగ్య శాఖ ఈ ఈ కలెక్టర్ కు తెలిపారు. అనంతరం కలెక్టర్ శంభునిగుడి వద్ద జరుగుతున్న కల్వర్టు నిర్మాణ పనులను పరిశీలించారు. శంభుని ఆలయానికి సంబంధించిన భూములు కబ్జాలో ఉన్నాయని, సర్వే చేయించాలని కోస్గి మున్సిపల్ చైర్మెన్ నరేందర్ కలెక్టర్ ను కోరారు. స్పందించిన కలెక్టర్ సర్వే చేయించాలని తహసిల్దార్



బక్క శ్రీనివాస్‌ను ఆదేశించారు.

**ఇందిరమ్మ ఇల్లును ప్రారంభించిన కలెక్టర్**

కోస్గి మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు తిమ్మాయి పల్లి లో సాయిలు అనే లబ్ధిదారునికి చెందిన నూతన ఇందిరమ్మ ఇంటిని జిల్లా కలెక్టర్ ప్రియాంక ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్త ఇంటి గృహ ప్రవేశం చేసుకోవడంపై లబ్ధిదారుని అభిప్రాయాన్ని అడిగి తెలుసుకున్న కలెక్టర్ కుటుంబీకులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కొడంగల్ నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్ ఛార్జ్ ఏ.తిరుపతి రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నాగుల పల్లి నరేందర్, హౌసింగ్ పీడీ శంకర్ నాయక్, కమిషనర్ నాగరాజు, తహసిల్దార్ బక్క శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీధర్, హౌసింగ్ ఏ. ఈ, తదితరులు పాల్గొన్నారు.

**రేడియల్ రోడ్ సర్వే మ్యాప్**

కోస్గి నుంచి బుద్వేల్ వరకు చేపట్టబోయే రేడియల్ రోడ్ లో భాగంగా కోస్గి మండలంలోని నాచారం, తోగాపూర్ మార్గం నుంచి వెళ్ళే రేడియల్ రోడ్ మార్గాన్ని, రేడియల్ రోడ్ మ్యాప్ ను కలెక్టర్ పరిశీలించారు.

**సామాజిక ఆరోగ్య కేంద్రం ఆకస్మిక తనిఖీ**

కోస్గి పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలోని ఈసీజీ, డిజిటల్ ఎక్స్ రే, ల్యాబ్, లేబర్ రూమ్ ను పరిశీలించారు. మక్తల్, కోస్గి పట్టణాలతో పాటు జిల్లా కేంద్రానికి అత్యాధునిక పరికరాలతో (ఆక్సిజన్, వెంటిలేటర్ తో) కూడిన అంబులెన్స్ లు అవసరమని, వాటిని సీ. ఎస్.ఆర్ నిధులతో సమకూర్చే విషయంపై కలెక్టర్, కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్ ఛార్జీ తిరుపతి రెడ్డి, జిల్లా ఆస్పత్రుల సమన్వయ కర్త తో చర్చించారు.

**చంద్రవంచలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణం పరిశీలన**

కోస్గి మండలంలోని చంద్ర వంచ గ్రామంలో గీతా మహేశ్వరి అనే లబ్ధిదారురాలు మీవన్ టెక్నాలజీ( షేర్ వాల్)తో నిర్మింప చేసిన ఇందిరమ్మ ఇంటిని కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గ ఇన్ ఛార్జ్ ఏ.తిరుపతి రెడ్డితో కలిసి కలెక్టర్ ప్రియాంక పరిశీలించారు. మీవన్ టెక్నాలజీ తో నిర్మించిన ఇల్లు ఇందిరమ్మ ఇంటి నిబంధనల ప్రకారమే ఉందా లేదా అని పీడీ శంకర్ నాయక్ ను అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణ నిబంధనల ప్రకారమే కొత్త టెక్నాలజీతో నిర్మించుకున్నారని, గ్రామంలో మిగతా ఇళ్ల నిర్మాణాలను ఇదే టెక్నాలజీలో చేపట్టేందుకు లబ్ధిదారులు ఆసక్తి కనబరుస్తున్నారని, కానీ రూ.5 లక్షల కంటే ఎక్కువ ఖర్చు అవుతుందని, అదనంగా డబ్బులు పెట్టుకునే పరిస్థితి లబ్ధిదారులతో లేదని, గ్రామ సర్పంచి విద్యావతి కలెక్టర్ కు తెలిపారు.

# గ్రామీణాభివృద్ధికి అధిక ప్రాధాన్యత

- టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి



**హత్నూర, జూన్ 17 (జనం సాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తూ మౌలిక వసతుల కల్పనకు విశేష కృషి చేస్తుందని టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి అన్నారు. మండలంలోని బోర్పట్ల గ్రామంలో.గ్రామ పంచాయతీ, ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సిసి రోడ్లు,పరిశ్రమల సహకారంతో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్లు, విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యార్థం బస్సును వారి చేతుల మీదుగా బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందన్నారు. పేద, మధ్య తరగతి వర్గాల అభివృద్ధి కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి దిగ్విజయంగా అమలు చేస్తుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు నిజమైన అర్హులకు అందాలన్న సదుద్దేశంతో ప్రారంభించిన ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంతో పాలన ప్రజలకు మరింత చేరువైందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సుజాత,ఎపిటోరియా ఫార్మా పరిశ్రమ ప్రతినిధి శోభన్ బాబు,పిఏసిఎస్ చైర్మన్ దుర్గారెడ్డి,పార్టీ మండలాధ్యక్షుడు కృష్ణ,సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు మణిదీప్,ఆయా గ్రామాల సర్పంచులు భూపాల్ రెడ్డి, శ్రీహరి,వెంకటేశం,ఉప సర్పంచ్ కృష్ణ,ఎంపీటీసీల ఫోరం మాజీ మండలాధ్యక్షుడు రాజేందర్,నాయకులు కొన్యాల వెంకటేశం,శ్రీనివాసరెడ్డి,విట్టల్, బుచ్చిరెడ్డి,నరసింహారెడ్డి, శశిధర్ రెడ్డి,సందీప్ తదితరులు పాల్గొన్నారు.

# భూభారతి రీ సర్వే ద్వారా రైతులకు శాశ్వత పరిష్కారం

- నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి

**పెద్దశంకరంపేట, జూన్ 17 (జనం సాక్షి) :** భూభారతి భూముల రి సర్వే కార్యక్రమం ద్వారా రైతులకు భూములకు సంబంధించి శాశ్వత పరిష్కారం లభిస్తుందని నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి అన్నారు. బుధవారం పెద్ద శంకరంపేట మండల పరిధిలోని జూకల్‌లో నిర్వహించిన భూభారతి భూముల రీ సర్వే అవగాహన సదస్సు కార్యక్రమంలో పాల్గొని రైతులను ఉద్దేశించి మాట్లాడారు.. రైతుల భూములకు శాశ్వత రక్షణ కల్పించేందుకు ఎలాంటి సరిహద్దు తగాదాలు లేకుండా చూసేందుకే ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భూభారతి భూముల రీ సర్వే కార్యక్రమాన్ని చేపట్టిందని పేర్కొన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్ వల్ల తెలంగాణలో పేద ప్రజల భూములకు తీరని అన్యాయం జరిగిందని. అమాయకుల భూములు కబ్జాలు పాలు కావడానికి ఈ ఫోటో కారణమైందని ఆయన విమర్శించారు. ధరణి ఫోటోలు వల్ల ఎంతోమంది నిజమైన లబ్ధిదారులు తమ సొంత భూములపై హక్కులు కోల్పోయి కార్యాలయాలు చుట్టూ తిరగలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం భూభారతి భూముల రీ సర్వే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో జరిగే ఈ సర్వే ద్వారా ప్రతి ఒక్కరి భూమికి స్పష్టమైన డిజిటల్ రికార్డులు అందుబాటులోకి వస్తాయని



వివరించారు. గతంలో ఉన్న భూ రికార్డుల లోపాలను సవరించి పారదర్శకంగా భూముల సరిహద్దులను నిర్ణయించడానికి ఈ గ్రామ సభలు ఎంతగానో ఉపయోగపడతాయని ఆయన వివరించారు. జూకల్ గ్రామ రైతులందరూ సర్వే అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించి తమ భూములకు సంబంధించి సరైన పత్రాలను. చూపించి రీసర్వేన్ విజయవంతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డిఓ రమాదేవి. తాసిల్దార్ నారాయణ. అల్లాదుర్గం సిఐ రేణుక రెడ్డి. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేందర్ రెడ్డి నారా గౌడ్ అధిక సంఖ్యలో గ్రామస్తులు రైతులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వ బడులకు మహర్దశ

- ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**రాజాపూర్, జూన్ 17 (జనంసాక్షి) :** రాజాపూర్ మండలం రంగారెడ్డి గూడ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 36 లక్షల రూపాయల ముడా నిధులతో నిర్మించనున్న నూతన ప్రహరీ గోడ నిర్మాణ పనులకు బుదవారం రోజు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అనంతరం ప్రైమరీ పాఠశాలలో చేరిన చిన్నారులకు అక్షరభ్యాసం చేయించారు. పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని విద్యార్థులు, తల్లిదండ్రులకు విద్య ప్రాముఖ్యతను వివరించారు. ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు చెప్పులు లేకుండా పాఠశాలకు వస్తున్నారని, గత సంవత్సరం నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు బూట్లు పంపిణీ చేసిన విషయం గుర్తు చేశారు. ఈ సంవత్సరం సిఎం రేవంత్ రెడ్డి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా యూనిఫాం, బూట్లు ఇవ్వడం ఎంతో హర్షించదగ్గ విషయం అని అన్నారు. ఈ సందర్భంగా ఇటీవల నిర్వహించిన పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించి మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించి సన్మానించారు. విద్యార్థుల విజయాలకు



ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారం కూడా కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యాక్రమంలో రంగారెడ్డిగూడ సర్పంచ్ రేవతి, ఎంపిడీఓ విజయలక్ష్మి, ఏఎంసీ వైస్ చైర్మన్ శేఖర్ గౌడ్, శ్రీను నాయక్, ఉప సర్పంచ్ యాదయ్య, వార్డు సభ్యులు మౌనికావినోద్ కుమార్, సునీతారాములు గౌడ్, శ్రీకాంత్, మహేష్, పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం

- నూతన డీసీసీ కమిటీని ప్రకటించిన డీసీసీ అధ్యక్షులు కె.ప్రశాంత్ కుమార్ రెడ్డి
- మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణ ప్రజాస్వామ్యానికి మచ్చ

**నారాయణపేట, జూన్ 17 (జనం సాక్షి) :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని సివిఆర్ భవన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి నూతన జిల్లా కాంగ్రెస్ కమిటీని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏఐసీసీ, టీపీసీసీ ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీని గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో నూతన కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మంత్రి వాకిటి.శ్రీహరి,ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణిక రెడ్డి, అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జిలు ఎ. తిరుపతి రెడ్డి,కుంభం.శివకుమార్ రెడ్డిల సూచనల మేరకు జిల్లాలో పార్టీ కోసం నిరంతరం శ్రమిస్తున్న సీనియర్ నాయకులు,యువ నాయకులు, మహిళలు,బీసీ,ఎస్సీ,ఎస్టీ,మైనార్టీ వర్గాలకు సముచిత ప్రాధాన్యత కల్పిస్తూ కమిటీని రూపొందించినట్లు ఆయన పేర్కొన్నారు. ఆరుగురు జిల్లా ఉపాధ్యక్షులు,పన్నెండు మంది ప్రధాన కార్యదర్శులు,ఇరువై మంది కార్యదర్శులు,ఓ కోశాధికారి,ముగ్గురు అధికార ప్రతినిధులు,ఏడుగురు జిల్లా కార్యవర్గ సభ్యులుగా మొత్తం నలభై తొమ్మిది మంది సభ్యులతో కూడిన జిల్లా కాంగ్రెస్ కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఇందులో ఉపాధ్యక్షులు,ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు,అధికార ప్రతినిధులు మరియు వివిధ విభాగాల బాధ్యులకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయడమే కమిటీ ప్రధాన లక్ష్యమని అన్నారు. రాబోయే రోజుల్లో జిల్లా వ్యాప్తంగా పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రతి నాయకుడు,కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ అంశంపై స్పందించిన ఆయన, ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని విమర్శించారు. రాజకీయ కక్షసాధింపు ధోరణితో బీజేపీ వ్యవహరిస్తోందని ఆరోపించారు.



రాజ్యాంగ సంస్థలను దుర్వినియోగం చేస్తూ ప్రతిపక్ష స్వరాలను అణిచివేసే ప్రయత్నం జరుగుతోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఈ అన్యాయానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యబద్ధంగా పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ నెల 24వ తేదీ నుండి జరిగే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సార్) కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు. ఓటరు జాబితాల్లో ప్రతి అర్హుడి పేరు నమోదు కావాలని, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని అన్నారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్. సలీం, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షులు కృష్ణయ్య, నారాయణపేట మండల అధ్యక్షులు కోట్ల. రవీందర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి,కె.శంకర్, పల్ల అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాలలోనే సాధ్యం

**కోహెడ, జూన్ 17 (జనంసాక్షి) :** మండలంలోని బస్వాపూర్ లోని జిల్లా పరిషత్ ప్రాథమిక,ఉన్నత పాఠశాల లో బుధవారం గ్రామస్థుల ఆధ్వర్యంలో పాఠ్యపుస్తకాల పంపిణీ నిర్వహించారు. బడిబాటలో భాగంగా 6వ తరగతి నుంచి 10వ, తరగతి వరకు విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. నాణ్యమైన విద్య ప్రభుత్వ పాఠశాల లోనే సాధ్యమని పలువురు అభిప్రాయం వ్యక్తం చేశారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా కొత్త అడ్మిషన్లు జరుగుతున్నాయని, విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల వైపు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారని పాఠశాల ఉపాధ్యాయులు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల లో నాణ్యమైన విద్య తో పాటు ఉచిత పాఠ్య పుస్తకాలు పంపిణి చేస్తున్నట్లు ఉపాధ్యాయులు తెలిపారు.



# గ్రామాల అభివృద్ధి ఎమ్మెల్యే కసిరెడ్డితోనే సాధ్యం

- కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బాణావత్ శంకర్ నాయక్
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హరి కిషన్ నాయక్



**వెల్దండ, జూన్ 17 (జనంసాక్షి) :** గ్రామాల అభివృద్ధి కసిరెడ్డి నారాయణరెడ్డి ఎంపీ మల్లు రవి ల ద్వారానే సాధ్య మని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి బానవత్ శంకర్ నాయక్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు హరి కిషన్ నాయక్ లు అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం వారు మాట్లా డు తూ..30 నెల ల కాలంలో గ్రామాలలో ఎమ్మెల్యే కసి రెడ్డి సిసి రోడ్లు ఏర్పాటు ఏర్పాటు చేశారని, మండల కేంద్రాలకు గ్రామాల నుంచి బిటి రోడ్ల పనులు కొనసా గుతున్నా యని తెలిపారు. గానుగట్టు వాగుపై బ్రిడ్జి ఏర్పాటు పూర్తికావచ్చిందని అదేవిధంగా బైరా పూర్ వాగుపై బ్రిడ్జి పనులు కొనసాగుతున్నాయని తెలిపారు ఇందిమ్మ ఇళ్లు మొదటి విడుదల మంజూరు చేయించి పూర్తి చేశారని అదేవిధంగా రెండో విడత ఇళ్ల మంజూరు చేసి అర్హులను కేటాయిస్తారని తెలిపారు. ఈ సమావే శంలో నాయకులు అంజయ్య లక్ష్మణ స్వామి సుధీర్.పాల్గొన్నారు.

# అప్పక్‌పల్లి - కోటకొండ అసంపూర్తి రోడ్డు కోసం రాస్తారోకో

- నిలిచిపోయిన వాహనాలు
- నాయకుల అరెస్ట్

**నారాయణపేట జిల్లా బ్యూరో, జూన్ 17 (జనం సాక్షి) :** నారాయణపేట మండలం అప్పక్‌పల్లి -కోటకొండ - కోయిలకొండ మధ్యన అసంపూర్తిగా మిగిలిన రోడ్డును వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో నారాయ ణపేట జిల్లా కేంద్రంలోనీ అంబేద్కర్ చౌరస్తాలో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. దాంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోవడంతో పోలీసులు నాయకులను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా కార్యదర్శి బి రాము జిల్లా కార్యదర్శి, కాశినాథ్ మాట్లాడుతూ ఈ రోడ్డును పూర్తి చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయి అన్నారు. ఐదు సంవత్సరాల క్రితం ప్రారంభించిన రోడ్డు ప్రభుత్వం మారిపోయి కొత్త ప్రభుత్వం వచ్చినా కూడా పూర్తి చేయడంలో చిత్తశుద్ధి చూపడం లేదు అన్నారు. అందుకు స్థానిక ఎమ్మెల్యే, ఎంపీలు జవాబు చెప్పాల్సిన అవసరం ఉంది అన్నారు. రోడ్డు అసంపూర్తిగా మిగిలిపోవడం వల్ల ఈ ప్రాంత విద్యార్థులకు చదువులు కొనసాగించడం ఇబ్బందిగా ఉంది అన్నారు ఇక్కడ నుంచి మహబూబ్న గర్, నారాయణ పేట్ వెళ్లె వ్యాపారస్తులైన, విద్యార్థులైన వేరే ఉపాధి వెతుక్కునే యువకులైన ఉద్యోగస్తుల కైన చాలా ఇబ్బందిగా మారింది అన్నారు ఆర్టీసీ వాళ్లు బస్సు నడపాలి అంటే ఈ ప్రాంతం నుండి వచ్చే ఆదాయం కంటే బస్సు రిపేర్‌కి ఎక్కువ ఖర్చు అవుతున్నది అందుకే బస్సులు నడపడం లేదని అంటున్నారు. ఏ ప్రాంతమైన అభివృద్ధి చెందా లంటే ఆ ప్రాంతంలో రవాణా సౌకర్యాలు నీళ్లు ముఖ్యమై నవి కానీ ఇవి కల్పించడంలో గత ప్రభుత్వాలు నేటి ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా ఉంటున్నాయి అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అన్ని పార్టీలు రోడ్డు పూర్తి చేస్తామ ని హామీలు ఇచ్చాయి హామీలు ఇచ్చి రెండున్నర సంవత్సరాలు అవుతున్నా కూడా వాటిని పూర్తి చేయ డంలో చిత్తశుద్ధి చూపడం లేదు అన్నారు. ఇప్పటికైనా ఈ ప్రాంతంపై చిత్తశుద్ధి ఉంటే స్థానిక ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ అయినా లేదా కేంద్రంలో ఉన్నటువంటి బిజెపి ఎంపీడీకే అరుణ అయినా ఈ రోడ్డుని పూర్తి చేసే అవకాశం ఉన్నది కానీ వాళ్లు నిర్లక్ష్యంగా ఉంటూ ప్రజలపై రాజకీయాలు చేస్తున్నారు అన్నారు. అప్పకుపల్లి, కోటకొండ, కోయిలకొండ పెండింగ్ రోడ్డును వెంటనే పూర్తి చేసి ప్రాంత అభివృద్ధికి తోడ్పడా లని కోరుతున్నామన్నారు. లేనిచో ఈ ప్రాంతంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులుబి.యాదగిరి, జయలక్ష్మి, నర్సింలు, కాశప్ప, గోవిందు, నరహరి, టిడిపి నాయకులు రాములు యాదవ్ ,తెలంగా ణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షులు మడివాల కృష్ణ , అబ్దుల్ ఖాదర్ ఎంఐఎం జిల్లా అధ్యక్షుడు హాజరై సంపూర్ణ



మద్దతు ప్రకటిస్తూ మాట్లాడారు. అంబాదాస్ కార్మిక సంఘం జిల్లా నాయకులు, కోటకొండా మాజీ ఎంపీటీసీ లు సునీత, సుజాత అంగన్వాడి వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు, మాస్ లైన్ పార్టీ డివిజన్ నాయకులు హాజీ,ఎదిరింటి నర్సింలు, ప్రతాప్, వెంకట్రములు, అంజి, బాలకృష్ణ, ప్రశాంత్, నారాయణ, నారాయణపేట టౌన్ కార్యదర్శి కెంచి నారాయణ, ఎంఎల్ పార్టీ టౌన్ సాదిక్, సలీం, పృథ్వీరాజ్, మహబూబ్, తకి, వార్డ్ మెంబర్లు రఫీ, దస్తమ్మ, లక్ష్మి, ఎంఎల్ పార్టీ మండల నాయకులు నీలి దామోదర్, ఫీర్ మైనుద్దీన్, ఎదురింటి రాములు,అబ్దుల్, సాయిలు, అభంగపూర్ రాము,సిపిఎం మజర్, వెంకటేష్ పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షుడు, తదితరులు పాల్గొన్నారు.

# ఇద్దరు పాఠశాల సిబ్బందికి షోకాజ్ నోటీసులు

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- ఇంత జార్ గంజ్ పాఠశాల పారిశు ధ్యంపై కలెక్టర్ ఆగ్రహం



**వరంగల్ బ్యూరో, జూన్ 17 (జనం సాక్షి) :** వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్య శారద బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఇంతేజార్ గంజ్‌లో విద్యా ప్రమాణాలు, పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయుల హాజరుపై ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరు రిజిస్టర్‌ను పరిశీలించిన కలెక్టర్, తనిఖీ సమయంలో ఇద్దరు పాఠశాల సిబ్బంది ముందస్తు అనుమతి లేకుండా వెళ్లినట్లు గుర్తించారు. దీనిని తీవ్రంగా పరిగణించిన జిల్లా కలెక్టర్ వారికి షోకాజ్ నోటీస్‌లు జారీ చేయవలసిందిగా అదనపు కలెక్టర్ వై.వి. గణేష్‌కు సిఫారసు చేశారు. తనిఖీలో పాఠశాల ఆవరణ, తరగతి గదులు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూడాలని హెడ్మాస్టర్‌ను ఆదేశించారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం వహించినందుకు ప్రధానోపాధ్యాయుడిని మందలించి, స్కావెంజర్‌ను మార్చాలని సూచించారు. పాఠశాల ముందు ప్రవహిస్తున్న మురికి కాలువ విద్యార్థులకు ప్రమాదకరంగా మారే అవకాశం ఉందని హెచ్చరిస్తూ, వెంటనే కాలువకు పై కప్పుగా బండలతో కాలువను కప్పాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాలు, మధ్యాహ్న భోజన పథకం అమలు, విద్యార్థుల హాజరు, పాఠ్యపుస్తకాల పంపిణీ తదితర అంశాలపై పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడిన కలెక్టర్ వారికి అందుతున్న సౌకర్యాలు, విద్యానాణ్యత, మధ్యాహ్న భోజనం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పారిశుధ్యం, భద్రత, విద్యా ప్రమాణాల విషయంలో ఎలాంటి రాజీ లేదని స్పష్టం చేశారు. పాఠశాల నిర్వహణ, ఉపాధ్యాయుల పనితీరు, మౌలిక సదుపాయాలపై సమగ్ర నివేదిక సమర్పించాలని ప్రధానోపాధ్యాయుడిని ఆదేశించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, వరంగల్ తహసిల్దార్ శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుకు నాణ్యమైన విద్యే బలమైన పునాది

- పాఠశాలల్లో మెరుగైన మౌలిక వసతులతో పాటు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యం
- విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణించాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క



**ములుగు ప్రతినిధి, జూన్ 17(జనంసాక్షి) :** బుధవారం ములుగు మున్సిపాలిటీ పరిధిలోని జీవంతరావుపల్లిలో పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో సి.ఆర్.ఆర్ 2025-26 నిధులు రూ.29.50 లక్షలతో పి.ఆర్ రోడ్డు నుండి మోడల్ స్కూల్ వరకు చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు తో కలిసి శంకుస్థాపన చేసి, "ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య -- ప్రతి చేతిలో ఉచిత పాఠ్యపుస్తకాలు" అనే లక్ష్యంతో జీవంతరావుపల్లి పి.ఎం శ్రీ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి అనసూయ సీతక్క మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయుల సూచనలు, సలహాలను పాటిస్తూ క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని అన్నారు. జీవితంలో లోపాలను, కష్టాలను చూసి నిరుత్సాహపడకుండా వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. ప్రభుత్వం విద్యార్థులకు నాణ్యమైన స్కూల్ యూనిఫామ్‌లు, ఉచిత పాఠ్యపుస్తకాలు, అవసరమైన సకల సౌకర్యాలు, మెరుగైన వసతి కల్పిస్తూ విద్యా రంగాన్ని బలోపేతం చేస్తోందన్నారు. ప్రతి విద్యార్థి అందరిలో ఉత్తమంగా నిలవాలనే లక్ష్యంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడలకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలలో చురుకుగా పాల్గొని తమ వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. విద్య అనేది కేవలం పుస్తకాలకే పరిమితం కాకుండా జీవితాన్ని తీర్చిదిద్దే శక్తిగా భావించి సమగ్ర అభివృద్ధి సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, డీఈఓ సిద్ధార్థ్ రెడ్డి, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాలు

- శిక్షణా కేంద్రాలను పరిశీలించిన ఎమ్మెల్సీ పోచంపల్లి మాజీ ఎమ్మెల్యే చల్లా



**నడికూడ జూన్ 17 (జనం సాక్షి) :** నడికూడ మండలం రామకృష్ణాపురం, ధర్మారం, పులిగిల్ల గ్రామాల్లో పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాలను పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి , ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా శిక్షణ కేంద్రాల్లో మహిళలకు కల్పిస్తున్న సౌకర్యాలు, శిక్షణా విధానాలను పరిశీలించి నిర్వాహకులతో మాట్లాడారు. అనంతరం శిక్షణ పొందుతున్న మహిళలతో ముచ్చటించి, కేంద్రాల్లో అందుతున్న శిక్షణపై వారి అభిప్రాయాలు, అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించేందుకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. పోచంపల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాలు గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో కీలక పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. కాకతీయ మెగా వస్త్ర పరిశ్రమలో పరకాల నియోజకవర్గ మహిళలకే మొదటి ప్రాధాన్యత కల్పించడం కోసమే మా ప్రయత్నం అన్నారు.

# రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వం

- తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ
- 24న జిల్లా రైతు మహాసభను విజయవంతం చేయాలి



**స్టేషన్ ఘన్‌పూర్ , జూన్ 17 ( జనం సాక్షి ) :** కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలు అవలంబించడంవలన రైతులు నష్టపోతున్నారని తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ అన్నారు. స్టేషన్ఘన్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని చాగల్ లో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా ముఖ్యకార్యకర్తల సమావేశం రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఆది సాయన్న అధ్యక్షత న జరిగగా, ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాల వల్ల గణ నీయంగా ఎరువులధరలు పెరిగి రైతులకు భూమి నుండి దూరం చేసేకుట్ర మోడీ ప్రభుత్వం చేస్తోంద ని, రైతులు ఏకం కావాలని పిలుపునిచ్చారు. రాబోయే రోజుల్లో రైతుల పరిస్థితి గడ్డుకాలంగా మరే అవకాశం ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీలను ఎత్తేసే కుట్రలు పన్నుతుందని, చిన్న సన్నకారు రైతులకు కన్నీళ్ళు తప్ప మరొకటి లేద న్నారు. ఇప్పటిదాకా వడ్లు కొనుగోలు కేంద్రాల్లో ఉండటం శోచనీయం అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంతరం అలుపెరుగని పోరాటం చేస్తున్న రైతు సంఘం ఈ నెల 22న దేశ వ్యాప్తంగా పెరుగిన ఎరువుల,క్రిమి సంహారక మందుల ధరలపై ఆందో ళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. అదేవిదంగా 24వ తేదీన జాఫర్గాడ్ మండల కేంద్రంలోని ఆర్య వైశ్య ఫంక్షన్ హాలులో జిల్లా 4వ రైతు మహాసభ జరుగుతుందని, ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ , కొల్లూరు రాజయ్య హాజరవుతారని, రైతులుఅధిక సంఖ్యలో వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షు డు కొల్లూరి రాజయ్య, జిల్లా కార్యదర్శి చొప్పరి సోమయ్య, గిరిజన సమైక్య జిల్లా కార్యదర్శి జువారి రమేష్, సీపీఐ మండల కార్యదర్శి తోట రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ యూనిస్, జాఫర్గడ్ మండల అధ్యక్షుడు ఎండీ యాకుబ్ పాషా, కార్యదర్శి పెండ్యాల సమ్మాయ్య, బోనగిరి కుమారస్వామి, బుర్ల యాదగిరి, ముసలయ్య, కలకోట యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# నేడే ఎస్ఐఆర్-2026పై అవగాహనకు 2కె రన్

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి



**హనుమకొండ ప్రతినిధి జూన్ 17 (జనంసాక్షి) :** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఓటర్లలో అవగాహన పెంచేందుకు గురువారం ఉదయం 7:00 గంటలకు 2కె రన్ నిర్వహిస్తున్నట్లు హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఓటర్లలో అవగాహన కోసం చేపట్టే ఈ కార్యక్రమాన్ని హనుమకొండ అదాలత్ సర్కిల్ లోని జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వద్ద నుండి జిల్లా కలెక్టరేట్ వరకు 2కె రన్ సాగుతుందని పేర్కొన్నారు.

# అప్పుడు జీర్ణోద్ధరణ ఇప్పుడు పునరుద్ధరణ



**కాళేశ్వరం, జూన్ 17 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ప్రసిద్ధ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ఆలయ జీర్ణోద్ధరణ 1972లో జగద్గురువు శంకరాచార్యుల ఆధ్వర్యంలో జరిగింది. 1965లో పురావస్తు శాఖ గుర్తించిన నాలుగు శాసనాల ఆధారంగా ఈ పునరుద్ధరణ చేపట్టారు. రెండు లింగాలు ఒకే పీఠంపై ఉండే ఈ అరుదైన త్రిలింగ క్షేత్రాన్ని త్రివేణి సంగమ క్షేత్రంగా అభివృద్ధి చేశారు. 1965లో పురావస్తు శాఖ ఇక్కడ నాలుగు శాసనాలను గుర్తించింది. 2025లో మహా కుంభాభిషేకం స్థానిక మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా జరిపారు. ఇప్పుడు 2026 లో ఆలయాన్ని మరింతగా అభివృద్ధి పరచాలని ఆలోచనతో ప్రస్తుత తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా శంకుస్థాపన, భూమి పూజ నిర్వహించి రాతి కట్టడాలతో గర్భగుడిని, అమ్మవారి ఆలయాన్ని తీర్చిదిద్దనున్నారు. అలాగే ఉప ఆలయాలను కూడా రాతి కట్టడాలతో నిర్మించనున్నారు. దీనికోసం మాస్టర్ ప్లాన్ రూపొందించి శృంగేరి పీఠాధిపతులతో అనుమతులు పొంది బుధవారం ఆదిముక్తేశ్వర స్వామి ఆలయం ఆవరణలోని బాలాలయంలో విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ట చేశారు. స్థానిక మంత్రి చొరవతో కాళేశ్వరం లో సరస్వతి నది పుష్కరాలు అట్టహాసంగా నిర్వహించడంతో ఈ క్షేత్రం జాతీయ దృష్టిని ఆకర్షించింది.

# విత్తన వ్యాపారులపై పోలీసుల ఉక్కుపాదం

- నకిలీ పత్తి విత్తనాల విక్రేతపై పీడీ చట్టం అమలు



**తాండూర్,జూన్ 17,(జనం సాక్షి) :** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జిల్లా తాండూర్,భీమారం పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు నకిలీ పత్తి విత్తనాలను సరఫరా చేస్తున్న విక్రేతపై బుధవారం పీడీ చట్టాన్ని అమలు చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా గిద్దలూరు గ్రామానికి చెందిన వూస సుబ్బారావు రామగుండం కమిషనరేట్ పరిధిలోని తాండూర్, భీమిని,భీమారం, బెల్లంపల్లి-2 టౌన్, తాళ్లగురిజాల, నెన్నెల,చెన్నూర్ మండలాల్లో ఏజెంట్లను నియమించుకుని నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఏడాదిలో వూస సుబ్బారావుపై రెండు కేసులు నమోదైనట్లు తెలిపారు. సులభంగా డబ్బు సంపాదించేందుకు అక్రమ మార్గాలను అనుసరిస్తున్నట్లు వెల్లడించారు. తాండూర్ సీఐ దేవయ్య,ఎస్ఐ ప్రసాద్ నిందితుడికి పీడీ ఉత్తర్వులను అందజేసి చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు. సీపీ మాట్లాడుతూ,వూస సుబ్బారావు 2021 నుంచి 2025 వరకు గత ఐదు సంవత్సరాలుగా నకిలీ పత్తి విత్తనాల రవాణా,నిల్వ, విక్రయాలకు సంబంధించిన అనేక క్రిమినల్ కేసుల్లో పాలు పంచుకున్నాడని తెలిపారు. నిందితునిపై 10-06-2021న పీడీ చట్టం అమలు చేయగా, దానిని ప్రభుత్వం ధృవీకరించిందని పేర్కొన్నారు. పీడీ చట్టం అమలైన తర్వాత కూడా తన వైఖరిని మార్చుకోకుండా అదే తరహా నేరాలకు పాల్పడుతూ రామగుండం పోలీస్ కమిషనరేట్, మంచిర్యాల జిల్లా, కొమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా పరిధిలో మొత్తం తొమ్మిది కేసుల్లో నిందితుడిగా ఉన్నాడని తెలిపారు. రామగుండం పోలీస్ కమిషనరేట్, కొమురంభీం-ఆసిఫాబాద్ జిల్లా పరిధిలోని అమాయక రైతులను నకిలీ పత్తి విత్తనాలను అసలు విత్తనాలుగా నమ్మించి మోసం చేస్తున్నాడని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి నకిలీ విత్తనాలను తీసుకువచ్చి రైతులను మోసం చేస్తున్నాడని తెలిపారు. ఏడాది వ్యవధిలో రెండుసార్లు పట్టుబడినట్లు వివరించారు. నకిలీ విత్తనాల అక్రమ వ్యాపారం చేస్తూ చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు తమ ప్రవర్తనను మార్చుకోకుండా కొనసాగితే ఎంతటి వారినైనా ఉపేక్షించబోమని, వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే పీడీ చట్టాన్ని అమలు చేస్తామని హెచ్చరించారు.

# చికెన్ కొనడానికి వెళ్లి విషాదాంతం..

- ఫిట్స్ రావడంతో వ్యక్తి మృతి



**నెరడిగొండ జూన్ 17 (జనంసాక్షి) :** మండల కేంద్రంలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. మండలంలోని లఖంపూర్ జి గ్రామానికి చెందిన ఆత్రం లక్ష్మన్(38) అను ఇతను బుధవారం రోజున మధ్యాహ్నం ఇంట్లో వారికి చికెన్ తీసుకుని వస్తానని చెప్పి నెరడిగొండ మండల కేంద్రానికి వెళ్లాడు. అనంతరం చికెన్ సెంటర్ వద్దకు చేరుకున్న సమయంలో అకస్మాత్తుగా ఫిట్స్ (మూర్ఛ) రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అక్కడ ఉన్న స్థానికులు సర్పంచ్ సెడమకి గంగాధర్ వెంటనే అతనిని గమనించి కుటుంబ సభ్యులకు,పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. అప్పటికే వ్యక్తి మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ ఇమ్రాన్ తెలిపారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన అనంతరం మరణానికి గల ఖచ్చితమైన కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.

# ఎరువుల డీలర్లు రైతులకు నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు

- ట్రాస్క్ పోర్స్ బృందం ఫెర్టిలైజర్ ఎరువులవిత్తన షాపులను ఆకస్మిక తనిఖీ



**మహదేవపూర్, జూన్ 17 (జనం సాక్షి) :** ఫెర్టిలైజర్ ఎరువుల విత్తనాల షాపులను మండల స్థాయి టాస్క్ ఫోర్స్ బృందం మహదేవపూర్ మండల పరిధిలోని విత్తనాలు ఎరువులు, పురుగు మందుల షాపులను పరిశీలించి తనిఖీ నిర్వహించారు. మండల కేంద్రంలో ఉన్న పురుగు మందులు ఎరువుల షాపులను తనికి నిర్వహించి రైతులకు నకిలీ విత్తనాలు అమ్ముతే చర్యలు తప్పవని నాణ్యమైన విత్తనాలు అందించాలని అన్నారు. వర్షాకాలం సీజన్ దృష్టిలో ఉంచుకొని రైతులకు నాణ్యమైన విత్తనాలు అందించాలని ఎరువు దుకాణాల షాపుల యజమానులకు సూచించారు. అలాగే డీలర్ షాపుల యజమానులు నకిలీ విత్తనాలను రైతులకు అమ్మ వద్దని అధిక ధరలకు అమ్మినచో చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా పత్తి విత్తనాల లభ్యత ఎరువుల నిల్వలు, గ్లైపోసెట్, పారాక్వాట్, గడ్డి మందుల నిల్వలు లైసెన్సుల వివరాలు కొనుగోలు రసీదులు, అమ్మకపు బిల్లులు, స్టాక్ రిజిస్టర్, స్టాక్ పట్టికలు, ధరల పట్టికలను పరిశీలించారు. విత్తనాలు ఎరువులు పురుగుమందుల డీలర్లు ప్రభుత్వ నిబంధనాలకు అనుగుణముగా విక్రయాలు నిర్వహించాలని నిబంధనలు ఉల్లంఘించినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలర్లకు తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని స్టాక్ రిజిస్టర్ బిల్లు బుక్ పై వ్యవసాయ అధికారుల ధ్రువీకరణ ఉండాలని బ్లాక్ మార్కెటింగ్ లేదా అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుంది. లైసెన్సులో పేర్కొన్న గోడాల్లో మాత్రమే సరుకులను నిల్వ చేయాలని సరుకులను ప్యాకెట్ల రూపంలో మాత్రమే విక్రయించాలి లూజ్ అమ్మకాలు చేయరాదు. చట్టంలో పేర్కొన్న విధముగా రికార్డులు, రిజిస్టర్లు, బిల్లులను నిర్వహించాలని స్టాక్ రిజిస్టర్ బిల్లు బుక్కులపై వ్యవసాయ అధికారుల ధ్రువీకరణ ఉండాలని రైతులకు సరుకుల కొనుగోలుపై తప్పనిసరిగా బిల్లులు లేదా రసీదులు ఇవ్వాలని బిల్లు పై డీలర్ లైసెన్స్ నెంబర్ తప్పనిసరిగా ఉండాలని డీలర్లకు సూచించారు. తనిఖీ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిని శ్రీజ. ఎస్సై సాంబమూర్తి. డిప్యూటీ తాసిల్దార్. ఏఈఓ ధర్మేందర్ ఉన్నారు.

# నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడమే ఏకైక లక్ష్యం

- స్టేషన్ ఘన్పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
- పేదల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి సంక్షేమ పథకాలే నిదర్శనం
- 15 ఏళ్ళు ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి ఎం ఒరగబెట్టాడు
- కడియం శ్రీహరి అంటే అభివృద్ధి అని చెప్పుకునేలా పని చేస్తా



**స్టేషన్ ఘన్‌పూర్ , జూన్ 17 ( జనం సాక్షి ) :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని ప్రతీ గ్రామా న్ని రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేయాల నే ఏకైక లక్ష్యంతో ముందుకు వెళు తున్నానని మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. స్టేషన్ ఘనపూర్ మండలంలోని రంగరాయ గూడెం, ఇప్పగూడెం గ్రామాలలో పలు అభివృద్ధిపనుల ప్రారంభోత్సవా నికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్బంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి రంగరాయగూడెంగ్రామంలో గ్రామ సర్పంచ్ జూలుకుంట్ల శిరీష్ రెడ్డి అధ్యక్షతన 33.48 లక్షల తో నిర్మించనున్న సిసి రోడ్లు, మహిళా భవనం, ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి శంకుస్థాపన, ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభో త్సవంతో పాటు 8మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరుపత్రాలను పంపిణి చేశారు. ఇప్పగూడెం గ్రామంలో సర్పంచ్ మందపురం రాణి అనిల్ గౌడ్ అధ్యక్షతన కోటి 10లక్షలతో నిర్మించిన సిసి రోడ్ల ప్రారంభోత్సవం, కోటి 23లక్షల కుడా నిధులతో నిర్మించనున్న సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన, ఇందిరమ్మ ఇండ్ల ప్రారంభోత్సవంతో పాటు 40 మంది ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను కడియం శ్రీహరి పంపిణి చేశారు. ఈ సందర్బంగా ఏర్పాటు చేసిన సమావేశాలలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేనటు వంటి ప్రజా సంక్షేమ పథకాలను అమలు చేస్తూ పేద ప్రజల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న చిత్త శుద్ధిని చాటుకుంటుందని తెలిపారు. గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను చుస్తే చాలా సంతోషంగా ఉందని ఆనందం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో గత15ఏళ్ళు ఎమ్మెల్యేగా ఉన్న వ్యక్తి ఎం ఒరంగబెట్టారో మీ అందరికీ తెలుసని అన్నారు. పని చేయని వారు, పైసకు కోరగాని వారే ఎక్కువగా మాట్లాడుతారని విమర్శించారు. తాగి, తిని తిరిగే వారు ఎవరో, నిజాయితీగా పని చేసే వారు ఎవరో ప్రజలు గమనించాలని కోరారు. గ్రామ అభివృద్ధికి గ్రామ ప్రజల సహకారంతో అభివృద్ధిపనులు చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పగూడెం గ్రామానికి మొదటి విడత లో 54ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసినట్లు, ఇప్పుడు మళ్ళీ 49మందికి మంజూరు పత్రాలను పంపిణి చేస్తున్నట్లు వెల్లడించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన ఈ రెండున్నర ఏళ్ల కాలంలో 4కోట్ల 70 లక్షలతో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం,కోటి10 లక్షల తో సిసి రోడ్లు,కోటి 23లక్షల కుడా నిధులతో మరో సిసి రోడ్డు నిర్మాణం మొత్తం దాదాపు 7కోట్ల అభి వృద్ధి పనులను ఒక్క ఇప్పగూడెం గ్రామంలోనే చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్ పర్సన్ జూలుకుంట్ల లావణ్య శిరీష్ రెడ్డి, రంగరాయ గూడెం సర్పంచ్ జూలుకుంట్ల శిరీష్ రెడ్డి, ఇప్పగూడెం సర్పంచ్ మందపురం రాణి అనిల్ గౌడ్ , ఎంపీడీవో విజయశ్రీ, డిప్యూటీ తాహసిల్దార్ సంధ్యారాణి, పంచాయతీ రాజ్, హౌసింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం సబ్సిడీపై అందించే విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

• ఎమ్మెల్యే బత్తుల



**మిర్యాలగూడ, జూన్ 17 (జనంసాక్షి) :** ప్రభుత్వం సబ్సిడీ పై అందించే విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకువాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం నాడు మిర్యాలగూడ ప్రాథమిక సహకార సంఘం నందు సబ్సిడీ పై జీలుగా, జనుము విత్తనాల పంపిణి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం మరియు వ్యవసాయ రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు . భూమి సారాన్ని పెంపొందించేందుకు, సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు జీలుగులు, జనుములు వంటి పచ్చిరొట్ట పంటల సాగు ఎంతో ఉపయోగకరమని అన్నారు. రైతులు వీటి వినియోగం ద్వారా నేలలో పోషకాలు పెంచుకొని పంట దిగుబడులను మెరుగుపరుచుకోవచ్చని సూచించారు.రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలను పాటించి శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేసి అధిక లాభాలు పొందాలని కోరారు. రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి అభివృద్ధికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు, డైరెక్టర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బ్యాండ్ కళాకారుల కు శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయాలి

**ముషీరాబాద్, జూన్ 17 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం బ్యాండ్ వాయిద్య కళాకారుల అభివృద్ధి కోసం ప్రతి జిల్లాలో శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేసి, వారి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని తెలంగాణ బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గుమ్మడి రాజు నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం బాగ్‌లింగంపల్లి లోని తొందరగా విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బ్యాండ్ వాయిద్య కళాకారుల శిక్షణ తరగతుల ముగింపు సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూన్ 16, 17 తేదీల్లో నిర్వహించిన శిక్షణ తరగతులు, ర్యాలీ, సదస్సు బ్యాండ్ కళాకారుల్లో నూతన ఉత్సాహాన్ని నింపాయని అన్నారు. కార్యక్రమం విజయవంతానికి కృషి చేసిన బ్యాండ్ మాస్టర్లు, కళాకారులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. బ్యాండ్ కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం గుర్తించి పరిష్కరించాలని, ఫ్యాడ్ బ్యాండ్‌లు, సౌండ్ పొల్యూషన్ అంశాలపై కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. పోలీసుల వేధింపులను అరికట్టడంతో పాటు కళాకారుల సంక్షేమం కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు చేసి, గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాల వరకు ఉన్న ప్రతి బ్యాండ్ గ్రూపును ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశానికి ఎండి చాంద్ పాషా అధ్యక్షత వహించగా, అశ్వాల హనుమంతు, రాచర్ల శేఖర్, వేముల శ్రీనివాస్, నాగేష్ రాజు, పొన్నగంటి మొగిలి, డి. భిక్షపతి, ఎస్కే రసూల్, వై. ప్రవీణ్, అనిల్, దేవేందర్, మురళి, వెంకన్న, దబ్బా శ్రీను, రాజు, ఏ. శంకర్, రమేష్, నర్సింహా, వెంకటేష్, హుస్సేన్, సాయి, విశాల్ తదితరులు పాల్గొన్నారు.

## టిజి ఐ-పాస్ కమిటీ సమావేశాన్ని నిర్వహించిన జిల్లా కలెక్టర్



**ఖమ్మం కార్పొరేషన్, జూన్ 17 (జనం సాక్షి) :** జిల్లాలో పరిశ్రమలు స్థాపించి యువతకు ఉపాధి కల్పించేందుకు టిజి-ఐపాస్ క్రింద వచ్చిన దరఖాస్తులను నిర్దేశిత సమయంలో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ అధికారులతో టిజి-ఐ-పాస్ కమిటీ సమావేశం నిర్వహించి పరిశ్రమల స్థాపన, టిజి ఐపాస్ అనుమతులు, టి - ప్రైడ్ పై పథకం అమలుపై అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ,లి జిల్లాలో టీజి ఐపాస్ విధానం అమలవుతున్న తీరును ఆరా తీశారు. జిల్లాలో పరిశ్రమల అనుమతుల దరఖాస్తులను సకాలంలో జారీ చేయాలని కలెక్టర్ అధికారులకు స్పష్టం చేశారు. జిల్లాలో నూతన పరిశ్రమల స్థాపనకు సంబంధించి వివిధ శాఖల అనుమతులకు వేచియున్న ప్రతిపాదనల సమస్యలపై సమీక్షించారు. పెండింగ్ లో ఉన్న ప్రతిపాదనలు సైతం తక్షణమే సమీక్షించి నిర్ణయం తీసుకోవాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో టీ - ప్రైడ్ పథకం క్రింద నూతనంగా ఏర్పాటు చేసిన 12 ఎస్సీ, 13ఎస్టీ యూనిట్లకు ఒక కోటి 35 లక్షల 31 వేల 146 రూపాయల పెట్టుబడి సబ్సిడీని మంజూరు చేయడం జరిగిందన్నారు. పావలా వడ్డీ క్రింద ఒక ఎస్టీ యూనిట్ కు 46 వేల 374 రూపాయల సబ్సిడీ అందించామన్నారు. పరిశ్రమల శాఖ సంక్షేమ శాఖల సమన్వయంతో పథకాలు అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జి.ఎం. పరిశ్రమల శాఖ ప్రవీణ్ కుమార్ , లీడ్ బ్యాంకు మేనేజర్ రవి ప్రసాద్, ఆర్టీవో శ్రీనివాస రావు, ఇడి ఎస్సి కార్పొరేషన్ ముజాహిద్, డిడి గిరిజన శాఖ విజయలక్ష్మి, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాస చారి, జిల్లా ఉపాధికల్పన అధికారిణి మాధవి, పరిశ్రమల శాఖ ఏడి నకుల్ రెడ్డి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ఓటర్ జాబితా సవరణకు రాజకీయ నాయకులు సహకరించాలి

• జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్




**సూర్యాపేట ప్రతినిధి, జూన్ 17 (జనంసాక్షి) :** రాజకీయ పార్టీల ప్రతినిధులు క్షేత్రస్థాయిలో బీఎల్ఓలతో సమన్వయం చేసుకుంటూ ఓటర్ల జాబితా ప్రక్షాళన విజయవంతం అయ్యేలా సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు.బుధవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ పారదర్శకంగా నిర్వహించేందుకు అధికారులకు రాజకీయ నాయకులు సహకరించాలని కోరారు.జూన్ 18న బూత్ లెవెల్ అధికారులు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి అధికారులకు క్షేత్రస్థాయి సన్నాహక శిక్షణ ఇస్తారని వివరించారు.జూన్ 25 నుంచి జులై 24 వరకు బీఎల్ఓలు ప్రతి ఇంటికీ తిరిగి ఎన్యుమరేషన్ ఫారాలను పంపిణీ చేసి వివరాలను సేకరిస్తారని తెలిపారు.2002 ఓటర్ల జాబితా ఆధారంగా కుటుంబ సభ్యుల వివరాలను ఇందులో నమోదు చేయాల్సి ఉంటుందని తెలిపారు.జూలై 24 నుంచి 30వరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1200 మంది ఓటర్లు ఉండేలా పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియ చేపడతారన్నారు. ఓటర్ల ముసాయిదా జులై 31న జాబితా ప్రచురించి, అభ్యంతరాల స్వీకరణ అనంతరం అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేస్తారని అన్నారు.ఎవరైనా తప్పు సమాచారం ఇస్తే నేరుగా పేరు తొలగించకుండా, ముసాయిదా జాబితా తర్వాత నోటీసు ఇచ్చి, విచారణ జరిపి చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు.వలస వెళ్లిన వారు, మరణించిన వారు, డూప్లికేట్ ఓటర్లను గుర్తించి జాబితా నుండి తొలగించడం జరుగుతుందని స్పష్టం చేశారు. ప్రజాప్రాతినిధ్య చట్టం, 1950 లోని సెక్షన్ 31 ప్రకారం ఓటర్ల జాబితాలో పేరు నమోదు కోసం ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం లేదా తప్పుడు డిక్లరేషన్ ఇస్తే ఒక సంవత్సరం జైలు శిక్ష, జరిమానా లేదా రెండు విధించే అవకాశం ఉందని తెలిపారు.ప్రస్తుత జాబితాలో పేరు లేని కొత్త ఓటర్లు తప్పనిసరిగా ఫామ్-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.ఓటర్ల జాబితా ప్రచురణ తేదీ 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని వెల్లడించారు.ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి మారిన వారు ఫామ్-8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, జిల్లా రెవిన్యూ అధికారి డి.ప్రేమ్ రాజ్, వివిధ పార్టీల నాయకులు చకిలం రాజేశ్వరరావు, కరుణాకర్ రెడ్డి, సత్యనారాయణ,ఎండీ.అబిద్,కోట గోపి, స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



**యాదాద్రి కరస్పాండెంట్, జూన్ 17 (జనం సాక్షి) :** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. బుధవారం భువనగిరి పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలో ఆబా రిజిస్ట్రేషన్ చేసే విధానాన్ని స్వయంగా పరిశీలించి సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. మన యాదాద్రి భువనగిరి జిల్లా మోడల్ జిల్లాగా ఎంపిక చేసినందుకు ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ లో భాగముగా ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఎకౌంటులో నమోదు సంఖ్య పెంచమని ఆదేశించడం జరిగింది. ఆసుపత్రిలో శానిటేషన్, బ్లడ్ బ్యాంకు , నవజాత శిశువు ప్రత్యేక సంరక్షణ లో అందిస్తున్న సేవలగురించి, బాలింత తల్లులకు మరియు పిల్లలకు అందుతున్న సేవలు, ల్యాబ్ లో అందిస్తున్న పరీక్షల వివరాలు, టీ హబ్ లో అందుతున్న సేవల వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో పనిచేయుచున్న ఉద్యోగుల మరియు ఇంకా ల్యాబ్ టెక్నీషియన్స్ భర్తీచేయుటకు అవకాశాలు గురించి తెలుసుకున్నారు. ఆసుపత్రి అభివృద్ధి సంఘం సమావేశం నిర్వహించుటకు తేదీని నిర్ణయించుమని ఆదేశాలు ఇవ్వడమైనది. ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది సమయానికి వస్తున్నారా అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందించాలన్నారు. ప్రతి రోజు ఇన్ పేషెంట్, ఔట్ పేషంట్ ఎంతమంది పేషంట్లు వస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఉన్న వార్డులను పరిశీలించి వార్డులో చికిత్స పొందుతున్న పేషెంట్లను వారికి అందుతున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెల ఎన్ని డెలివరీలు జరుగుతున్నాయని అడిగి తెలుసుకొని ప్రభుత్వ ఆసుపత్రిలో సాధారణ ప్రసవాల సంఖ్య పెరిగేలా సిబ్బంది కృషి చేయాలన్నారు. ఆసుపత్రిలో మందుల కొరత లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ అరుణకుమారి, డాక్టర్ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి



**పుల్కల్, జూన్ 17 (జనం సాక్షి) :** ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సంగారెడ్డి జిల్లా డిఎంహెచ్ఓ లలితా దేవి అన్నారు.బుధవారం మండల కేంద్రంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డి ఎం హెచ్ ఓ ఆకస్మిక తనిఖీ చేశారు.అలాగే పక్కనే నూతనంగా నిర్మించిన పి హెచ్ సి భవనాన్ని పరిశీలించారు. మౌలిక వసతుల సదుపాయాలు విద్యుత్, త్రాగునీరు, పారిశుధ్య నిర్వహణపై సంబంధిత అధికారులతో మాట్లాడి మరింత మెరుగుపరిచాలని సూచించారు. వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సూచనల మేరకు రోగులకు మరింత మెరుగైన చికిత్స అందించడం కోసం తొందర్లోనే నూతన ప్రాథమిక ఆరోగ్య కేంద్ర భవనాన్ని ప్రారంభిస్తామన్నారు.ఆసుపత్రిలో రోగుల రికార్డు, ఔషధ నిల్వలు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు.రోగులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత వైద్యాధికారిపై ఉందని డాక్టర్ శ్వేతకు సూచించారు.అనంతరం గొంగులూరు ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించి బాలింతలు, గర్భిణీలు, శిశువులకు వేస్తున్న టీకాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో డి ఎం హెచ్ ఓ వెంట వైద్యాధికారులు, సూపర్వైజర్లు ఏఎన్ఎం లు ఉన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలి



**నర్సాపూర్, జూన్ 17 (జనం సాక్షి) :** ప్రాథమిక పాఠశాలల అంగన్వాడీలు మరింత బలోపేతం కావాలని, అంగన్వాడీలు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థులు నమోదు శాతాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం నర్సాపూర్ మండలం రెడ్డిపల్లి గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని ,ప్రాథమిక పాఠశాలలను డిఆర్డిఓ, డీఈవో ,డిడబ్ల్యూఓ, గ్రామ సర్పంచ్ తో కలిసి సందర్శించారు.జిల్లా కలెక్టర్ అంగన్వాడి కేంద్రంలోనీ చిన్నారులతో ముచ్చటించారు. ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా అంగన్వాడీలు ప్రాథమిక పాఠశాలలు మరింత బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు అంగన్వాడిలలో, ప్రీ స్కూల్స్ లో,ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు, త్రాగునీరు, టాయిలెట్స్,విద్యుత్ లతోపాటు అన్ని సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు అసౌకర్యాలు లేకుండా చూడాలన్నారు. అంగన్వాడీలలో, ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో నమోదు శాతాన్ని పెంచాలని, తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలల వైపు మొగ్గు చూపకుండా ,ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దాలన్నారు. అంగన్వాడి టీచర్లు , ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సమన్వయంతో విద్యార్థుల వయస్సును బట్టి అంగన్వాడి, ప్రాథమిక పాఠశాలలో నమోదు చేయించాలని అధికారులు ఆదేశించారు. అంతకుముందు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కలెక్టర్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి రాజు, జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి,ఏ ఎం ఓ సుదర్శన్ మూర్తి , ఎంఈఓ తారా సింగ్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉదండాపూర్ నిర్వాసితులకు న్యాయం చేస్తాం

• ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి

**జడ్చర్ల, జూన్ 17 (జనంసాక్షి) :** ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణం కోసం భూములు కోల్పోయి, నష్ట పోయిన నిర్వాసిత రైతులందరికీ న్యాయం చేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడుతో కలిసి ఏర్పాటు చేసిన నిర్వాసిత రైతుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు పెండింగ్‌లో ఉన్న ప్రతి నిర్వాసిత రైతు సమస్యను మానవతా దృక్పథంతో పరిశీలించి, అర్హులైన వారందరికీ పరిహారం మరియు పునరావాస ప్యాకేజీలు అందేలా యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కోర్టు కేసులు తదితర సాంకేతిక కారణాల వల్ల కొంతమంది రైతులకు పరిహారం అందలేదని మా దృష్టికి వచ్చింది. వారు ఆందోళన చెందాల్సిన పనిలేదు. ఇప్పటికే 90 నుండి 95 శాతం కుటుంబాలకు ప్యాకేజీలు అందజేశాం. మిగిలిన వారిని కూడా మానవతా దృక్పథంతో ఆదుకుంటాం" అని తెలిపారు. గత ప్రభుత్వం పరిహారం చెల్లింపులో చూపిన అలసత్వాన్ని సరిదిద్ది, పెండింగ్‌లో ఉన్న చెల్లింపులను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. రిజర్వాయర్ పనులను పూర్తి చేసి, రాబోయే ఏడాదిన్నర కాలంలో ప్రాజెక్టులో నీటిని నిల్వ చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసేందుకు రైతులు తమకు సహకరించాలని ఆయన కోరారు. జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు నిర్వాసిత కుటుంబాల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పరిహారం అందజేస్తామని చెప్పారు. ఆర్ అండ్ ఆర్ కమిషనర్ శివకుమార్ నాయుడు మాట్లాడుతూ ఇటీవల సోమశిలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఇచ్చిన ఆదేశాల మేరకు, పెండింగ్‌లో ఉన్న అన్ని కేసులను ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పరిష్కరిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, భూ సేకరణ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ రామ్ రెడ్డి, ఆర్.డి.ఓ నవీన్, సంబంధిత శాఖల అధికారులు మరియు పెద్ద సంఖ్యలో నిర్వాసిత రైతులు పాల్గొన్నారు.



# నల్లగొండలో ఎన్టీఆర్ విగ్రహం దహనం కేసు నిందితుల అరెస్ట్




నల్లగొండ ప్రతినిధి, జూన్ 17 (జనం సాక్షి) : నల్లగొండ పట్టణంలో ఇటీవల సంచలనం సృష్టించిన ఎన్టీఆర్ విగ్రహం దహనం కేసును జిల్లా పోలీసులు విజయవంతంగా ఛేదించారు. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి సామాజిక ఉద్రిక్తతలు సృష్టించాలనే ఉద్దేశంతో ఈ ఘటనకు పాల్పడిన ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ వెల్లడించారు.జూన్ 6వ తేదీ తెల్లవారుజామున నల్లగొండ హైదరాబాద్ రోడ్డులోని ఎన్.జి. కళాశాల సమీపంలో ఉన్న మాజీ ముఖ్యమంత్రి, ప్రముఖ సినీనటుడు ఎన్టీఆర్ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు పెట్రోల్ పోసి తగులబెట్టిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటనపై మున్సిపల్ 48వ వార్డు అధికారి బుజనూరి స్వప్న ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు డీఎస్పీ కె. శివరాం రెడ్డి పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టాయి. సీసీఎస్, టూ టౌన్ పోలీసుల సంయుక్త బృందాలు వందల గంటల సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించి, సాంకేతిక ఆధారాలు, వాహనాల కదలికలను విశ్లేషించి నిందితులను గుర్తించాయి.దర్యాప్తులో భాగంగా ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొట్టాలనే ఉద్దేశంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉన్న ఎన్టీఆర్ విగ్రహాలను లక్ష్యంగా చేసుకుని ధ్వంసం చేయాలని నిందితులు ప్రణాళిక రూపొందించినట్లు పోలీసులు వెల్లడించారు. ఇందులో భాగంగా నల్లగొండలోని విగ్రహాన్ని ఎంపిక చేసుకుని ముందస్తు పరిశీలన అనంతరం దాడికి పాల్పడినట్లు గుర్తించారు.జూన్ 6న ఉదయం 3.45 గంటల సమయంలో పాలకురి అశోక్ కుమార్ గౌడ్‌కు చెందిన బలెనో కారులో నిందితులు నల్లగొండకు చేరుకుని, రెండు పాత బెడ్‌షీట్లను విగ్రహంపై కప్పి, ఒక లీటర్ పెట్రోల్ పోసి నిప్పంటించి అక్కడి నుంచి పరారైనట్లు పోలీసులు తెలిపారు.ఈ కేసులో హైదరాబాద్ చైతన్యపురికి చెందిన ప్రైవేట్ లెక్చరర్ పాలకురి అశోక్ కుమార్ గౌడ్ (45), రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలానికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి ఎలుకంటి ప్రణీత్ (23)లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన బలెనో కారు, రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం, ప్రజా ఆస్తులను ధ్వంసం చేయడం వంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని ఎస్పీ శరత్ చంద్ర పవార్ హెచ్చరించారు. సామాజిక సామరస్యాన్ని దెబ్బతీసే కుట్రలను పోలీసులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని, చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఈ కేసును వేగంగా ఛేదించి నిందితులను అరెస్టు చేసిన డీఎస్పీ కె. శివరాం రెడ్డి, టూ టౌన్ సీఐ ఎస్. రాఘవరావు, సీసీఎస్, టూ టౌన్ పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.

## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం



**చందంపేట, జూన్ 17 (జనం సాక్షి) :** నేరేడుగొమ్ము మండలం, జోడుబావి తండా గ్రామంలో దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ నిర్వహించిన మార్నింగ్ వాక్ విత్ పీపుల్ కార్యక్రమానికి గ్రామ ప్రజలు విశేషంగా స్పందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గ్రామంలోని వీధుల్లో ఆ గ్రామ సర్పంచ్ బానావత్ మంజునాథ్‌తో పర్యటిస్తూ ప్రజలను నేరుగా కలిసి వారి సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని, సంబంధిత అధికారులతో సమన్వయం చేసి వెంటనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకోవడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని ఎమ్మెల్యే తెలిపారు.ప్రజలకు అందుబాటులో ఉండటం, వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడం ద్వారా పాలన మరింత పారదర్శకంగా మరియు ప్రజలకు చేరువగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం జోడుబావి తండా గ్రామంలో రూ.10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య సంఘ భవనాన్ని ఎమ్మెల్యే బాలు నాయక్ గారు రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. దేవరకొండ నియోజకవర్గం మొత్తం 226 గుడిసెలో ఉన్నాయి.. వారందరికీ కూడా ఇందిరమ్మ ఇంట్లో ఇస్తున్నామని అన్నారు. ప్రతి గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించడం, ప్రతి అర్హ కుటుంబానికి ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చూడడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల సభ్యులు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన టెలికాం విభాగం జియో ఇన్ఫోకామ్ తొలి పబ్లిక్ ఇష్యూకు సిద్ధమవుతోంది. మార్కెట్ ప్రతికూలతల వల్ల ఆలస్యమైన ఈ ఐపీఓ.. త్వరలో పట్టాలెక్కనుంది. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీకి ఈ వారమే ముసాయిదా పత్రాలు సమర్పించే అవకాశం ఉందని 'ఫైనాన్షియల్ టైమ్స్' తన కథనంలో పేర్కొంది. ఈనెల 19న నిర్వహించబోయే రిలయన్స్ ఇండస్ట్రీస్ ఏజీఎంకు ముందే డ్రాఫ్ట్ పేపర్లను సమర్పించే అవకాశం ఉందని తెలిపింది. ఈ ఐపీఓ ద్వారా సుమారు 4 బిలియన్ డాలర్లు (సుమారు రూ.36- 40 వేల కోట్లు) మేర మార్కెట్ నుంచి సమీకరించనుంది

# నాలుగో రోజూ హైజంప్

## రాణించిన సూచీలు..



**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు వరుసగా నాలుగోరోజూ రాణించాయి. మెటల్, పీఎస్‌యూ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ స్టాక్స్ సూచీలకు దన్నుగా నిలిచాయి. వడ్డీ రేట్లపై అమెరికా ఫెడరల్ రిజర్వ్ ఈ రాత్రికి నిర్ణం ప్రకటించనున్న వేళ మదుపర్లు అప్రమత్తత పాటించారు. ఈ క్రమంలోనే సెన్సెక్స్ 347.14 పాయింట్ల లాభంతో 77,155.62 వద్ద ముగిసింది. నిఫ్టీ 96.55 పాయింట్ల లాభపడి 24,085.70 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, బీఈఎల్, ఎటర్నల్, టాటా స్టీల్, ఇన్ఫోసిస్ షేర్లు లాభపడ్డాయి. బజాజ్ ఫిన్‌సర్వ్, యాక్సిస్ బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, మారుతీ సుజుకీ షేర్లు నష్టాలు చవిచూశాయి. డాలరుతో రూపాయి మారకం విలువ 94.52గా ఉంది. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 79 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4329 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. టాటా మోటార్స్ పాసింజర్ షేర్లు అమ్మకాల ఒత్తిడి ఎదుర్కొన్నాయి. ఓ దశలో 10 శాతం మేర క్షీణించాయి. చివరికి 8.10 నష్టంతో రూ.361.70 వద్ద ముగిశాయి. టాటా గ్రూపునకు చెందిన లగ్జరీ కార్ల బ్రాండ్ అయిన జాగ్వార్ ల్యాండ్ రోవర్ భవిష్యత్ వృద్ధి అంచనాలు, మేనేజ్‌మెంట్ కామెంటరీ టాటా మోటార్స్ షేర్లపై ప్రభావం చూపాయి. ఐడీబీఐ బ్యాంక్ షేర్లు నేడు దూసుకెళ్లాయి. ఓ దశలో 18శాతం వరకు లాభపడ్డాయి. వ్యూహాత్మక వాటాల విక్రయానికి ప్రభుత్వం సిద్ధమవుతోందని, వచ్చే ఆర్థిక సంవత్సరానికల్లా పెట్టుబడుల ఉపసంహరణ ప్రక్రియ పూర్తవుతుందన్న వార్తల నేపథ్యంలో షేర్లు రాణించాయి. చివరికి 16 శాతం లాభంతో రూ.89.60 వద్ద ముగిసింది. అంతకుముందు అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం ప్రకటన తర్వాత ముడి చమురు ధరలు భారీగా దిగిరావడం, అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల ధోరణికి అనుగుణంగా వరుసగా మూడో రోజైన మంగళవారమూ దేశీయ సూచీలు లాభపడ్డాయి. డాలరుతో పోలిస్తే రూపాయి మారకపు విలువ 2 పైసలు తగ్గి 94.60 వద్ద ముగిసింది. బ్యారెల్ బ్రెంట్ ముడి చమురు ధర 5.19% తగ్గి 78.85 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

# సరైన ఈటీఎఫ్‌తో దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధి దిశ

**సరైన దానిని ఎలా ఎంచుకోవాలి?**

**కోటక్ సెక్యూరిటీస్‌లో ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్, ఈక్విటీ రీసెర్చ్ హెడ్ శ్రీకాంత్ చౌహాన్**



**ముంబై (జనంసాక్షి):** భారతీయ పెట్టుబడిదారులు మార్కెట్ గురించి మరింత అవగాహన పెంచుకుంటున్న కొద్దీ, ఎక్స్ఛేంజ్-ట్రేడెడ్ ఫండ్ (ఈటీఎఫ్) అనే ఒక ఉత్పత్తి క్రమంగా ప్రజాదరణ పొందుతోంది. మ్యూచువల్ ఫండ్‌లు మరియు స్టాక్‌లలోని ఉత్తమ అంశాలను మిళితం చేస్తూ, ఈటీఎఫ్ లు ఒకే సాధనంలో వైవిధ్యం, పారదర్శకత, సౌలభ్యాన్ని అందిస్తాయి. మీరు ఈటీఎఫ్ లకు కొత్తవారైనా లేదా మీ లక్ష్యాలకు సరైన దానిని ఎలా ఎంచుకోవాలో ఆలోచిస్తున్నా, ఈ వ్యాసం మీకు ప్రాథమిక విషయాలను వివరిస్తుంది మరియు మీ ఎంపికలను అర్థం చేసుకోవడానికి ఆచరణాత్మక ఉదాహరణలను అందిస్తుంది.

**ఈటీఎఫ్ అంటే ఏమిటి?**

ఎక్స్ఛేంజ్-ట్రేడెడ్ ఫండ్ (ఈటీఎఫ్) అనేది ఒక రకమైన పెట్టుబడి నిధి. ఇది షేర్ల మాదిరిగానే స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో జాబితా చేయబడి, వర్తకం చేయబడుతుంది. అయితే, వ్యక్తిగత స్టాక్‌ల వలె కాకుండా, ఒక ఈటీఎఫ్ స్టాక్‌లు, బాండ్‌లు, కమోడిటీలు లేదా సూచీలు వంటి సెక్యూరిటీల సముదాయాన్ని కలిగి ఉంటుంది. ఉదాహరణకు, మీరు ఒక నిఫ్టీ 50 ఈటీఎఫ్ ఒక యూనిట్‌ను కొనుగోలు చేస్తే, మీరు తప్పనిసరిగా నిఫ్టీ 50 ఇండెక్స్‌ను రూపొందించే మొత్తం 50 కంపెనీలలో పెట్టుబడి పెడుతున్నట్లే. ఇది కేవలం ఒకే లావాదేవీతో మీకు తక్షణ వైవిధ్యీకరణను అందిస్తుంది.

**ఈటీఎఫ్‌లు ఎలా పనిచేస్తాయి?**

ఈటీఎఫ్‌లు నిష్క్రియాత్మకంగా నిర్వహించబడతాయి, అంటే అవి ఒక నిర్దిష్ట ఇండెక్స్ లేదా అసెట్ క్లాస్‌ను అధిగమించడానికి ప్రయత్నించకుండా, దాని పనితీరును పునరావృతం చేయడమే లక్ష్యంగా పెట్టుకుంటాయి. వీటిలో చురుకైన స్టాక్ ఎంపిక ఉండదు కాబట్టి, వాటి వ్యయ నిష్పత్తులు సాంప్రదాయ మ్యూచువల్ ఫండ్‌ల కంటే తక్కువగా ఉంటాయి. ఈటీఎఫ్‌లు ద్రవత్వాన్ని కూడా కలిగి ఉంటాయి, మార్కెట్ ముగిసిన తర్వాత రోజుకు ఒకసారి ధర నిర్ణయించబడే మ్యూచువల్ ఫండ్‌ల వలె కాకుండా, మార్కెట్ పనివేళల్లో నిజ-సమయ ధరలకు కొనడానికి మరియు అమ్మడానికి మిమ్మల్ని అనుమతిస్తాయి. ఈటీఎఫ్‌లు ఎందుకు ప్రాచుర్యం పొందుతున్నాయి.

**ఎక్కువ మంది పెట్టుబడిదారులు ఈటీఎఫ్‌ల వైపు ఎందుకు మొగ్గు చూపుతున్నారంటే..**

**వైవిధ్యం:** ఒక యూనిట్ బహుళ స్టాక్‌లు లేదా రంగాలలో పెట్టుబడి పెట్టే అవకాశాన్ని ఇస్తుంది? తక్కువ ఖర్చు: తక్కువ వ్యయ నిష్పత్తులు మరియు ఎగ్జిట్ లోడ్ ఉండదు?

పారదర్శకత: పోర్ట్‌ఫోలియో హోల్డింగ్‌లు ప్రతిరోజూ వెల్లడించబడతాయి

సౌలభ్యం: మార్కెట్ పనివేళల్లో ఎప్పుడైనా కొనుగోలు మరియు అమ్మకం చేయవచ్చు

పన్ను ఆదా : సాధారణంగా యాక్టివ్‌గా నిర్వహించబడే ఫండ్‌ల కంటే ఎక్కువ పన్ను ఆదా ఉంటుంది.

**సరైన ఈటీఎఫ్‌ను ఎలా ఎంచుకోవాలి.**

భారతదేశంలో సూచీలు, రంగాలు, కమోడిటీలు, అంతర్జాతీయ మార్కెట్‌లను ట్రాక్ చేసే డజన్ల కొద్దీ ఈటీఎఫ్‌లు అందుబాటులో ఉన్నందున, సరైనదాన్ని ఎంచుకోవడానికి స్పష్టత, పరిశోధన, ప్రణాళికల కలయిక అవసరం.

**పరిగణించవలసిన ముఖ్య అంశాలు :**

మీ పెట్టుబడి లక్ష్యాన్ని నిర్వచించుకోండి మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. నేను ఏమి సాధించాలనుకుంటున్నాను?

దీర్ఘకాలిక సంపద సృష్టి కోసం, నిఫ్టీ 50 ఈటీఎఫ్ లేదా సెన్సెక్స్ ఈటీఎఫ్ వంటి బ్రాడ్-మార్కెట్ ఈటీఎఫ్‌లు అనుకూలంగా ఉండవచ్చు. స్వల్పకాలిక హెడ్జింగ్ లేదా వ్యూహాత్మక పెట్టుబడుల కోసం, బ్యాంక్ నిఫ్టీ ఈటీఎఫ్ లేదా ఐటీ ఈటీఎఫ్ వంటి సెక్టోరల్ ఈటీఎఫ్‌లు మరింత బాగా పనిచేయవచ్చు.

ద్రవ్యోల్బణం నుండి రక్షణ పొందడానికి, గోల్డ్ ఈటీఎఫ్‌లను పరిగణించండి.

ఉదాహరణ: మీ వద్ద 5?7 సంవత్సరాల పాటు పెట్టుబడి పెట్టడానికి రూ.50,000 ఉంటే, నిఫ్టీ 50 ఈటీఎఫ్ తక్కువ ఖర్చుతో మరియు సాపేక్షంగా తక్కువ రిస్క్‌తో లార్జ్-క్యాప్ కంపెనీలలో ఈక్విటీ ఎక్స్‌పోజర్‌ను అందిస్తుంది.

**2. ఈటీఎఫ్ లిక్విడిటీని తనిఖీ చేయండి**

అధిక ట్రేడింగ్ వాల్యూమ్, ధరలలో పెద్ద వ్యత్యాసాలు లేకుండా మీరు ఈటీఎఫ్‌లోకి ప్రవేశించడానికి లేదా నిష్క్రమించడానికి వీలు కల్పిస్తుంది. తక్కువ లిక్విడిటీ ఉన్న ఈటీఎఫ్‌లలో బిడ్-ఆస్క్ స్ప్రెడ్‌లు ఎక్కువగా ఉండవచ్చు, ఇది మీ రాబడులను ప్రభావితం చేస్తుంది.

**ఉదాహరణ:** నిఫ్టీ బీఈఎస్ భారతదేశంలో అత్యధిక రోజువారీ వాల్యూమ్‌లతో అత్యంత లిక్విడ్ ఈటీఎఫ్‌లలో ఒకటి, ఇది మొదటిసారి పెట్టుబడి పెట్టేవారికి ఆదర్శంగా నిలుస్తుంది.

3. ట్రాకింగ్ ఎర్రర్‌ను చూడండి

ఇది ఈటీఎఫ్ దాని బెంచ్‌మార్క్‌ను ఎంత దగ్గరగా అనుకరిస్తుందో కొలుస్తుంది. తక్కువ ట్రాకింగ్ ఎర్రర్ మెరుగైన పనితీరు కచ్చితత్వాన్ని సూచిస్తుంది.

4. వ్యయ నిష్పత్త ఈటీఎఫ్ లు తక్కువ ఖర్చుతో కూడుకున్నవి అయినప్పటికీ, వ్యయ నిష్పత్తులు మారవచ్చు. కాలక్రమేణా, వ్యయంలో ఒక చిన్న వ్యత్యాసం కూడా మొత్తం రాబడులపై ప్రభావం చూపుతుంది, ముఖ్యంగా దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు.

5. అంతర్లీన పోర్ట్‌ఫోలియో ఈటీఎఫ్ దేనిని ట్రాక్ చేస్తుందో అర్థం చేసుకోండి. మీకు బలమైన అభిప్రాయం ఉండి, సంబంధిత నష్టాలను అర్థం చేసుకుంటే తప్ప, థీమాటిక్ లేదా ఎక్సోటిక్ ఈటీఎఫ్ లలో గుడ్డిగా పెట్టుబడి పెట్టడం మానుకోండి.

భారతదేశంలో సాధారణ రకాల ఈటీఎఫ్‌లు :

ఇండెక్స్ ఈటీఎఫ్‌లు

నిఫ్టీ 50, సెన్సెక్స్.. సెక్టోరల్ ఈటీఎఫ్‌లు.. బ్యాంకింగ్, ఐటీ, ఎఫ్ఎంసీజీ. గోల్డ్ ఈటీఎఫ్‌లు. దేశీయ బంగారం ధరలను ట్రాక్ చేస్తాయి. అంతర్జాతీయ ఈటీఎఫ్‌లు నాస్‌డాక్ 100 లేదా ఎస్‌డపి 500 వంటి గ్లోబల్ మార్కెట్లలో పెట్టుబడికి అవకాశం. డెట్ ఈటీఎఫ్‌లు ప్రభుత్వ లేదా కార్పొరేట్ బాండ్లలో పెట్టుబడి పెడతాయి. విభిన్నమైన పెట్టుబడి పోర్ట్‌ఫోలియోను నిర్మించుకోవడానికి ఈటీఎఫ్‌లు ఒక తెలివైన, సరళమైన, తక్కువ ఖర్చుతో కూడిన మార్గాన్ని అందిస్తాయి. వ్యక్తిగత స్టాక్‌లను ఎంచుకునే శ్రమ లేకుండా మార్కెట్ సూచీలలో పెట్టుబడి పెట్టాలనుకునే పెట్టుబడిదారులకు ఇవి చాలా అనువైనవి. అయితే, ఏ ఇతర ఆర్థిక ఉత్పత్తిలాగే, మీ లక్ష్యాలు, రిస్క్ తట్టుకునే సామర్థ్యం, పెట్టుబడి కాలపరిమితి ఆధారంగా ఎంచుకోవడం ముఖ్యం. చిన్న మొత్తంతో ప్రారంభించండి, ఎంపికలను జాగ్రత్తగా పోల్చి చూడండి. మీకు పూర్తిగా అర్థం కాని అంశాల వెంట పడకండి. సరైన ఈటీఎఫ్‌తో, మీరు దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధి దిశగా ఒక సులభమైన ఇంకా ప్రభావవంతమైన అడుగు వేయవచ్చు.

**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
హైదరాబాద్

| ₹ 1,45,800 | ₹ 1,59,060 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

**వెండి ధరలు (కేజీ)**
హైదరాబాద్
₹ 2,95,000

# చమురు మంట చల్లారినట్లేనా?

- సాధారణ స్థితికి చేరేందుకు మరికొన్ని నెలల సమయం
- అంత వరకు రష్యా చమురే దిక్కు..
- బ్రెంట్ ముడిచమురు యుద్ధానికి ముందు 65 డాలర్లు.. ఇప్పుడు 79 డాలర్లు
- ఉత్పత్తి పునః ప్రారంభం అంత సులువు కానందునే ..



**న్యూఢిల్లీ:** అమెరికా-ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరనుంది. హర్మూజ్ జలసంధిలో రాకపోకలకూ మార్గం సుగమం అయింది. అయితే చమురు-గ్యాస్ ధరలు ఎప్పటికి తగ్గుతాయనే అంశమే ఇప్పుడు ప్రధాన చర్చనీయాంశంగా మారింది. అంతర్జాతీయంగా బ్యారెల్ బ్రెంట్‌ముడిచమురు ధర 79 డాలర్లకు దిగివచ్చింది. అయితే యుద్ధానికి ముందున్న 65 డాలర్ల సమీపానికి వచ్చేందుకు మరికొన్ని నెలలు పట్టొచ్చన్నది అంచనా. దాడుల్లో దెబ్బతిన్న క్షేత్రాల్లో చమురు ఉత్పత్తి పునః ప్రారంభానికి అధిక సమయం పట్టనుండటం.. ఇప్పటికే హర్మూజ్ జలసంధి దాటేందుకు వేచి ఉన్న 500 నౌకలు కదలాల్సి ఉండటం ఇందుకు కారణం. యుద్ధం కారణంగా నౌక లపై పెరిగిన 'రిస్క్ ప్రీమియం' బాగా తగ్గడం ఊరట కలిగించే అంశం. ముడి చమురు ధరలు తగ్గితే, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు సడలుతాయి. మన ఇంధన దిగుమతి బిల్లు అదుపులోకి వస్తుంది. ప్రస్తుతం నౌకల రవాణాకు ఆటంకాలు తొలగుతున్నాయి మినహా, కొన్ని చమురు క్షేత్రాల్లో ఉత్పత్తి పునఃప్రారంభానికి అధిక సమయం పడుతుంది కనుక, ముడిచమురు ధర యుద్ధం ముందు స్థాయికి దిగివచ్చేందుకు ఆరు నెలల నుంచి ఏడాది సమయం పట్టొచ్చని రేటింగ్ సంస్థ ఇక్రా అంటోంది. పశ్చిమాసియాలో రోజుకు 10-11 మిలియన్ బ్యారెళ్ల చమురు ఉత్పత్తి ఆగిపోవడం ఇందుకు కారణం. ఇరాన్ చమురుపై ఆంక్షలు తొలగడం భారత్‌కు మేలే. భౌగోళికంగా మనకు దగ్గరగా ఉండడానికి తోడు, ఆ దేశంతో చరిత్రాత్మ కంగా మనకు సానుకూల రుణ షరతులు కొనసాగు తుండడమూ కలిసివస్తుంది. అయితే పర్షియన్ గల్ఫ్‌లో నౌకా కార్యకలాపాలు పూర్వస్థితికి చేరేందుకు కనీసం రెండు నెలలు పట్టొచ్చు. అప్పటివరకు రష్యా చమురును దిగుమతి చేసుకోవడం తప్పదని ఈక్విరస్ సెక్యూరిటీస్ భావిస్తోంది. దేశీయంగా రిటెయిల్ ధరలను సవరించనందున ఈ ఏడాది మార్చి-మేలో చమురు మార్కెటింగ్ కంపెనీల (ఓఎంసీల)కు రూ.లక్ష కోట్ల నష్టం (అండర్ రికవరీ) వాటిల్లిందని అంచనా. తదుపరి పెట్రో ఉత్పత్తుల రిటెయిల్ ధరలను పెంచడం, ముడి చమురు ధర తగ్గుతుండటం ఓఎంసీలకు కలిసొచ్చే అంశమే. అంతర్జాతీయంగా చమురు నిల్వలు తక్కువగా ఉండడం, సరఫరా అంతరాయాల కారణంగా యుద్ధం ముందు స్థాయి అయిన 65 డాలర్లకు చమురు బ్యారెల్ ధర చేరకపోవచ్చని అంచనా. సమీప కాలంలో 75-80 డాలర్ల శ్రేణిలో ఉండొచ్చని ఈక్విరస్ చెబుతోంది. అధికంగా చమురు దిగుమతి చేసుకుంటూ, అంతర్జాతీయంగా ధరలపై ప్రభావం చూపే దేశాల్లో ఒకటైన చైనా.. ఇరాన్ యుద్ధ సమయంలో తన వ్యూహాత్మక నిల్వలను వాడుకుంది. దిగుమతులను తగ్గించుకోవడం వల్లే ఈ సమయంలో చమురు ధరలు భారీగా పెరగలేదు. ఇపుడు చైనా కొనుగోళ్లకు దిగితే మళ్లీ ముడిచమురు ధర కొంత పెరగక తప్పదు. స్పాట్ ఎల్ఎన్‌జీ (ద్రవరూప సహజవాయువు) ధర కూడా ప్రస్తుత 17-18 డాలర్ల నుంచి యుద్ధానికి ముందు ధర అయిన 10-11 డాలర్లకు వెళ్లకపోవచ్చని అంచనా.

## పేదదేశాలకు ఆర్థిక తోడ్పాటును అందించాలి

ఇరాన్ యుద్ధం కారణంగా ప్రపంచ దేశాలు ఇంధన సంక్షోభంలో చిక్కుకుపోయాయి. దీనిని ఉద్దేశించి మోదీ మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనకబడిన దేశాలను వాటిమానాన వాటిని వదిలేయొద్దని, వాటికి సహకరించేందుకు అంతర్జాతీయ ఆర్థిక సంస్థలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అభివృద్ధి చెందుతోన్న దేశాలు ఈ షాక్‌లను తట్టుకొనేలా వ్యవస్థలు ఉండాలన్నారు. ఆయా దేశాల్లో ఉన్న మానవ వనరులను ప్రపంచ అభివృద్ధి భాగం చేసుకోవాలని సూచించారు. ఈ సదస్సు నేపథ్యంలో ఇంతకుముందు మోదీ మాట్లాడుతూ.. ఇంధనం, ఆహారం, ఆరోగ్యం, సైబర్ సెక్యూరిటీ, ఆర్థిక భద్రత వంటి రంగాలు పెనవేసుకున్న ఈ ప్రపంచంలో.. మానవాళి పురోగతి, శ్రేయస్సు కోసం అంతర్జాతీయ భాగస్వామ్యాలను నిర్మించడం అత్యవసరమని పేర్కొన్న సంగతి తెలిసిందే. ఈ సదస్సుకు ఫ్రాన్స్ ఆతిథ్యం ఇస్తోంది. ఆ దేశ ఆహ్వానం మేరకు మన ప్రధాని అక్కడకు వెళ్లారు. జీ-7లో కెనడా, ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, యూకే, యూఎస్‌ఏ సభ్య దేశాలు. ఐరోపా యూనియన్ కూడా ఈ సదస్సుకు ప్రాతినిధ్యం వహిస్తోంది.





## ప్రపంచంలో అందమైన 7 విమానాశ్రయాల్లో అదానీ నవీ ముంబయి, గువాహటి

దిల్లీ: భారత విమానయాన మౌలిక సదుపాయాల రంగానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ప్రతిష్ఠాత్మక ప్రిక్స్ వెర్సైల్స్ విడుదల చేసిన ప్రపంచంలోనే అత్యంత అందమైన విమానాశ్రయాల జాబితాలో అదానీ గ్రూప్ నిర్వహిస్తున్న నవీ ముంబయి అంతర్జాతీయ విమానాశ్రయం (టెర్మినల్ 1), గువాహటి లోక్‌ప్రియ గోపినాథ్ బార్దోలోయ్ అంతర్జాతీయ విమానాశ్రయం (టెర్మినల్ 2) చోటు దక్కించుకున్నాయి. పారిస్‌లోని యునెస్కో ప్రధాన కార్యాలయంలో ఏటా ఈ అవార్డులను అందిస్తారు. ఆర్కిటెక్చర్, వినూత్నత, సస్టెయినబిలిటీ, సాంస్కృతిక గుర్తింపు, ప్రయాణికుల సేవల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వాటికి ఈ పురస్కారాలు దక్కుతాయి. తామరపువ్వు స్ఫూర్తితో డిజైన్ చేసిన, నిర్మించిన నవీ ముంబయి విమానాశ్రయాన్ని అవార్డు కమిటీ కొనియాడింది. ప్రపంచ ప్రసిద్ధ జహా హాడిద్ ఆర్కిటెక్ట్స్ దీన్ని రూపొందించారు. గువాహటి విమానాశ్రయాన్ని బంబూ ఆర్కిడ్ స్ఫూర్తితో నిర్మించారు. ఈశాన్య భారత్ జీవవైవిధ్యం, సంస్కృతిని ఈ టెర్మినల్ అద్భుతంగా పరిచయం చేస్తుందని ప్రిక్స్ వెర్సైల్స్ తెలిపింది. ప్రముఖ ఆర్కిటెక్ట్ నురు కరీమ్ దీన్ని డిజైన్ చేశారు. ఈ జాబితాలో చోటు దక్కించుకున్న విమానాశ్రయాల్లో గ్వాంగ్‌జౌ (చైనా), ఫ్రాంక్‌ఫర్ట్ (జర్మనీ), కందాల్ స్టూంగ్ (కంబోడియా), పిట్స్‌బర్గ్ (అమెరికా), శాన్ డియాగో (అమెరికా) ఉన్నాయి. ఈ 7 విమానాశ్రయాల నుంచి ఏడాది చివర్లో ఆర్కిటెక్చర్, ఇంటీరియర్, ఎక్స్‌టీరియర్ డిజైన్ విభాగాల్లో మూడింటికి తుది 'ప్రిక్స్ వెర్సైల్స్ గ్లోబల్ టైటిల్స్' అందజేయనున్నారు.

## లాభదాయక వ్యవసాయం వైపు తెలంగాణ అడుగులు

ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలని రైతు కమిషన్ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఆయా పంటలకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మంచి డిమాండ్ ఉండడం వల్ల రైతులకు మేలు జరుగుతుందని అన్నారు. మేలుజాతి వంగడాలు సమృద్ధిగా ఉన్నాయని.. కాబట్టి వీటిని సాగు చేస్తే రైతులకు ఆదాయం గణనీయంగా ఉంటుదని వ్యవసాయ కమిషన్ తెలిపింది. ప్రభుత్వం ఈ వంగడాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి, గ్రామ గ్రామాన రైతులను చైతన్యపరచడానికి ప్రత్యేక అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని కమిషన్ తెలిపింది. రాబోయే సీజన్లలో ఈ రకాలను పెద్ద ఎత్తున ప్రోత్సహించడం ద్వారా అటు రైతులకు అదనపు ఆదాయం, ఇటు మార్కెట్ రంగానికి పూర్తి ప్రయోజనం చేకూరుతుందని, వరి సాగులో తెలంగాణ రాష్ట్రం మరింత లాభదాయకమైన దిశగా అడుగులు వేస్తుందని వ్యవసాయ కమిషన్ సైతం కేబినెట్ సబ్ కమిటీకి నివేదించింది. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా.. కొనుగోళ్ళకు తగ్గిస్తూ మనల్ని ఇబ్బంది పెడుతోందని వ్యవసాయ కమిషన్ తెలిపింది. అంతేకాక బాయిల్డ్ రైస్ ను ఏమాత్రం కొనుగోలు చేయడం లేదని స్పష్టం చేసింది. రాష్ట్ర రైతాంగాన్ని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపింది.

# డిజిటల్ బూచీతో జాగ్రత్త!

## మోసాలు మన దగ్గరే అత్యధికం

## ప్రపంచ సగటు కంటే రెట్టింపు

మనదేశంలో ఆర్థిక సేవలతో పాటు పలు రంగాల డిజిటలీకరణ అత్యంత వేగంగా సాగుతుండగా, డిజిటల్ మోసాల ముప్పు కూడా అదే స్థాయిలో తీవ్రంగా పెరుగుతోందని క్రెడిట్ బ్యూరో సంస్థ ట్రాన్స్‌యూనియన్ వెల్లడించింది. సంస్థ తాజాగా విడుదల చేసిన 'టాప్ ఫ్రాడ్ ట్రెండ్స్' నివేదిక ప్రకారం.. మన దేశంలో జరుగుతున్న మొత్తం డిజిటల్ లావాదేవీల్లో మోసాల రేటు, అంతర్జాతీయ సగటు కంటే దాదాపు రెట్టింపు కంటే ఎక్కువగా నమోదైంది. లాజిస్టిక్స్, టెలికాం, బీమా రంగాల్లో ఈ ముప్పు అధికంగా ఉంది. 2025లో భారత వినియోగదారులు చేసిన మొత్తం డిజిటల్ లావాదేవీల్లో 7.1% మోసపూరితమైనవిగా తేలాయి. అంతర్జాతీయంగా ఈ మోసాల రేటు కేవలం 3.8 శాతమే. గుర్తింపు ధ్రువీకరణ, అథెంటికేషన్ లోపాలను మోసగాళ్లు ఉపయోగించుకుంటున్నారు. రియల్-టైమ్ ఇంటరాక్షన్స్, నిరంతరం లావాదేవీలు జరిగే రంగాలను వీరు లక్ష్యంగా చేసుకుంటున్నారు. మన దేశంలో జరుగుతున్న మొత్తం డిజిటల్ లావాదేవీల్లో మోసపోతున్న మొత్తం అంతర్జాతీయ సగటు కంటే 36% ఎక్కువగా నమోదైంది. లాజిస్టిక్స్, టెలికాం, బీమా రంగాల్లో ఈ ముప్పు అధికంగా ఉంది. సంఖ్యాపరంగా చూసుకుంటే, ప్రపంచ సగటు కంటే దాదాపు రెట్టింపు స్థాయిలో మోసాలు చోటుచేసుకుంటున్నాయి. గత ఏడాది సైబర్ మోసాల వల్ల భారత వినియోగదారులు సగటున 2,265 డాలర్లు (దాదాపు రూ.2.04 లక్షలు) నష్టపోయారు. అంతర్జాతీయంగా ఈ సగటు 1,671 డాలర్లుగా ఉంది. 2025 ఆగస్టు-డిసెంబరు మధ్య తమను మోసగించే ప్రయత్నాలు జరిగాయని 59% మంది తెలిపారు. మోసాలకు గురయ్యామని 13% మంది అన్నారు. అంతర్జాతీయ సగటు 10% కంటే ఇది ఎక్కువే. ప్రపంచవ్యాప్త ధోరణులతో పోలిస్తే మన దేశంలో సైబర్ నేరగాళ్ల వ్యూహం భిన్నంగా ఉంది. సాధారణంగా కొత్త అకౌంట్ సృష్టించే సమయంలో మోసాలు ఎక్కువగా జరుగుతాయి. కానీ భారత్‌లో అకౌంట్ లాగిన్ వద్దే అత్యధికంగా 3.9% మోసపూరిత ప్రయత్నాలు జరుగుతున్నాయి. వినియోగదారుల నుంచి దొంగిలించిన/లీక్ అయిన ఐడీ,



పాస్‌వర్డ్‌లను ఉపయోగించి.. ఇప్పటికే యాక్టివ్‌గా ఉన్న ఖాతాలను తమ ఆధీనంలోకి నేరగాళ్లు తెచ్చుకుంటున్నారు. కొత్త ఖాతాల సృష్టి సమయంలో మోసాలు 3.1%, ఆర్థిక లావాదేవీల సమయంలో 1.2 శాతంగా ఉన్నాయి. సైబర్ ముప్పు ఇంతగా చోటుచేసుకుంటున్న నేపథ్యంలో.. డిజిటల్ వ్యాపారాలు, బ్యాంకులు, సర్వీస్ ప్రొవైడర్లు.. తమ ఆన్‌బోర్డింగ్, లాగిన్ వ్యవస్థల్లో ఐడెంటిటీ వెరిఫికేషన్, టూ ఫ్యాక్టర్ అథెంటికేషన్ వంటి భద్రతా ప్రమాణాలను మరింత పటిష్ఠం చేసుకోవాల్సిన అవసరం ఉందని ట్రాన్స్‌యూనియన్ సూచించింది.

# పేదల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి

- వెల్జాల్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ : ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి
- గోపాలపూర్‌లో అభివృద్ధి పనులు ప్రారంభం
- గునుకుల కొండాపూర్‌లో గృహప్రవేశం



**గన్నేరువరం, జూన్ 17 (జనంసాక్షి):** గన్నేరువరం మండలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా అందించే సాయం నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆపద్బంధువుగా నిలుస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే, టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. బుధవారం గన్నేరువరం మండల కేంద్రంలోని రైతు వేదికలో మండలానికి చెందిన 29 మంది లబ్ధిదారులకు 8,11,500 రూపాయల విలువ చేసే చెక్కులను ఆయన పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ అనారోగ్యం, ప్రమాదాలు, అత్యవసర వైద్య చికిత్సల కారణంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సాయం ఎంతో ఉపయోగపడుతోందన్నారు. ఆర్థికంగా వెనుకబడిన ప్రజలకు వైద్య చికిత్స అందుబాటులో ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేస్తోందని తెలిపారు. ప్రజల కష్టసుఖాల్లో ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వేలాది కుటుంబాలు ఉపశమనం పొందుతున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వైద్య ఖర్చుల భారం కారణంగా ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఈ ఆర్థిక సహాయం పెద్ద ఊరటనిస్తోందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను పొందాలని సూచించారు.

అదే సందర్భంగా గన్నేరువరం మండలం గోపాలపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన కిచెన్ షెడ్‌తో పాటు సీసీ రోడ్డును ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శిలాఫలకాలను ఆవిష్కరించి అభివృద్ధి పనులను ప్రారంభించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా రహదారులు, తాగునీటి సౌకర్యాలు, విద్య, ఆరోగ్య రంగాల అభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వంటగదుల నిర్మాణాలతో మరింత మెరుగైన వాతావరణంలో మధ్యాహ్న భోజన కార్యక్రమం నిర్వహించే వీలు కలుగుతుందన్నారు. అలాగే సీసీ రోడ్డు నిర్మాణం గ్రామ ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందులు తొలగిపోవడంతో పాటు రాకపోకలు సులభతరం అవుతాయని చెప్పారు. అంతకుముందు గన్నేరువరం మండలం గునుకుల కొండాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారు న్యాలపట్ల మనమ్మ - బాలయ్య దంపతుల గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆ దంపతులకు శాలువా కప్పి సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, మండల విద్యాధికారి కె. రామయ్య, జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ డైరెక్టర్ అలువాల కోటి, వివిధ గ్రామాల సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.



# అనుమతులు నిల్.. అడ్మిషన్లు ఫుల్

## అనుమతులు లేకుండానే అడ్మిషన్లు తీసుకుంటున్న వశిష్ఠ కో స్కూల్, శ్రీ చైతన్య టెక్నో స్కూల్

- నిద్రమత్తులో విద్యాశాఖ అధికారులు...?
- విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేస్తున్న ప్రైవేట్ స్కూల్స్
- విద్యాహక్కు చట్టం తుంగలో తొక్కుతున్న స్కూల్స్
- విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రుల ఆందోళన

**మహేశ్వరం,జూన్ 17(జనం సాక్షి):**
మహేశ్వరం నియోజకవర్గంలోని ప్రైవేట్,కార్పోరేట్ స్కూల్స్ రోజురోజుకు పుట్టగొడుగుల వెలుస్తున్నాయి.ప్రైవేట్ స్కూల్స్ ఏర్పాటుకు విద్యాశాఖ నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండానే అడ్మిషన్లను ప్రారంభిస్తున్నారు. మహేశ్వరం గేట్ సమీపంలో శ్రీ చైతన్య టెక్నో స్కూల్,వశిష్ఠ కో స్కూల్ పేరుతో అడ్మిషన్లు తీసుకుంటున్నారు. తుక్కుగూడలోని స్లోక స్కూల్‌కు 8,9,10 తరగతులకు,కందుకూరు మండలం కేంద్రంలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ కు విద్యాశాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేవు.అనుమతులు లేకుండా ప్రైవేట్,కార్పోరేట్ స్కూల్స్ అడ్మిషన్లను ప్రారంభించిన విద్యాశాఖ అధికారులు నిద్రమత్తులో ఉన్నారని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం సూచించిన దుకాణాలలో పుస్తకాలు,యూనిఫామ్ కొనుగోలు చేయాలని తల్లిదండ్రులకు చెబుతున్నారు. వేరే చోట పుస్తకాలను కొనుగోలు చేస్తే సిలబస్ వివిధ రకాలుగా ఉంటుంది.దీంతో విద్యార్థులకు ఉపయోగం ఉండదు అని తల్లిదండ్రులకు చెబుతున్నారు.మహేశ్వరం నియోజకవర్గంలో ఉన్న పలు ప్రైవేట్ స్కూల్స్ విద్యాహక్కు చట్టాన్ని తుంగలో తొక్కుతున్నాయి. ప్రైవేట్ స్కూల్స్ తల్లిదండ్రుల నుంచి విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేసే ప్రైవేట్ స్కూల్స్‌పై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నేతలు,తల్లిదండ్రులు కోరుతున్నారు.

**ప్రైవేట్ స్కూల్స్ పుస్తకాల పేరుతో అడ్డగోలుగా డబ్బులు వసూలు**

ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు పుస్తకాలు,యూనిఫామ్ పేరుతో తల్లిదండ్రుల నుంచి అడ్డగోలుగా డబ్బులను వసూలు చేస్తున్నాయని విద్యార్థి సంఘాల నేతలు,తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.ప్రైవేట్ స్కూల్స్ విద్యను వ్యాపారం చేస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు.

**విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలి**

**టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవిందర్ చౌహాన్**

రాష్ట్ర ప్రభుత్వం 2009 విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి.మహేశ్వరం గేట్ సమీపంలో ఉన్న శ్రీ చైతన్య టెక్నో స్కూల్, వశిష్ఠ కో స్కూల్ పేరుతో అడ్మిషన్లు ప్రారంభించిన స్కూల్స్ కు విద్యాశాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేవు.వేరే బ్రాంచ్ పేరు చెబుతూ అడ్మిషన్లను ప్రారంభించారు.ఫీజు నియంత్రణ చట్టం అమలు కావడం లేదన్నారు.ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యం పుస్తకాలు,దుస్తుల పేరుతో తల్లిదండ్రుల నుంచి విచ్చలవిడిగా డబ్బులు వసూలు చేస్తున్నాయి.మహేశ్వరం నియోజకవర్గంలో అనుమతులు లేని ప్రైవేట్ స్కూల్స్ పై విద్యాశాఖ అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

**విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి**

**ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఢిల్లీ భాను ప్రసాద్**

మహేశ్వరం,కందుకూరు మండలాల్లో అనుమతులు లేని ప్రైవేట్ స్కూల్స్‌పై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి. కందుకూరు మండల కేంద్రంలో ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌కు విద్యాశాఖ నుంచి ఎటువంటి అనుమతులు లేవు. అనుమతులు లేకుండా అడ్మిషన్లు తీసుకుంటున్న ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యంతో విద్యాశాఖ అధికారులు కుమ్మక్కు అయ్యారు. అనుమతులు లేకుండా అడ్మిషన్లు తీసుకుంటున్న ప్రైవేట్ స్కూల్స్ విద్యాశాఖ అధికారులకు కనిపించకపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు కళ్ళు తెరిచి అనుమతులులేని ప్రైవేట్ స్కూల్స్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.

# నిరుద్యోగుల అరెస్టులను ఖండించిన డివైఎఫ్ఐ

- పోలీస్ శాఖలో 20 వేల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలి
- శాంతియుత ఆందోళనలపై పోలీస్ నిర్బంధాలు విరుద్ధం
- ప్రభుత్వం ఉద్యోగాల హామీలు నెరవేర్చాలి
- రాష్ట్రవ్యాప్త ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిక




**ముషీరాబాద్, (జనంసాక్షి):** శాంతియుతంగా ఆందోళనలు నిర్వహిస్తున్న నిరుద్యోగులను అక్రమంగా అరెస్టు చేసి నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్, రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ తెలిపారు. పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న 20 వేల ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు.

ఈ మేరకు బుధవారం నిరుద్యోగులపై పోలీసుల నిర్బంధాలను నిరసిస్తూ సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో మొదటి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చిందని, అయితే ఇప్పటివరకు కేవలం 55 వేల ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేసిందని విమర్శించారు. మిగిలిన 1.45 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

విద్యా ఉద్యోగాల భర్తీకి స్పష్టమైన జాబ్ క్యాలెండర్ ప్రకటించి అమలు చేయాలని, అన్ని ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పోలీస్ శాఖలో సుమారు 20 వేల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఉన్నతాధికారులే పలుమార్లు పేర్కొన్నప్పటికీ, కేవలం 5 వేల పోస్టుల భర్తీ ప్రకటనతో అభ్యర్థుల్లో ఆందోళన నెలకొందన్నారు. విద్యాలయ సుఖ్‌నగర్, అశోక్‌నగర్ ప్రాంతాల్లో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నిరుద్యోగులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లలో నిర్బంధించడం ప్రజాస్వామ్య విరుద్ధమని పేర్కొన్నారు. ప్రభుత్వం అరెస్టులపై చూపుతున్న శ్రద్ధను ఉద్యోగాల భర్తీపై చూపాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే నోటిఫికేషన్లు జారీ చేసి ఉద్యోగాలను భర్తీ చేయాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరుద్యోగుల తరఫున ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని డివైఎఫ్ఐ హెచ్చరించింది. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎండీ జావీద్, గడ్డం వెంకటేష్, కృష్ణా నాయక్, మల్లం మహేష్, నవీన్, జి. కార్తీక్, పి. జగన్, ఎం. కిరణ్, రాష్ట్ర నాయకులు ఎన్. మధు, నరేష్ పటేల్, శివశంకర్, రాఘవేంద్ర, సాగర్, హస్మీ, అరవింద్, అనిల్, శ్రీనివాస్, జంగయ్య, జి. మహేష్, అంజనేయులు, దేవేందర్, రాజయ్య పాల్గొన్నారు.

# గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్ట్

## టాస్క్‌ఫోర్స్ పోలీసుల మెరుపు దాడి



**కరీంనగర్ బ్యూరో జూన్ 17 (జనంసాక్షి) :** కరీంనగర్ నగరంలో గంజాయి విక్రయిస్తూ, సేవిస్తున్న ముఠాను, సీపీ గౌష్ ఆలం ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ పోలీసులు బుధవారం చాకచక్యంగా పట్టుకున్నారు. నగరంలోని త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వావిలాలపల్లి ప్రాంతంలో గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్న నమ్మదగిన సమాచారంతో టాస్క్‌ఫోర్స్ ఏసీపీ నేతృత్వంలోని బృందం ఆకస్మిక దాడులు నిర్వహించిందని ఒక ప్రకటనలో టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. పోలీసుల తనిఖీల్లో గంజాయి విక్రయిస్తున్న ప్రధాన నిందితుడు బెజ్జంకి లోకేష్ (22), తండ్రి శ్రీనివాస్, కరీంనగర్ రూరల్ మండలం లోని గోపాలపూర్ గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి వద్ద నుండి భారీగా నిషేధిత పదార్థాలను, వాహనాలను 22 గంజాయి ప్యాకెట్లు, 4 గంజాయి చాక్లెట్లు, ఒక పల్సర్ ఎన్ఎస్ 200 బైక్ (నెంబర్ టీఎస్ 08 హెచ్‌హి 5509), 6 మొబైల్ ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.


**మరో ముగ్గురు వినియోగదారులు కస్టడీలోకి..**

ప్రధాన నిందితుడు లోకేష్‌తో పాటు ఒకే గదిలో ఉంటున్న మరో ముగ్గురు వ్యక్తులను పోలీసులు విచారణ నిమిత్తం అదుపులోకి తీసుకున్నారు. తాము క్రమం తప్పకుండా గంజాయి సేవిస్తున్నట్లు సదరు యువకులు పోలీసుల విచారణలో అంగీకరించారని, పట్టుబడిన నిందితుడిని, స్వాధీనం చేసుకున్న గంజాయి, బైక్, మొబైల్ ఫోన్లను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం కరీంనగర్ త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు తెలిపారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న గంజాయి వంటి మత్తుపదార్థాల విక్రేతలపై చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా సీపీ హెచ్చరించారు.

# నేల తల్లి ఆరోగ్యం కాపాడుకుందాం

## మేలు రకాల దిగుబడులు సాధిద్దాం!

- రైతులకు జొన్న, కందుల విత్తనాల పంపిణీ
- సమతుల్య పోషక నిర్వహణ, పర్యావరణ, నీటి సంరక్షణపై అవసరం అవగాహన
- ఖేత్ బచావో అభియాన్‌లో భాగంగా సదస్సు



**యాచారం, జూన్ 17 (జనంసాక్షి):** రైతులు వ్యవసాయ రంగంలో మేలు రకాలైన వంగడాలను (విత్తనాలను) ఎంపిక చేసుకోవడంతో పాటు నేల ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన క్షేత్రం శాస్త్రవేత్త డాక్టర్ చంద్రకాంత్ పిలుపునిచ్చారు. బుధవారం యాచారం మండల పరిధిలోని గడ్డమల్లయ్య గూడ గ్రామంలో "ఖేత్ బచావో అభియాన్" (వ్యవసాయాన్ని కాపాడే ప్రచారం)లో భాగంగా రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు జొన్నలు, కందుల విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డా. చంద్రకాంత్, సంజీవరెడ్డి మాట్లాడుతూ రైతులు ప్రధానంగా సమతుల్య పోషక నిర్వహణ కలిగి ఉండాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణతో కూడిన వ్యవసాయం మరియు నీటి సంరక్షణ పద్ధతుల గురించి తెలుసుకోవాలన్నారు. నేల సంరక్షణ, విత్తనాల సాగు, వ్యవసాయంలో వాడే వివిధ రకాల పదార్థాలపై రైతులు అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ అవగాహన సదస్సులో శాస్త్రవేత్తలు రవిశంకర్, డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ సుధీర్, గ్రామ సర్పంచ్ అచ్చున మంగ జంగయ్య, ఉప సర్పంచ్ గౌర లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శి స్వప్న, ఆదర్శ రైతు సురేష్ రెడ్డి మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

# లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసిన పరిగి ఎమ్మెల్యే



**కుల్కచర్ల, జూన్ 17 (జనం సాక్షి):** మండల కేంద్రంలోని రైతు వేదిక దగ్గర నిర్వహించిన పలు గ్రామాలకు చెందిన అర్హులైన 46 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ.1,00,116 చొప్పున మొత్తం రూ.46,07,656 ( నాలుబై ఆరు లక్షల ఏడు వేల ఆరు వందల యాభై ఆరు రూపాయలు) విలువగల కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను పరిగి ఎమ్మెల్యే, టిపిసిసి ట్రైనింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ టీ. రామ్మోహన్ రెడ్డి హాజరై ప్రజాప్రతినిధులు,అధికారులతో కలిసి లబ్ధిదారులకు చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి మాట్లాడుతూ..ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నామని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప తహసిల్దార్ చంద్రశేఖర్, గిర్దవారి రవీంద్ర చారి, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ-ఆర్పీఐ పొత్తు..

## జీహెచ్ఎంసీ మేయర్ పీఠం లక్ష్యం

- ప్రధాని మోదీకి మేయర్ పదవి కానుకగా ఇవ్వాలని తీర్మానం
- రామ్‌దాస్ అథవాలే తెలంగాణ పర్యటన
- త్వరలో ఆర్పీఐ నూతన రాష్ట్ర కమిటీ
- కేంద్ర మంత్రి సమక్షంలో కీలక సమావేశం



**ముషీరాబాద్, జూన్ 17 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు తెరలేచింది. రాబోయే రోజుల్లో హైదరాబాద్‌లో జరగబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ), రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్పీఐ - అథవాలే) కలిసి ఉమ్మడిగా పోటీ చేయాలని ఇరు పార్టీల అగ్రనాయకత్వం కీలక తీర్మానం చేసింది. ఈ మేరకు బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్న ప్రసాద్ అధ్యక్షతన ఇరు పార్టీల ముఖ్య నేతల సమక్షంలో ఉన్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా జాతీయ కార్యదర్శి పేరం శివ నాగేశ్వరరావు హాజరయ్యారు. రాబోయే ఆగస్టు నెలలో కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి రామ్‌దాస్ అథవాలే తెలంగాణలో విస్తృతంగా పర్యటించనున్నారని తెలిపారు. ఈ పర్యటనను పురస్కరించుకుని రాష్ట్రంలో పార్టీ బలోపేతం, ఎన్నికల వ్యూహాలపై చర్చించారు.

ఈ సందర్భంగా పార్టీ జాతీయ నేతలు మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీ-ఆర్పీఐ కూటమి అత్యంత పటిష్టంగా ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. భాగ్యనగర జీహెచ్ఎంసీ మేయర్ పదవిని కైవసం చేసుకుని, ఆ మేయర్ పీఠాన్ని భారత ప్రధాని నరేంద్ర మోదీకి ఒక అద్భుతమైన బహుమానంగా ఇవ్వడానికి తెలంగాణ బీజేపీ, ఆర్పీఐ సిద్ధమయ్యాయన్నారు. త్వరలో ఆర్పీఐ తెలంగాణ నూతన రాష్ట్ర కమిటీని ప్రకటించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో కొంపెల్లి ప్రభుదాస్, పసుల రవి, గోరక్ సింగ్, శ్రావణ్ సచిన్ గౌడ్, హనుమ ప్రసాద్, శివరాజ్, పీటర్ నాయుడు, స్నేహలత, గంగాపురం పద్మ, రోజా తదితరులు పాల్గొన్నారు.

# అనుమతి లేని నారాయణ కళాశాలపై కొరడా..!




- అనుమతుల్లేని బ్రాంచ్‌కు షోకాజ్..!
- జనంసాక్షి కథనాలతో కదిలిన డిఐఈఓ

**ఖమ్మం బ్యూరో, జూన్ 17 (జనంసాక్షి):**
ఖమ్మం నగరంలోని వెలుగుమట్లలో అనుమతులు లేకుండా నిర్వహిస్తున్న నారాయణ జూనియర్ కళాశాల బ్రాంచ్‌పై చర్యలకు రంగం సిద్ధమైంది. ఈ వ్యవహారంపై జనం సాక్షి దినపత్రికలో వరుస కథనాలు వెలువడిన నేపథ్యంలో జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి (డీఐఈఓ) రవిబాబు స్పందించి కళాశాల యాజమాన్యానికి షోకాజ్ నోటీసు జారీ చేసేందుకు సిద్ధమయ్యారు. ఖమ్మం నగరం విద్యాకేంద్రంగా ఎదుగుతున్న తరుణంలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత విద్యాసంస్థలపై ఉంది. అయితే కొన్ని కార్పొరేట్ కళాశాలలు విద్యార్థుల తల్లిదండ్రుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని విద్యను వ్యాపారంగా మార్చుకుంటున్నాయి. వెలుగుమట్లలోని నారాయణ జూనియర్ కళాశాల బ్రాంచ్ ఈ కోవలోకే వస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఐదంతస్తుల భవనంలో ఎలాంటి అధికారిక అనుమతులు లేకుండానే ఈ బ్రాంచ్‌ను ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఐఐటీ, జేఈఈ, నీట్ కోచింగ్ పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తూ కోట్ల రూపాయల వ్యాపారం సాగిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. గత రెండేళ్లుగా ఈ బ్రాంచ్ కార్యకలాపాలు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత శాఖల అధికారులు పట్టించుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అనుమతులు లేకుండా విద్యాసంస్థను నిర్వహించడం ద్వారా ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించడమే కాకుండా, ప్రభుత్వానికి రావాల్సిన పన్నులను కూడా ఎగ్గొడుతున్నారన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశంలో యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఇతర అక్రమ బ్రాంచ్‌లపై కూడా దృష్టి?**

**నారాయణ బ్రాంచ్‌పై చర్యలతో జిల్లాలో అనుమతులు లేకుండా నడుస్తున్న ఇతర కళాశాలలు, విద్యాసంస్థల వ్యవహారాలపై కూడా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉందని విద్యావర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ చర్యతో అక్రమంగా నడుస్తున్న సంస్థలు నిబంధనల మేరకు అనుమతులు పొందే దిశగా అడుగులు వేయాల్సిన పరిస్థితి ఏర్పడే అవకాశం ఉంది.**

**కథనాల ప్రభావం.. కదిలిన అధికారులు**

"అనుమతుల్లేని నారాయణ బ్రాంచ్" అంశంపై జనంసాక్షి పత్రికలో ప్రచురితమైన కథనాల ప్రభావంతో జిల్లా ఇంటర్మీడియట్ శాఖ స్పందిం చింది. గురువారం కళాశాలకు షోకాజ్ నోటీసు జారీ చేసి వివరణ కోరనున్నట్లు డీఐఈఓ రవిబాబు తెలిపారు. ప్రభుత్వ నిబంధ నలను ఉల్లంఘించిన వారెవరైనా చర్యలు తప్పవని హెచ్చరించారు.

# మెడికవర్‌లో అత్యాధునిక మినిమల్లీ ఇన్వాసివ్ గుండె శస్త్రచికిత్స

- మెడికవర్ హాస్పిటల్ కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ రవికుమార్



కరీంనగర్ బ్యూరో, జూన్ 17 (జనంసాక్షి) : మెట్రో నగరాల్లో మాత్రమే అందుబాటులో ఉండే అత్యాధునిక మినిమల్లీ ఇన్వాసివ్ కార్డియోవాస్క్యులర్ సర్జరీని కరీంనగర్ మెడికవర్ ఆసుపత్రి వైద్య బృందం విజయవంతంగా నిర్వహించినట్లు ఆసుపత్రి కార్డియోథొరాసిక్ సర్జన్ డాక్టర్ రవికుమార్ వెల్లడించారు. బుధవారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కొంతకాలంగా ఛాతినొప్పి, తీవ్రమైన ఆయాసం, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్న జగిత్యాలకు చెందిన 54 ఏళ్ల మాధవి చికిత్స కోసం మెడికవర్ ఆసుపత్రికి రాగా, వైద్య పరీక్షల్లో ఆమె గుండెలోని ప్రధాన మైట్రల్ వాల్వ్ మూసుకుపోయినట్లు గుర్తించామన్నారు. సాధారణంగా ఇలాంటి పరిస్థితుల్లో ఓపెన్ హార్ట్ సర్జరీ నిర్వహిస్తారని, అయితే ఆ పద్ధతిలో రోగి కోలుకోవడానికి ఎక్కువ సమయం పడుతుందని వివరించారు. రోగి ఆరోగ్య పరిస్థితిని పరిగణనలోకి తీసుకుని ఛాతి కింది భాగంలో చిన్న గాటు ద్వారా మినిమల్లీ ఇన్వాసివ్ పద్ధతిలో మైట్రల్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ విషయాన్ని రోగి కుటుంబ సభ్యులకు వివరించగా వారు అంగీకరించడంతో శస్త్రచికిత్స విజయవంతంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. మినిమల్లీ ఇన్వాసివ్ కార్డియాక్ సర్జరీ వల్ల నొప్పి, రక్తస్రావం, ఇన్ఫెక్షన్ల ప్రమాదం తగ్గడమే కాకుండా, రోగి వేగంగా కోలకుంటుందని వివరించారు. ప్రస్తుతం మాధవి పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా ఉన్నట్లు తెలిపారు. అత్యాధునిక వైద్యసేవలను సైతం ఆరోగ్యశ్రీ పరిధిలో అందించి, కొత్త జీవితం ప్రసాదించిన మెడికవర్ వైద్య బృందానికి రోగి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఆసుపత్రి సెంటర్ హెడ్ గుర్రం కిరణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ విలేకరుల సమావేశంలో కార్డియాలజిస్టులు డాక్టర్ అనీష్ పబ్బ, డాక్టర్ వాసుదేవరెడ్డి, అనెస్థీషియా డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి, సూపరింటెండెంట్ డాక్టర్ ప్రియాంక, మార్కెటింగ్ మేనేజర్ కోట కర్ణాకర్ పాల్గొన్నారు.

# ఆర్టీసీ బస్సులో ప్రయాణించిన మంత్రులు

- విద్యార్థులు, ప్రయాణికులతో ముచ్చటించిన పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్.. ఆర్టీసీ సేవలపై ఆరా



కరీంనగర్ బ్యూరో, జూన్ 17 (జనంసాక్షి) : రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బుధవారం వాగేశ్వరి ఇంజనీరింగ్ కళాశాల నుంచి కరీంనగర్ ఎన్టీఆర్ విగ్రహం వరకు ఆర్టీసీ బస్సులో ప్రయాణించి విద్యార్థులు, ప్రయాణికులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ... విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా పాఠశాలలు, కళాశాలల సమయాల్లో అదనపు బస్సులు నడుపుతున్నామని తెలిపారు. మహాలక్ష్మి పథకం అమలుతో పెరిగిన ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా కొత్త బస్సులు కొనుగోలు చేసి కొత్త రూట్లలో సేవలు ప్రారంభించినట్లు చెప్పారు. ప్రజాపాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడమే కాకుండా ఆర్టీసీని బలోపేతం చేసే చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. ప్రయాణికులతో మర్యాదగా వ్యవహరించాలని ఆర్టీసీ సిబ్బందికి సూచించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, కార్మిక సంఘాల ఎన్నికలు పూర్తయ్యాక గుర్తింపు సంఘాల ప్రతినిధులతో విలీన ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. పీఆర్సీ అమలు, సంఘాల ఎన్నికల నిర్వహణపై ఆర్టీసీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేసినట్లు చెప్పారు. విద్యార్థుల సంక్షేమం కోసం గురుకుల పాఠశాలల్లో మెస్, కాస్మొటిక్ ఛార్జీలను పెంచడంతో పాటు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్య అందిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ -ప్రైమరీ తరగతులు, బ్రేక్‌ఫాస్ట్ - మిల్క్ పథకాన్ని ప్రారంభించినట్లు వివరించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన మంత్రి, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని ప్రారంభించిందన్నారు. తెలంగాణ ఆర్టీసీ దేశంలోనే నంబర్‌వన్ ప్రజా రవాణా సంస్థగా ఎదుగుతోందని, 10 వేలకుపైగా బస్సులు ప్రజలకు సేవలందిస్తున్నాయని పేర్కొన్నారు. జూన్ 21న జరిగే నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని ఎన్ఎస్‌యూఐ నాయకులు చేసిన విజ్ఞప్తిని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి సానుకూల నిర్ణయం తీసుకునేలా ప్రయత్నిస్తామని మంత్రి తెలిపారు. ప్రజాపాలన ప్రభుత్వం విద్య, వైద్యం, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తోందని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ప్రజా పాలనను విమర్శించే హక్కు హరీష్ రావుకు లేదు

- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థుల సంక్షేమానికి కట్టుబడి
- స్కాంలు చూసి స్కాంలే కనిపించడం విడ్డూరం : మంత్రి జూపల్లి కృష్ణారావు



కరీంనగర్ బ్యూరో, జూన్ 17 (జనంసాక్షి): మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యలు దయ్యాలు వేదాలు వల్లించినట్టుందని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... మాజీ మంత్రి హరీష్ రావుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, మంత్రులను విమర్శించే హక్కు లేదని, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అన్నీ స్కాంలే అని పచ్చ కామెర్ల రోగికి లోకమంతా పచ్చగా కనిపించినట్టు హరీష్ రావుకు అందరూ అలాగే కనిపిస్తున్నారని ఎద్దేవా చేశారు. పది సంవత్సరాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులకు మెస్ చార్జీలు, కాస్మెటిక్ చార్జీలు పెంచాలన్న సోయి లేదని, కష్టపడి పైకి వచ్చిన మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అజహరుద్దీన్ శాఖలలో టెండర్లలో స్కాం జరిగిందని ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందని నరేందర్ రెడ్డి విమర్శించారు. పేద విద్యార్థుల బాధలు తెలిసిన వాళ్లు కాబట్టే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మెస్, కాస్మెటిక్ చార్జీలు 40 శాతం పెంచి అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు.

నిజాయితీకి నిలువుటద్దంగా ఉన్న మంత్రి శ్రీధర్ బాబుపై మాజీ ఎమ్మెల్యే పుట్టమధు అనుచిత వ్యాఖ్యలు చేశారని, పుట్టమధు ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడితే మంచిదని హితవు పలికారు. ఈ విలేఖరుల సమావేశంలో కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైద్యుల అంజన్ కుమార్, ఆకారపు భాస్కర్ రెడ్డి, మడుపు మోహన్, అంజనీ ప్రసాద్, వరాల నర్సింగం, కాంరెడ్డి రాంరెడ్డి, దండి రవీందర్, నెల్లి నరేష్, షెహన్షా, ఎల్లారెడ్డి, హనీఫ్, ఖలీల్, బషీర్ తదితరులు పాల్గొన్నారు.



# స్కూల్ వాహనాలపై రవాణా శాఖ అధికారుల తనిఖీలు

రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి (జనంసాక్షి) : విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ వేములవాడలో బుధవారము రవాణా శాఖ అధికారులు ప్రత్యేక ఫిట్‌నెస్ తనిఖీలు నిర్వహించారు. ఆర్టీఓ ఆధ్వర్యంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ) వంశీధర్ స్వయంగా ప్రైవేట్ స్కూల్ వాహనాలను నడిపి వాటి ఫిట్‌నెస్, భద్రతా ప్రమాణాలను పరిశీలించారు. ఫిట్‌నెస్ లేని వాహనాలను గుర్తించి చర్యలకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా ఎంవిఐ వంశీధర్ మాట్లాడుతూ.. వేములవాడలోని పలు పాఠశాలలకు చెందిన వాహనాలను స్వయంగా నడిపి వాటి బ్రేకులు, స్టీరింగ్,టైర్లు, సీటింగ్ ఏర్పాటు,అత్యవసర భద్రతా సౌకర్యాలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తనిఖీలలో ఫిట్‌నెస్ ప్రమాణాలు పాటించని కొన్ని వాహనాలను గుర్తించి సంబంధిత యాజమాన్యాలకు హెచ్చరికలు జారీ చేశామన్నారు. అలాగే నిర్దేశిత యూనిఫామ్‌లో లేని డ్రైవర్లను మందలించి, భవిష్యత్తులో నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించమన్నారు. విద్యార్థుల ప్రాణాలకు సంబంధించిన అంశంలో ఎలాంటి నిర్లక్ష్యాన్నీ సహించబోమని, ఫిట్‌నెస్ లేని వాహనాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే జరిమానా..

### నగర మేయర్ మహంకాళి స్వామి



గోదావరిఖని, జూన్ 17 (జనంసాక్షి) : బహిరంగ ప్రదేశాలలో చెత్త పడవేస్తే రేపటి నుండి జరిమానా విధిస్తామని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి అన్నారు. వార్డు సందర్శనలో భాగంగా బుధవారం డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), నగర పాలక సంస్థ కమిషనర్ జె. అరుణ శ్రీతో కలిసి 46వ డివిజన్ ఇందిరా నగర్‌లో పర్యటించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్లు , కాలువల్లో చెత్త పడవేసే వారి ఫోటోలు తీసి చెత్త పరిమాణానికి అనుగుణంగా జరిమానా విధించడం జరుగుతుందని అన్నారు. వర్షా కాలంలో వరద ముంచెత్తకుండా ఎంఎల్ఎ ఆదేశాల మేరకు గత మూడు నెలలుగా ప్రదాన కాలువల్లో పూడిక తొలగిస్తున్నామని అన్నారు. ఆర్ఎఫ్‌సిఎల్ నుండి వచ్చేనీటితో వర్షాకాలంలో నీళ్ళు ఇందిరా నగర్ లోని ఇళ్ళల్లోకి వస్తున్న నేపథ్యంలో నివారణా చర్యలు చేపట్టామని అన్నారు. ప్రజలు సహకరించి రోడ్లు ,కాలువలఅబ ఆక్రమించి నిర్మించిన కట్టడాలు స్వచ్చందంగా తొలగించాలని అన్నారు. ప్రతి వీధిలో చివరి ఇంటి వరకు అన్ని మౌళిక వసతులు కల్పించడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్ వచ్చేలా వీదులు విశాలంగా ఉంచాలని ఎంఎల్ఎ జారీ చేసిన ఆదేశాల మేరకు చెట్ల కొమ్మలు, పొదలు తొలగిస్తున్నామని అన్నారు. త్వరలోనే ఇందిరా నగర్‌లో యుజిడి, రోడ్ల నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు నాడుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. కాగా ఈ సందర్భంగా స్థానిక ఉన్న ఒక మద్యశీ దుకాణం ఎదుట రోడ్డు పై నిర్మించిన ఆక్రమణ తొలగించారు. ఖాళీ సీసాలను కాలువలో పడవేసిన సదరు దుకాణ యజమానికి భారీ జరిమానా విధిస్తూ నోటీసు జారీ చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు దాసరి సాంబ మూర్తి, చిదురాల నాగ రాజు, వడ్లూరి రవి, పాటు టిపిఎస్ నవీన్, ఎఇ, మనోజ్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్, సానిటరి ఇన్స్పెక్టర్ సంపత్, మెప్మా సిఓ ఊర్మిళ, టిపిబిఓలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విప్ క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నం

### గ్రామ పంచాయతీ కార్మికుల ఆందోళన



రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి జూన్ 17 (జనంసాక్షి) : రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న గ్రామ పంచాయతీ కార్మికుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం చేయాలని వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కార్యాలయం వద్ద గ్రామ పంచాయతీ కార్మికులు ఆందోళన చేపట్టారు.కార్మిక సంఘం సిఐటియు జిల్లా అధ్యక్షా కార్యదర్శులు ఎగమాంటి ఎల్లారెడ్డి, కోడం రమణలు యూనియన్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు బుర్ర శ్రీనివాస్,అన్నల్ దాస్ గణేష్ లు మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా ప్రతి నెలా రూ 50 కోట్ల బడ్జెట్‌ను విడుదల చేసి వేతనాలు చెల్లించాలని, 2వ పీఆర్సీ వర్తింపజేయాలని,జీవో నెం. 51ని సవరించి మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని,మరణించిన కార్మికుల కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని వారు కోరారు.

ప్రభుత్వం ప్రకటించిన విధంగా రూ 50 కోట్ల బడ్జెట్ ద్వారా గ్రీన్ ఛానల్ ద్వారా వేతనాలు చెల్లించాలని, కార్మికులందరినీ పర్మినెంట్ చేసి, కనీస వేతనం రూ 26,000 నిర్ణయించాలన్నారు.జీవో నెం 51ని సవరించి, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని,కార్మికులను 2వ పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలన్నారు.కార్మికులకు రూ 10 లక్షల ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని,ప్రమాదవశాత్తు మరణించిన వారికి రూ 20 లక్షల నష్టపరిహారం, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులకు కార్పొరేట్ స్థాయిలో ఎలాంటి వైద్య సదుపాయం ఉందో అలాంటి ఉచిత వైద్యం కోసం హెల్త్ కార్డులు అందించాలన్నారు.అంత్యక్రియల కోసం రూ 30 వేలు ఆర్థిక సాయం అందించాలని, కార్మికులందరికీ ఇందిరమ్మ ఇళ్లు లేదా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని తమ డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని క్యాంప్ కార్యాలయంలో ప్రభుత్వ విప్ అందుబాటులో లేకపోవడంతో సిబ్బందికి వినతి పత్రం అందజేశామన్నారు. ఈ కార్యక్రమంలొ యూనియన్ మండల అధ్యక్షులు అక్కల అంజయ్య, లొకిని శ్రీనివాస్, వర్కోలు మల్లయ్య,కంసాని రవీందర్, ఎం.నరేష్, నరపురం నర్సయ్య, బెజగం రాజశేఖర్, ముదిగాం అనిల్ కార్మికులు పాల్గొన్నారు.

# బ్యాంక్ ఆఫ్ బరోడా 'బాబ్ లెజెండ్ డిపాజిట్ స్కీమ్'

### ఎన్నారైలకు సంవత్సరానికి 6.25% వరకు అధిక వడ్డీ రేట్లు




ముంబై, 17 జూన్ (జనంసాక్షి) : భారతదేశపు అంతర్జాతీయ బ్యాంకు అయిన బ్యాంక్ ఆఫ్ బరోడా, 'బాబ్ లెజెండ్ ఎఫ్ సీఎన్ఆర్(బి) డిపాజిట్ పథకం' కింద ప్రవాస భారతీయులకు సంవత్సరానికి 6.25% వరకు అధిక వడ్డీ రేట్లను అందిస్తోంది. కొత్త 'బాబ్ లెజెండ్ ఎఫ్ సీఎన్ఆర్(బి) డిపాజిట్ పథకం' కింద, బ్యాంక్ యూఎస్ డాలర్ డిపాజిట్లపై సంవత్సరానికి 6.25% వరకు, బ్రిటిష్ పౌండ్ స్టెర్లింగ్, ఆస్ట్రేలియన్ డాలర్ డిపాజిట్లపై సంవత్సరానికి 4.75%, కెనడియన్ డాలర్ డిపాజిట్లపై సంవత్సరానికి 5.15%, యూరో డిపాజిట్లపై సంవత్సరానికి 3.75% వడ్డీ రేట్లను అందిస్తోంది. బ్యాంక్ ఆఫ్ బరోడా తన విస్తృత అంతర్జాతీయ కార్యకలాపాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయ ప్రవాసులకు ప్రాధాన్య బ్యాంకింగ్ భాగస్వామిగా కొనసాగుతోంది. అంతేకాకుండా, ఎన్నారైలు ఎఫ్ సీఎన్ఆర్(బి) డిపాజిట్లపై అవాంతరాలు లేని ఓవర్‌డ్రాఫ్ట్/రుణ సౌకర్యాన్ని పొందడం ద్వారా సంపద సృష్టి, ద్రవ్యత అనే ద్వంద్వ ప్రయోజనాలను పొందవచ్చు. ఇది వారికి మెరుగైన ఆర్థిక సౌలభ్యాన్ని అందిస్తూనే, వారి రాబడులను గరిష్ఠ స్థాయికి పెంచుకోవడానికి వీలు కల్పిస్తుంది.



# ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రజా పాలన

### మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్, జూన్17(జనం సాక్షి): ఉమ్మడి వెల్గటూర్ మండలం లో బుధవారం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. కొండాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం పేదల జీవితాల్లో వెలుగులు నింపుతుందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఖాతాలోకి నేరుగా 5 లక్షల రూపాయలు జమచేసి పేద వారి సొంతింటి కలను నెరవేరుస్తున్నామన్నారు. అనంతరం జగదవ్ పేట గ్రామంలో ఇటీవల దగ్ధమైన ఈత వనాన్ని మంత్రి పరిశీలించారు అగ్ని ప్రమాదానికి సంబంధించిన కారణాలను స్థానిక గౌడ సంఘం సభ్యుల ద్వారా తెలుసుకున్నారు. గౌడ కులస్తులకు ప్రభుత్వ పరంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. వెల్గటూర్ మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి పాల్గొని నలుగురికి కళ్యాణ లక్ష్మి చెక్కులు 91 మందికి 31 లక్షల మూడు వేల రూపాయల ముఖ్య మంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తాటి పర్తి శైలేందర్ రెడ్డి, మెరుగు మురళి గౌడ్, గంద్ర శ్రీకాంత్ రావు గుండేటి సందీప్ రెడ్డి పలు గ్రామాల సర్పంచులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# భారీ వర్షాలు, ఈదురుగాలులపై ఎన్పీడీసీఎల్ 'హైపర్' యాక్షన్ ప్లాన్




కరీంనగర్ టౌన్, జూన్ 17 (జనం సాక్షి) : వర్షాకాలంలో భారీ వర్షాలు, ఈదురుగాలుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా ఎన్పీడీసీఎల్ ప్రత్యేక హైపర్ యాక్షన్ ప్లాన్‌ను అమలు చేస్తున్నట్లు కరీంనగర్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ ఆర్. రవీందర్ తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యుత్ అంతరాయాలను వేగంగా గుర్తించి, తక్షణమే సరఫరా పునరుద్ధరించడమే ఈ ప్రణాళిక లక్ష్యమన్నారు. 'హైపర్' పేరుతో రూపొందించిన ఆరు అంచెల వ్యూహంలో కంట్రోల్ రూమ్ అప్రమత్తత, అదనపు సిబ్బంది మరియు సామాగ్రి ముందస్తు సిద్ధం, విద్యుత్ అంతరాయాలపై వేగవంతమైన సమాచార సేకరణ, ప్రణాళికాబద్ధమైన సిబ్బంది మోహరింపు, యుద్ధప్రాతిపదికన మరమ్మతులు, నిర్ణీత సమయంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ వంటి అంశాలు ఉన్నాయి.అలాగే ఎస్‌సిఏడిఏ, జిఐఎస్, ఓఎమ్ఎస్ వ్యవస్థలను కృత్రిమ మేధతో అనుసంధానించి ఫీడర్లలో తలెత్తే సాంకేతిక లోపాలను 7 నుంచి 21 రోజుల ముందే గుర్తించే విధంగా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. వాతావరణ పరిస్థితులను బట్టి విద్యుత్ డిమాండ్‌ను ముందుగానే అంచనా వేసే వ్యవస్థను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు.అటవీ ప్రాంతాలు, చేరుకోలేని ప్రాంతాల్లో విద్యుత్ లైన్ల పర్యవేక్షణకు డ్రోన్లను వినియోగిస్తున్నామని, ప్రతి సర్కిల్‌లో జీపీఆర్ఎస్ ట్రాకింగ్ సదుపాయం కలిగిన ఎమర్జెన్సీ రిస్టోర్ టీమ్ వాహనాలను సిద్ధంగా ఉంచామని వెల్లడించారు. ఈ చర్యలతో వర్షాకాలంలో విద్యుత్ అంతరాయాలు గణనీయంగా తగ్గి, వినియోగదారులకు మెరుగైన సేవలు అందుతాయని ఎస్ఈ ఆర్. రవీందర్ ఆశాభావం వ్యక్తం చేశారు.

# ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమంలో సిల్ట్ తొలగింపు

### పనులను పర్యవేక్షించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



కరీంనగర్ బ్యూరో, జూన్ 17 (జనంసాక్షి) : కరీంనగర్ నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగరాన్ని పరిశుభ్రంగా, ఆరోగ్యవంతంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపడుతున్న ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం రోజు 22, 33, 41, 50వ డివిజన్లలో నిర్వహిస్తున్న మురుగు కాలువల సిల్ట్ తొలగింపు పనులను మేయర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో పేరుకుపోయిన సిల్ట్‌ను పూర్తిస్థాయిలో తొలగించి, వర్షాకాలంలో నీటి నిల్వలు, మురుగునీటి ప్రవాహానికి ఆటంకాలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగర ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సేవలు అందించడం నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మురుగు కాలువల శుభ్రపరిచే పనులను మరింత వేగవంతం చేయాలని, ఎక్కడా మురుగు నీరు నిల్వ ఉండకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని, అందరూ పరిశుభ్రతకు సహకరించాలని మేయర్ కోరారు. నగర అభివృద్ధి, పరిశుభ్రత కోసం ప్రభుత్వం, నగరపాలక సంస్థ చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. నగరంలోని అన్ని డివిజన్లలో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరంగా కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమం లో కార్పొరేటర్లు బోయినపల్లి ప్రవీణ్ రావు, బండ రమణారెడ్డి, నాంపల్లి రేణుక శ్రీనివాస్, హీనా ఆఫ్రిన్, ఏపీపీ చంద్ర, కో-ఆప్షన్ సభ్యులు బల్బీర్ సింగ్, అసిస్టెంట్ కమిషనర్ సువార్త, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆయా డివిజన్ల ప్రజలు పాల్గొన్నారు.


## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రవేశాలకు ఇంటింటికి ప్రచారం

### కళాశాల ప్రిన్సిపాల్ రాజిరెడ్డి

వీణవంక (జనం సాక్షి) : ప్రభుత్వ జూనియర్ కళాశాల వీణవంకలో ప్రభుత్వ జూనియర్ కళాశాల 2026- 27 విద్యా సంవత్సరానికి కళాశాలలో ప్రథమ సంవత్సరంలో విద్యార్థులకు చేర్పించ డానికి ప్రిన్సిపాల్ రాజిరెడ్డి కళాశాల అధ్యాపక బృందం పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల ఇంటింటి కి వెళ్లి ప్రచారం చేస్తూ అడ్మిషన్లు పెంచటానికి కృషి చేయుచున్నారు. కళాశాలలో గల మౌలిక వసతులను, బోధన అనుభవం గురించి వివరించుచున్నారు.అడ్మిషన్ పొందిన విద్యార్థులకు వెంటనే ఉచిత పాఠ్య పుస్తకాలను అందజేయుచున్నారు.ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ రాజిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

# వారం రోజుల్లో సాగునీరు ఇవ్వకపోతే రైతులతో మహాధర్నా

- కాళేశ్వరం నీటి విడుదలకు డిమాండ్
- లెఫ్ట్ కెనాల్ పనులు పునఃప్రారంభించాలి
- రైతుల ఆవేదనకు స్పందించిన ఎమ్మెల్యే
- ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరిక



కరీంనగర్ టౌన్, జూన్ 17 (జనంసాక్షి): కరీంనగర్ నియోజకవర్గంలోని కొత్తపల్లి మండల రైతులకు వారం రోజుల్లోగా సాగునీటిని అందించకపోతే రైతులతో కలిసి ఆచంపల్లి వద్ద మహాధర్నా చేపడతామని ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు చొరవ తీసుకుని వెంటనే కాళేశ్వరం ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బద్దిపల్లి గ్రామంలో రైతుల ఆహ్వానం మేరకు పంట పొలాలు, చెరువులను పరిశీలించిన గంగుల కమలాకర్‌కు రైతులు తమ సమస్యలను వివరించారు. వర్షాభావం కారణంగా బావులు ఎండిపోవడంతో పాటు నారుమడులు ఎండిపోయే ప్రమాదం ఉందని, వారం రోజుల్లో నీరు అందకపోతే తీవ్ర నష్టాలు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రైతులు అధైర్యపడవద్దని, సాగునీరు వచ్చే వరకు తమ తరపున పోరాడతానని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా వరద కాలువ మార్గంలో నీటిని మిడ్ మానేరు వరకు తరలించి కొత్తపల్లి మండలంలోని నాగులమల్యాల, బద్దిపల్లి, ఎలగందుల, బావుపేట, కమాన్‌పూర్, కొండాపూర్, శ్రీరాములపల్లి గ్రామాల చెరువులను నింపి సాగునీటిని అందించామని గుర్తు చేశారు. ప్రస్తుతం మేడిగడ్డ నుంచి వరద కాలువకు నీరు రాకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. అలాగే ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న లెఫ్ట్ కెనాల్ పనులను వెంటనే పునఃప్రారంభించాలని డిమాండ్ చేసిన ఆయన, ప్రభుత్వం స్పందించకపోతే రైతులతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు, బీఆర్ఎస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# 2 వేల కోట్ల బడ్జెట్ లేకుండా అంత స్కామ్ సాధ్యమా?

- హరీష్ వ్యాఖ్యలపై పొన్నం ప్రభాకర్ ఆగ్రహం



**హైదరాబాద్, జూన్17 (జనంసాక్షి) :** తెలంగాణ గురుకుల పాఠశాలల టెండర్లలో రూ.2,000 కోట్ల భారీ కుంభకోణం జరిగిందంటూ బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యాఖ్యలపై రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఘాటుగా స్పందించారు. సంక్షేమ శాఖల్లో మొత్తం టెండర్ల విలువే రూ.2 వేల కోట్లు లేనప్పుడు, అంత మొత్తంలో స్కాం జరిగిందని ఎలా అంటారుని మంత్రి పొన్నం ప్రశ్నించారు. ఆధారాలు లేకుండా బలహీన వర్గాల అభివృద్ధి కోసం పనిచేస్తున్న శాఖలపై విమర్శలు చేయడం సరికాదన్నారు. హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అసత్యమని, వాటిని నిరూపిస్తే ప్రభుత్వం దేనికైనా సిద్ధంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు. రాజకీయ లబ్ది కోసం నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని సూచించారు. బలహీన వర్గాల సంక్షేమాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, అలాంటి వర్గాలను మాటలతో కించపరచే ప్రయత్నాలు చేయొద్దని హితవు పలికారు. ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఆరోపణలు చేస్తే తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకోదని పొన్నం ప్రభాకర్ హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగించే లక్ష్యంతోనే సర్ పక్రియను తీసుకొచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ వ్యాఖ్యానించారు.

# సేవ్ ఆర్‌హెచ్ఎస్ పట్ల సానుకూలం

- స్థలాన్ని ప్రభుత్వానికి అప్పగించేందుకు నిర్ణయం
- హర్షం వ్యక్తం చేస్తున్న పూర్వ విద్యార్థులు

**వడ్డేపల్లి (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం శాంతినగర్‌లోని రవీంద్ర ఉన్నత పాఠశాల విషయంలో ముందడుగు పడింది. పాఠశాలను రక్షించుకునేందుకు పూర్వ విద్యార్థులంతా ఏకం కావడం, దేశవిదేశాల్లో ఉన్న నాటి విద్యార్థులంతా సేవ్ ఆర్‌హెచ్ఎస్ కోసం ముందుకు కదలడంతో స్కూల్ యాజమాన్య కమిటీ సానుకూలంగా స్పందించింది. పాఠశాల స్థలం, భవనాలు సర్కారు పరిధిలోకి ఇవ్వడానికి కమిటీ సుముఖత వ్యక్తం చేసింది. నేడు పాఠశాలలో సమావేశం జరిపి తీర్మానం చేసేందుకు నిర్ణయించారు. ఈ ప్రకటన వెలువడగానే పూర్వ విద్యార్థుల్లో హర్షాతిరేకలు వ్యక్తమయ్యాయి. స్కూలు కమిటీ సహకరించడం గొప్ప విషయమని, యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల జ్ఞాపకాలు చెదిరిపోకుండా ఉండేందుకు సోషల్ మీడియా (వాట్సప్) వేదికగా ఒక్కొక్కరుగా గొంతు కలపడంతో సేవ్ ఆర్‌హెచ్ఎస్ ఉద్యమం నలుదిశలా వ్యాపించిన విషయం విదితమే. ఈ క్రమంలో స్కూల్ కమిటీ బుధవారం సానుకూలంగా స్పందించింది. అయితే స్థలం, భవనం ప్రభుత్వపరం అయ్యేవరకూ ఉద్యమించాలని పూర్వ విద్యార్థులు సంకల్పంతో ఉన్నారు. దీనికి స్థానికుల నుంచి సైతం మద్దతు లభిస్తుండటం గమనార్హం.




# విద్యుత్ తీగలకు అడ్డంగా చెట్లు

**కొమ్మలు నరుకుతుండగా షాక్‌తో కూలీ మృతి**

**హైదరాబాద్, జూన్17 (జనంసాక్షి) :** నగరంలోని అల్వాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎంఈఎస్ కాలనీలో ఒక విషాదకర సంఘటన చోటుచేసుకుంది. ఒక అపార్ట్‌మెంట్ ముందున్న చెట్టు కొమ్మలను నరుకుతున్న సమయంలో ఒక దినసరి కూలీ ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. కరెంట్ సరఫరా అవుతున్న తీగలు తగలడంతో సూర్యనారాయణ (45) అనే ఆ కూలీ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు.మృతుడు సూర్యనారాయణ రోజువారీ కూలీ పనులు చేస్తూ తన కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఆయన మరణంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాద ఛాయలు అలముకున్నాయి. సూర్యనారాయణకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. ఇంటిని నడిపించే పెద్ద దిక్కును కోల్పోవడంతో ఆ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఘటనపై సమాచారం అందుకున్న అల్వాల్ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.

# రాష్ట్రంలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే..

- కార్యకర్తలు కథానాయకులు కావాలి
- సాగు రంగాన్ని కాంగ్రెస్ సంక్షోభంలోకి నెట్టింది
- ఎస్ఐఆర్ ప్రక్రియపై అప్రమత్తత అవసరం
- పాలేరు బీఆర్ఎస్ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**ఖమ్మం రూరల్, జూన్ 17 (జనం సాక్షి) :** రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తిరిగి కేసీఆర్ సీఎం కావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గ పరిధిలోని ఏదులాపురం మున్సిపాలిటీ అందుగల హర్ష కన్వెన్షన్ హాల్‌లో పాలేరు నియోజకవర్గ స్థాయి పార్టీ బూత్ లెవెల్ ఏజెంట్ల సమావేశం జరిగింది. పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ఎస్ ఐ ఆర్ ప్రక్రియ, పార్టీ సభ్యత నమోదు అంశాలపై కార్యకర్తలు, నాయకులకు దిశా నిర్దేశం చేశారు. రాష్ట్రంలో గజదొంగ పాలన కొనసాగుతుంటే.. ఖమ్మం జిల్లాలో ఘరానా దొంగల పాలన కొనసాగుతుందన్నారు. జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా జిల్లా ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. దాచుకోవడం దోచుకోవడం తప్ప జిల్లా అభివృద్ధికి వారు పాటుపడిందేమి లేదని స్వార్థ ప్రయోజనాల కోసమే పాలన కొనసాగిస్తున్నారన్నారు.'రాష్ట్రంలో మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే' డిజిటల్ సభ్యత్వ నమోదులో యువత క్రియాశీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. జిల్లా పర్యటనకు వచ్చిన యువ నేత కేటీఆర్ కు అటు హెల్ప్ వద్ద ఇటు సభా ప్రాంగణం వద్ద కార్యకర్తలు నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, ఎమ్మెల్సీలు తక్కలపల్లి రవీందర్రావు, తాత మధుసూదన్, మాజీ ఎమ్మెల్యేలు మెచ్చ నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, జిల్లా పరిషత్ మాజీ అధ్యక్షుడు లింగాల కమల్ రాజ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి, దిండిగాల రాజేందర్, మరికంటి ధనలక్ష్మి, పాలేరు నియోజకవర్గ నాలుగు మండలాల పార్టీ మాజీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, భాషపోయిన వీరన్న, పున్నం బ్రహ్మయ్య, వేముల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

# కోటగిరి దేవాలయాల్లో హుండీలు చోరీ

- హుండీలను పగులగొట్టి డబ్బు చోరీ చేసిన దొంగలు



**నిజామాబాద్, జూన్17 (జనంసాక్షి) :** నిజామాబాద్ జిల్లా కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ అయ్యప్ప, సాయిబాబా దేవాలయాల్లో బుధవారం తెల్లవారుజామున గుర్తుతెలియని ఇద్దరు దుండగులు ఆలయంలోకి చొరబడి రెండు హుండీలను చోరీ చేసినట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. కోటగిరిలోని శ్రీ అయ్యప్ప, సాయిబాబా దేవాలయంలో అర్ధరాత్రి ఒంటిగంట తర్వాత గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు ముఖానికి నల్లని ముసుగు ధరించి ఆలయంలోకి చొరబడ్డారు. దేవాలయంలోని గర్భగుడి తాళాలు పగలగొట్టి, గర్భగుడిలో ఉన్న రెండు హుండీలను తీసుకొని పరారయ్యారు. దేవాలయం పక్కనే ఉన్న కాలువలో హుండీల తాళాలు పగల కొట్టి డబ్బులను తీసుకువెళ్లారు. హుండీలను అక్కడే కాలువలో పడేశారు. దేవాలయానికి సంబంధించిన తాళాలను వ్యవసాయ పొలాల్లో అక్కడక్కడ పడేశారు. దేవాలయం కమిటీ సెక్రటరీ నిశాంత్ ఫిర్యాదు మేరకు క్లూస్ టీంను రంగంలోకి దించి వివరాలను సేకరిస్తున్నామని, దొంగలను త్వరలోనే పట్టుకుంటామన్నారు. హుండీలనుంచి సుమారుగా రూ.40 వేలకు పైగా ఉండవచ్చని చెప్పారు.

# జొన్నల కొనుగోలుకు లంచం డిమాండ్

- మనస్తాపంతో రైతు ఆత్మహత్య



**ఆదిలాబాద్, జూన్17 (జనంసాక్షి) :** రైతుల ఆత్మహత్యలు కొనసాగుతూనే ఉన్నాయి. అప్పులు చేసి పంటలు పండిస్తే కొనేనాథుడు లేక వర్షాలకు ధాన్యం తడిసిపోయి రైతులు అప్పులు తీర్చే మార్గం లేకపోవడంతో బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. తాజాగా ఆదిలాబాద్ జిల్లాలో మరో రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం పొన్న గ్రామానికి చెందిన నుగూరే పాండురంగ్(48) అనే రైతు తాను పండించిన జొన్న పంటను విక్రయించేందుకు మే 23న తేదీన సిరికొండ కొనుగోలు కేంద్రానికి తీసుకెళ్లాడు. హమాలీలకు డబ్బులు చెల్లించిన అనంతరం లారీలో లోడ్ చేసేందుకు అదనంగా డబ్బులు ఇవ్వాలని కొనుగోలు కేంద్రం సిబ్బంది డిమాండ్ చేశారు. తన దగ్గర డబ్బులు లేవని చెప్పినా అధికారులు పట్టించుకోలేదని, పది రోజులైనా జొన్నలు లోడ్ చేయలేదని మనస్తాపంతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

# ఉస్మానియా డెంటల్ కాలేజీలో ర్యాగింగ్ కలకలం

- జూనియర్ విద్యార్థులతో వెట్టి చేయించిన సీనియర్లు
- 12మంది సీనియర్ విద్యార్థులను సస్పెండ్ చేసిన ప్రిన్సిపాల్




**హైదరాబాద్, జూన్17 (జనంసాక్షి) :** హైదరాబాద్ నగరంలోని ఉస్మానియా డెంటల్ కాలేజీలో ర్యాగింగ్ ఉదంతం కలకలం రేపింది. దీనిపై సుల్తాన్ బజార్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మరోవైపు ర్యాగింగ్‌కు పాల్పడ్డ పలువురు విద్యార్థులను ఆరునెఉలలపాటు బహిష్కరించినట్లు ప్రిన్సిపల్ సర్జీవ్ సింగ్ యాదవ్ వెల్లడించారు. జూన్ తొమ్మిదో తేదీన కాలేజీలో ప్రథమ సంవత్సరం చదువుతున్న బీడీఎస్ విద్యార్థులు తమపై సీనియర్లు ర్యాగింగ్‌కు పాల్పడుతున్నారంటూ లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన కాలేజీ యాజమాన్యం, ఆ రోజే సదరు ఫైల్ ఇయర్ విద్యార్థులను పిలిపించి గట్టిగా మందలించింది. యాజమాన్యం హెచ్చరించిన 24 గంటలు తిరగకముందే సీనియర్ విద్యార్థులు మరోసారి ర్యాంకింగ్‌కు పాల్పడ్డారు. నిబంధనలను ఉల్లంఘించి ర్యాగింగ్‌కు పాల్పడిన మొత్తం 12 మంది విద్యార్థులను కాలేజీ నుంచి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సర్జీవ్ సింగ్ యాదవ్ మాట్లాడుతూ.. 'జూనియర్లతో సీనియర్లు ఆల్కహాల్, సిగరెట్లు తెప్పించడంతో పాటూ కూలర్లలో నీళ్లు నింపడం వంటి పనులు చేయిస్తూ వేధించేవారు. ర్యాగింగ్ భయంతో మూడో సంవత్సరం చదువుతున్న కొందరు బాధితులు హాస్టల్ గదుల నుంచి బయటకు రావడానికి కూడా భయపడిపోయారు. ర్యాగింగ్‌కు పాల్పడిన థర్డ్ ఇయర్ విద్యార్థులపై గతంలోనూ ఎన్నో ఫిర్యాదులు వచ్చాయి. గత ఏడాది డిసెంబర్ 31వ తేదీన హాస్టల్లోని సీసీ కెమెరాలను పగలగొట్టడమే కాకుండా, ఇతర విద్యార్థులను కూడా తీవ్రంగా ఇబ్బంది పెట్టారు. ఆ సమయంలో వారిపై చర్యలు తీసుకోవడానికి సిద్ధమవ్వగా, సదరు విద్యార్థులు యాజమాన్యానికి క్షమాపణలు చెప్పి, మరోసారి ఇలాంటి తప్పులు చేయబోమని నమ్మించారు. కానీ, వాళ్ల బుద్ధి మారలేదు.. మరోసారి అదే తరహా ప్రవర్తనతో జూనియర్లను వేధించారు. ఈ క్రమంలోనే 12 మంది విద్యార్థులను సస్పెండ్ చేశాం అని తెలిపారు. అలా చేయడం వల్ల పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రుల బాధ్యత కూడా ఎంతో ఉంటుందని కాలేజ్ యాజమాన్యం అభిప్రాయం అని అన్నారు. ఇది వారికి గుణపాఠం కావాలన్నారు. అలాగే మిగతా వారికి ఓ హెచ్చరిక అన్నారు. ఇదిలావుంటే ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకిదిగారు.

# ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఇంటి ముందు ధర్నా

- నేరుగా జీతాలు చెల్లించాలని పంచాయతీ కార్మికుల డిమాండ్



**వేములవాడ, జూన్17 (జనంసాక్షి) :** గ్రామపంచాయతీలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులు వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నివాసాన్ని ముట్టడించారు. వేములవాడ పట్టణం తెలంగాణ చౌక్ నుంచి ఎమ్మెల్యే నివాసం వరకు ర్యాలీగా వెళ్లిన కార్మికులు ఎమ్మెల్యే నివాసం ముందు బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎల్లారెడ్డి, రమణ మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలో భాగంగా గ్రీన్ ఛానల్ ద్వారా 50 కోట్ల రూపాయలను విడుదల చేసి కార్మికులకు నేరుగా వేతనాలు అందించాలన్నారు. ప్రతి కార్మికునికి 26వేల రూపాయల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

జీవో నెంబర్ 51ని సవరించి మల్టీ పర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేసి రెండవ పీఆర్సీ పరిధిలోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్మికులకు ఉద్యోగ భద్రతను కల్పిస్తూ మృతి చెందిన కుటుంబాలకు నష్టపరిహారం కూడా అందించాలన్నారు. ఈ నిరసన కార్యక్రమంలో పంచాయతీ కార్మికుల జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్, గణేశ్, సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

# టెక్సాస్‌లో హైవేపై కుప్పకూలిన విమానం

- ఒకరు మృతి..కాక్‌పిట్ బద్దలు కొట్టి బయటపడ్డ ఐదుగురు



**వాషింగ్టన్, జూన్17 (జనంసాక్షి) :** అమెరికాలోని టెక్సాస్‌లో మంగళవారం రాత్రి విమాన ప్రమాదం చోటుచేసుకుంది. ఓ మినీ విమానం లారెడోలోని హైవేపై కుప్పకూలింది. కూలిన వెంటనే మినీ విమానంలో మంటలు చెలరేగాయి. దీంతో హైవేపై ఒక్కసారిగా అలజడి మొదలైంది. కొంతమంది విమానం నుంచి దూరంగా పారిపోయారు. మరికొంతమంది మాత్రం వెంటనే సాయం కోసం రంగంలోకి దూకారు. తమ వాహనాలను వదిలేసి మరీ మినీ విమానంలో చిక్కుకుపోయిన వారికి సాయం చేయడానికి పూనుకున్నారు. విమానం కాక్‌పిట్‌ను బద్దలు కొట్టారు. లోపల ఉన్న వారిని బయటకు తీసుకువచ్చారు. ఈ సంఘటనపై పోలీసులు మాట్లాడుతూ.. 'లారెడోలో దాదాపు రాత్రి 10 గంటల సమయంలో మినీ విమానం కుప్పకూలింది. ప్రమాదం జరిగిన సమయంలో మినీ విమానంలో ఆరుగురు వ్యక్తులు ఉన్నారు. వారిలో ఒకరు మృత్యువాతపడ్డారు. హైవేపై వెళుతున్న వాహనదారులకు గాయాలు అయ్యాయా అన్నది తెలియాల్సి ఉంది. ప్రమాదం నేపథ్యంలో హైవేను రెండు వైపుల నుంచి మూసి వేశామని తెలిపారు. ప్రత్యక్ష సాక్షి ఒకరు మాట్లాడుతూ.. 'నేను నా సహోద్యోగి ఇంటికి కారులో వెళుతున్నాను. ఆ సమయంలో విమానం హైవేపై కుప్పకూలింది. నేను నా కారును ఆపేశాను. వీడియో రికార్డు చేస్తూ విమానం దగ్గరకు వెళ్లాను. విమానంలో ఇరుక్కుపోయిన ఓ వ్యక్తి కాక్‌పిట్ విండో బద్దలు కొట్టడానికి ప్రయత్నించసాగాడు. కొద్దిసేపటి తర్వాత పెద్ద సంఖ్యలో జనం అక్కడి వచ్చారు. బయటి వైపు నుంచి అద్దాన్ని బద్దలు కొట్టారు. లోపల ఉన్న వారిని బయటకు తీసుకువచ్చారని చెప్పారు. ఈ సంఘటనకు సంబంధించిన వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# గ్యాస్ వినియోగదారులకు మెలిక

- 30లోగా కెవైసీ, బయోమెట్రిక్ చేసుకోవాలి

**న్యూఢిల్లీ, జూన్17 (జనంసాక్షి) :** వంటగ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ చేసింది. ఉజ్వల పథకం లబ్దిదారులతో పాటు సబ్సిడీ పొందుతున్న సాధారణ గ్యాస్ వినియోగదారులు కూడా జూన్ 30 లోగా తమ బయోమెట్రిక్ పక్రియను కచ్చితంగా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ఈ గడువులోగా బయోమెట్రిక్ పూర్తి చేయని వారి ఖాతాల్లో సబ్సిడీ జమ కాకుండా నిలిపివేయనున్నారు. ఏడాదిగా ఈ-కేవైసీ పక్రియ కొనసాగుతున్నా ఇంకా పూర్తి కాకపోవడంతో ఈ నెల 30లోపు పూర్తి చేయాలని కేంద్రం నిర్దేశించింది. ఒకవేళ జూన్ 30 గడువు దాటిన తర్వాత బయోమెట్రిక్ పూర్తి చేసుకుంటే.. ఆ తేదీ తర్వాత తీసుకునే సిలిండర్లకు మాత్రమే సబ్సిడీ లభిస్తుంది. గడువు ముగిసిన రోజు నుంచి బయోమెట్రిక్ పూర్తయ్యే మధ్య కాలంలో తీసుకునే సిలిండర్లపై సబ్సిడీని పూర్తిగా కోల్పోవాల్సి వస్తుందని కేంద్రం తన సర్క్యులర్‌లో స్పష్టం చేసింది. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ మే 18న జారీ చేసిన ప్రకటన ప్రకారం.. బయోమెట్రిక్ పక్రియ పూర్తి కాలేదనే నెపంతో వినియోగదారులకు గ్యాస్ సిలిండర్ల సరఫరాను మాత్రం ఎట్టిపరిస్థితుల్లోనూ నిలిపివేయకూడదు. అయితే, క్షేత్రస్థాయిలో అందుతున్న సమాచారం ప్రకారం.. బయోమెట్రిక్ పూర్తి చేయని వారికి సిలిండర్ల డెలివరీని ఆలస్యం చేయాలని లేదా నిలిపివేయాలని ఆయిల్ కంపెనీల నుంచి గ్యాస్ డీలర్లకు అనధికారిక ఆదేశాలు అందినట్లు తెలుస్తోంది. పశ్చిమాసియా సంక్షోభం కారణంగా అంతర్జాతీయంగా ఇంధన ధరలు పెరగడంతో, ఇటీవల జూన్ 7న సిలిండర్ ధరను రూ.29 మేర పెంచారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో సబ్సిడీ లేని గృహోపయోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.994 పలుకుతోంది. కేంద్రం ఉజ్వల పథకం కింద ప్రతి సిలిండర్‌పై రూ.300 సబ్సిడీ ఇస్తుండగా, మిగిలిన అర్హులైన సాధారణ వినియోగదారుల బ్యాంక్ ఖాతాల్లో స్వల్ప మొత్తంలో సబ్సిడీ జమ అవుతోంది. మరోవైపు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన కుటుంబాలకు రూ.500 లకే గ్యాస్ సిలిండర్ అందిస్తోంది. రాష్ట్రంలో సుమారు 1.26 లక్షలకు పైగా క్రియాశీలక గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం ఇండియన్ ఆయిల్, బీపీసీఎల్, హెచ్‌పీసీఎల్ కంపెనీలు బయోమెట్రిక్ అప్‌డేట్ చేసుకోని వారి వివరాలను రాష్ట్ర ప్రభుత్వాలతో కూడా పంచుకోనున్నాయి. గ్యాస్ కనెక్షన్ తీసుకున్నప్పటి నుంచి ఇప్పటివరకు ఒక్కసారి కూడా బయోమెట్రిక్ అప్‌డేట్ చేయని వారు వెంటనే తమ పరిధిలోని గ్యాస్ ఏజెన్సీని సంప్రదించి ఈ పక్రియను పూర్తి చేసుకోవాలి. జూన్ 30 లోగా ఈ పని పూర్తి చేసుకుంటేనే ఎలాంటి అంతరాయం లేకుండా సబ్సిడీ డబ్బులు నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ అవుతాయి. గ్యాస్ కనెక్షన్లను ఆధార్‌తో అనుసంధానం చేయడంతో పాటు ముఖ గుర్తింపు, వేలిముద్రలు లేదా ఐరిస్ వంటి మూడు విధానాలతో ఎల్‌పీజీ వినియోగదారుల ఈ-కేవైసీని పూర్తి చేయనున్నారు. ఈ పక్రియ కోసం వినియోగదారులే నేరుగా ఆయిల్ కంపెనీల మొబైల్ యాప్ ద్వారా ఈ-కేవైసీ పూర్తి చేసుకోవచ్చు. గ్యాస్ ఏజెన్సీల డీలర్ల వద్ద ఈ-కేవైసీ పూర్తి చేసేందుకు కూడా అవకాశం కల్పించారు. కొన్ని గ్యాస్ ఏజెన్సీలు గ్యాస్ సిలిండర్ డెలివరీ సమయంలోనే ఈ పక్రియను పూర్తి చేస్తున్నాయి.

# విద్యార్థిపై ప్రిన్సిపాల్ కుమారుడు లైంగిక వేధింపులు

**బాలుడి కుటుంబం ఫిర్యాదు**

**అహ్మదాబాద్ (జనంసాక్షి) :** ఒక విద్యార్థిని ప్రిన్సిపాల్ కుమారుడు లైంగికంగా వేధించాడు. హాస్టల్‌లో నివసిస్తున్న ఆ బాలుడ్ని తన రూమ్‌కు తీసుకెళ్లి అసహజ లైంగిక చర్యలకు పాల్పడ్డాడు. ఈ విషయం తెలిసిన బాలుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఈ సంఘటన జరిగింది. పేద గిరిజన కుటుంబానికి చెందిన బాలుడు ప్రైవేట్ స్కూల్ హాస్టల్‌లో ఉంటూ పదో తరగతి చదివాడు. ప్రిన్సిపాల్ కుమారుడు అతడితో పరిచయం పెంచుకున్నాడు. ఆ తర్వాత బాలుడిని తన గదికి తీసుకెళ్లి పలుమార్లు లైంగికంగా వేధించాడు. అసహజ లైంగిక చర్యలకు పాల్పడ్డాడు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370